ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 149 పేజీలు: 8+16 వెల: 6.50



ప్రకృతి సంపదకు ఈశాన్య భారతం పుట్టినిల్లు: ప్రధాని
కరాచీలో భీకర ఉగ్రదాడి: నలుగురు సైనికులు మృతి
5


34వ పురస్కారం

## ప్రధాని మోడీకి సీషెల్స్ అత్యున్నత అవార్డు

'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజాన్' ను అందించిన అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ



ఆదివారం విక్టోరియాలో ప్రధాని మోడీకి 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజాన్'ను అందజేస్తున్న పాట్రిక్

**విక్టోరియా,జూన్ 28:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా సీషెల్స్ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారమైన "గార్డియన్ ఆఫ్ ది బ్లూ హురైజన్"ను ప్రదానం చేసింది. హరిత భవిష్యత్తు కోసం ప్రధాని మోడీదార్శనికతను ఈ అవార్డు గుర్తించింది. ప్రస్తుతం ప్రధాని మోడీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్‌లో ఉన్నారు. ఆదేశ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యటనలో భాగంగా ఆయన సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో సమావేశమయ్యారు. అంతకుముందు, ప్రధానికి స్టేట్ హౌస్‌లో గౌరవ వందనం లభించింది. ఈ సందర్భంగా, మేడ్ ఇన్ ఇండియా ఫాస్ట్ ప్యాట్రోల్ వెసెల్ పీఎస్ లెస్ప్వార్‌తో పాటు ఆరు >>2

# ఒట్టేసి చెబుతున్నా..

## మూసీ ప్రక్షాళన చేసి తీరుతా

- రైతుల కోసం రూ. 1.56 లక్షల కోట్ల వ్యయం
- బిఆర్ఎస్ అంటే ఎలక్షన్, కలెక్షన్ మాత్రమే
- వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బిసి పూర్తి
- నల్లగొండ బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి
- రూ.13,006 కోట్లతో 6,092 కి.మీ. హ్యామ్ రోడ్లకు కనగల్‌లో శ్రీకారం
- రూ. 83 కోట్ల మంచినీటి పథకానికి శంకుస్థాపన



ఆదివారం నల్లగొండ బహిరంగ సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. సభకు హాజరైన అశేష ప్రజానీకం

**నల్గొండ. ప్రతినిధి. జూన్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన తొలి నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అయితే, ఆయన తర్వాత మంత్రి పదవిని త్యాగంచేసిన ఏకైక నాయకుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది ప్రాణత్యాగాలతో రాష్ట్రం ఏర్పడితే, ఆ త్యాగాలను బీఆర్ఎస్ నాయకులు తమ ఖాతాలో వేసుకోవడం సరికాదని విమర్శించారు. బీఆర్ఎస్ త్యాగం అంటే ఎలక్షన్, సెలక్షన్, కలెక్షన్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలోని ఏఎంసీ మార్కెట్ యార్డు సమీపంలో నల్గొండ-దేవరకొండ రహదారిపై రూ.13,006.27 కోట్ల వ్యయంతో 34 ప్యాకేజీల్లో 6,092.37 కిలోమీటర్ల మేర 441 హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) రహదారుల విస్తరణ, పటిష్టీకరణ పనులకు శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.83 కోట్లతో చేపట్టనున్న తాగునీటి సరఫరా పథకం (ఫేజ్1) పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఎన్జీ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. త్యాగాల పునాదులపై అధికారంలోకి వచ్చామని బీఆర్ఎస్ నాయకులు పదేపదే చెబుతున్నారని, రాజీనామాలు చేయడం, ఎన్నికలు తెచ్చుకోవడం, కలెక్షన్లు చేసుకోవడమే త్యాగమా అని ప్రశ్నించారు. కొండా >>2



నల్లగొండ సభలో ప్రసంగిస్తున్న డి.సిఎం భట్టి. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మా

## ధ్యేయం

నల్లగొండ సభలో డి.సిఎం భట్టి

**నల్గొండ. ప్రతినిధి. జూన్ 28, ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే మా ఎజెండా.. ప్రజల అవసరాలే మా ప్రాధాన్యత డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఎన్జీ కళాశాల మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల పరిష్కారానికే ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ నిధులు కేటాయించామని తెలిపారు. చేతుల మీదుగా రూ.13వేల కోట్లహ్యామ్ రోడ్లకు భూమి పూజ జరిగిందని, ఆధ్వర్యంలో >>2

38 లక్షల మంది చిన్నారులకు

## 'చుక్కలు'

మొదటిరోజే పల్స్ పోలియో 95.1% పూర్తి



హైదరాబాద్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహా, మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 28:** రాష్ట్రంలో విజయవంతంగా తొలి రోజు పల్స్ పోలియో కార్యక్రమాన్ని పూర్తి చేసినట్టు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. మొదటి రోజు 38.95 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ చేసినట్టు తెలిపారు. నేడు(సోమవారం) రేపు(మంగళవారం) డోర్ టు డోర్ క్యాంపెయిన్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందన్నారు. రాష్ట్రంలో 5 >>2



అసెంబ్లీని రద్దు

## చెయ్ ఎన్నికలకు రా..

సత్తా ఏంటో తేల్చుకుందాం

సిఎం రేవంత్‌కు హరీష్‌రావు సవాల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం రేవంత్‌రెడ్డికి దమ్ము,ధైర్యం ఉంటే ఇప్పుడే అసెంబ్లీని రద్దు చేసి ముందస్తు ఎన్నిలకు రా... ఎవరి సత్తా ఏంటో ప్రజాక్షేత్రంలోనే >>2

# వచ్చే అధికారం బిజెపిదే

## డబులింజన్ సర్కార్‌తోనే వికసిత తెలంగాణ



ఆదివారం రంగారెడ్డిలో బిజెపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నవీన్, రాంచందర్‌రావు

- బిజెపి కార్యాలయాలు ప్రజాసేవా కేంద్రాలు
- రంగారెడ్డి పార్టీ ఆఫీసును ప్రారంభించిన పార్టీ చీఫ్ నితిన్ నబీన్
- వర్చువల్‌గా 9 జిల్లాల కార్యాలయాలు ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్28:** మూడు రోజుల పర్యటన నిమిత్తం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్నారు. అనంతరం రంగారెడ్డి గ్రామీణ జిల్లా బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల బీజేపీ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు.కొత్తగా ప్రారంభించుకున్న బిజెపి జిల్లా కార్యాలయాలు పార్టీ సిద్ధాంతాలను ప్రతిబింబించే సంకల్ప కేంద్రాలు, ప్రజలకు అండగా నిలిచే సేవా కేంద్రాలని స్పష్టం చేశారు. నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ అనే నినాదంతో పనిచేసే బిజెపి కార్యకర్తలకు ఈ కార్యాలయాలు స్ఫూర్తి కేంద్రాలుగా నిలుస్తాయని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విపక్షంలో ఉన్న బీజేపీ ప్రజాపోరాటాలు చేయాలని సూచించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పోరాడాలన్నారు. ప్రజాసేవ, పోరాటాల ద్వారానే అధికారంలోకి రాగలుగుతామని వెల్లడించారు.పార్టీని అధికారంలోకి తెస్తానని ప్రతి కార్యకర్త సంకల్పం తీసుకోవాలని సూచించారు. పశ్చిమ్‌బెంగాల్‌లో కార్యకర్తల సంకల్పం వల్లే ఘనవిజయం సాధించామని చెప్పారు. బెంగాల్ స్ఫూర్తిగా తెలంగాణలోనూ పోరాడాలని పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. త్వరలో తెలంగాణలోనూ కాషాయజెండా ఎగరాలి. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుందన్నారు. 1984లో లోక్‌సభలో 2 సీట్లతో ప్రారంభమైన బీజేపీ >>2

# బాంబులు దూస్తున్న ఇరాన్



- పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు
- కువైట్, బహ్రెయిన్‌లోని యుఎస్ స్థావరాలపై ఇరాన్ దాడులు
- ప్రపంచ పటం నుంచి ఇరాన్‌ను చెరిపేస్తాం: ట్రంప్ తీవ్ర హెచ్చరిక

**కువైట్‌సిటీ, జూన్ 28:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మరింత తీవ్రరూపం దాల్చాయి. తమ భూభాగంపై అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) సంచలన చర్యకు దిగింది. కువైట్, బహ్రెయిన్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బలగాలు ఆదివారం క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఈ ఆకస్మిక పరిణామంతో ఆ ప్రాంతంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా పక్కకుపోయి, ఉభయ దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం మొదలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హర్మూజ్ జలసంధి సమీపంలో ఉన్న తమ క్షిపణి కేంద్రాలు, డ్రోన్ గిడ్డంగులు, తీరప్రాంత రాడార్ స్థావరాలపై అమెరికా జరిపిన దాడులకు సమాధానంగానే తాము ఈ సైనిక చర్య చేపట్టినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను కువైట్ వైమానిక రక్షణ వ్యవస్థలు మధ్యలోనే అడ్డుకోగా.. బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక కేంద్రాల పరిసరాల్లో భారీ అలజడి రేగింది. ఈ దాడుల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

ఈ దాడుల అనంతరం ఇరాన్ నావికాదళం అమెరికాకు తీవ్ర హెచ్చరికలు చేసింది. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు 'నరకాన్ని చూస్తాయని' వ్యాఖ్యానించింది. అమెరికాయే మొదట శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, హర్మూజ్ జలసంధిలో తమ నిబంధనలను పాటించని నౌకలపై మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇరాన్ గనుక ఇలాగే ఒప్పందాలను ఉల్లంఘిస్తూ పోతే వాషింగ్టన్ సైనికపరంగా ఈ కథను ముగించాల్సి వస్తుందని హెచ్చరించారు.

అలాంటి పరిస్థితి వస్తే ప్రపంచ పటంలో 'ఇరాన్ అనే దేశమే ఇకపై ఉనికిలో ఉండదు' అంటూ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. హర్మూజ్ జలసంధిలో >>2



6 లక్షల ఎకరాల్లో

## వరికి కోత

10 % తగ్గించాలని యోచన

- రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటలపైనే వ్యవసాయ శాఖ దృష్టి
- యేటా 5 లక్షల చొప్పున 25 లక్షల ఎకరాల్లో తగ్గించాలన్న లక్ష్యం
- తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు కేంద్రం మార్గదర్శకాలు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో వరి సాగును తగ్గించడానికి వ్యవసాయ శాఖ ప్రయత్నిస్తోంది. సగటున ప్రతి సీజన్‌లో 60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, ఈ ఏడాది దీన్ని కనీసం 10 శాతం చొప్పున 6లక్షల ఎకరాల్లో నాట్లు తగ్గించాలని యోచిస్తోంది. ఇప్పటికే బోనస్ పథకంలో 33 రకాలను 8 రకాలకు తగ్గించగా, తాజాగా వరి సాగును కూడా తగ్గించేందుకు అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. వరి కి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడానికి, వ్యవసాయ శాఖ రైతులకు అవకాశాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగా పప్పుధాన్యాలు, చిన్న ధాన్యాలు పండించడమే లక్ష్యంతో ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా రైతు సమావేశాలు నిర్వహిస్తూ, వరిసాగును తగ్గించి ఇతర పంటలు పండించాలని సూచిస్తున్నారు. దీనివల్ల నీటి వినియోగం, సాగు ఖర్చులు తగ్గుతాయని, కరువు నిరోధక శక్తి పెరుగుతుందని, నేల >>2

## విస్తరించిన 'నైరుతి'

తెలంగాణ, ఏపిలో భారీ వర్షాలకు అవకాశం



ఈ శాన్యం లోనూ అధిక వర్షపాతం

వాతావరణ శాఖ అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 28:** నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా దాదాపు 22 రాష్ట్రాల్లో విస్తరించాయి. మరింతగా విస్తరిస్తున్నందున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఉరుములు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) అంచనా వేసింది. ఐఎండి ప్రకారం, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లోకి మరింతగా విస్తరించడానికి తోడ్పడుతున్నాయి. తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. కర్ణాటకలో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం >>2



## 22°

పడిపోయిన ఉష్ణోగత్రలు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇదే సమయంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అక్కడక్కడ చిరు జల్లుల నుండి స్వల్ప వర్షం కురిసింది. రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో అత్యధికంగా 38.6 డిగ్రీల సెల్సియస్ >>2



పివి నరసింహారావు జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించిన సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్

## పివి నర్సింహారావుకు నివాళులు అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్28:** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు.పీవీ చిత్రపటానికి నివాళులు అర్పించినవారిలో సిఎంతో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా ఉన్నారు.

## విస్తరించిన 'నైరుతి'

>> ఉండగా, అండమాన్, నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన ఉరుములతో కూడిన ఈదురు గాలులు సంభవించవచ్చు. అసోం, మేఘాలయ, ఉపహిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం సహా ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి హెచ్చరిక జారీ చేసింది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, బీహార్, హర్యానాలలో వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉంది.

**జులై 4 వరకు తెలంగాణలో భారీ వర్షాలు**

రాబోయే ఏడు రోజులలో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన గాలులు, ఈదురు గాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఐఎండి అంచనాల ప్రకారం, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, అక్కడక్కడా మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

కొన్ని ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు చేరవచ్చు. ఈ వాతావరణ పరిస్థితుల కారణంగా తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. ఆదివారం సంగారెడ్డిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో 30.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్‌లో రాబోయే రోజుల్లో వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులతో పాటు ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. జులై 1 వరకు అడపాదడపా జల్లులు పడే అవకాశముంది. నగరంలోని కొన్ని ప్రాంతాలు, చుట్టుపక్కల ప్రాంతాలలో మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో చెదురుమదురుగా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## 22° పడిపోయిన ఉష్ణోగ్రతలు

>> ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లాలో 35.6 డిగ్రీలు, మంచిర్యాలలో 36 డిగ్రీలు, కరీంనగర్‌లో 35.2 డిగ్రీలు, ఆసిఫాబాద్ జిల్లాలో 35.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. ఇక మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం అత్యల్పంగా 22.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ప్లానింగ్ సొసైటీ వెదర్ డేటా ప్రకారం రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 25 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పరిశీలిస్తే శేరిలింగంపల్లిలో అత్యల్పంగా 24.7 డిగ్రీలు, రాజేంద్రనగర్, మూసాపేట, యూసుఫ్‌గూడలో 24.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంలోని బేగంపేటలో 35.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా రాష్ట్రంలోనే మహబూబాద్ జిల్లాలో అత్యధికంగా 20.4 మిల్లీ మీటర్ల వర్షపాతం (స్వల్ప) రికార్డయింది. సూర్యాపేట్‌లో 11 మిల్లీ మీటర్లు, పెద్దపల్లిలో 11.1 మిల్లీ మీటర్లు, కరీంనగర్‌లో 18.4 మిల్లీ మీటర్లు, జనగామలో చెదురుమదురు జల్లుల నేపథ్యంలో 12.5 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదయింది.

## 6 లక్షల ఎకరాల్లో వరికి కోత

>> సారవంతం మెరుగుపడుతుందని, రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని వ్యవసాయ శాఖ తెలిపింది. వరి పొలాల్లో పప్పుధాన్యాలు, వేరుశనగ, ఉల్లిపాయలు, టమోటాలు, మిరపకాయలు, వంకాయలు, తమలపాకులతో పాటు ఇతర పంటలు కూడా వేయాలని రైతులకు సూచిస్తున్నారు. ఇదే సమయంలో పామాయిల్‌ను దీర్ఘకాలిక పంటగా కూడా ప్రోత్సహిస్తున్నారు. కాగా, దేశవ్యాప్తంగా వరి ధాన్యం నిల్వలు భారీగా పేరుకుపోతుండటం, ఇతర నిత్యావసర పంటల ఉత్పత్తి క్షీణిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెలంగాణతో పాటు, వివిధ రాష్ట్రాలకు ఖరీఫ్‌లో వరి సాగు పై కేంద్రం పలు సూచనలు చేసింది. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పాటు, తెలంగాణలో కూడా వరి సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించాలని స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ విధంగా దేశవ్యాప్తంగా రాబోయే ఐదేళ్ల కాలంలో మొత్తం 2.50 కోట్ల ఎకరాల్లో వరి సాగును తగ్గించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే ప్రతి ఏటా 50 లక్షల ఎకరాల వరి సాగును తగ్గించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో ఏటా 5 లక్షల ఎకరాల చొప్పున, ఐదేళ్లలో మొత్తం 25 లక్షల ఎకరాల మేర వరి విస్తీర్ణాన్ని తగ్గించాలని కేంద్ర లక్ష్యాన్ని విధించింది. జాతీయ స్థాయిలో కేంద్రం నిర్దేశించిన మొత్తం లక్ష్యంలో ఒక్క తెలంగాణ వాటానే దాదాపు 10 శాతంగా ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో గత కొన్ని ఏళ్లుగా వరి సాగు రికార్డు స్థాయిలో పెరుగుతోంది. తెలంగాణలో 2023-24లో 1.18 కోట్ల ఎకరాలుగా ఉన్న వరి సాగు, 2024-25 నాటికి 1.27 కోట్ల ఎకరాలకు చేరింది. ప్రస్తుత సంవత్సరానికి ఇది 1.32 కోట్ల ఎకరాలు దాటే అవకాశం ఉందని అంచనా. ఈ భారీ ఉత్పత్తి కారణంగా ఎఫ్‌సీఐ గిడ్డంగుల్లో నిల్వలకు స్థలం దొరకడం లేదు.

దేశంలో వరి పంట విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, పప్పుధాన్యాలు, నూనెగింజలు, పామాయిల్ సాగు విస్తీర్ణం ఘోరంగా పడిపోతోంది. ఫలితంగా ఏటా రూ. 1.50 లక్షల కోట్లకు పైగా నిధులను వెచ్చించి ఇతర దేశాల నుండి వీటిని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ వ్యయాన్ని తగ్గించి దేశీయంగా స్వయంసమృద్ధి సాధించాలంటే పంట మార్పిడి అనివార్యమని కేంద్రం స్పష్టం చేసింది.

## ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి: గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్28:** రాష్ట్రంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాపిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

## తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి : సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్28:** పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా భాగస్వాములు కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. పోలియో చుక్కలు చిన్నారులకు జీవితాంతం రక్షణ కవచంలా నిలుస్తాయి. చిన్నారుల ఆరోగ్యవంతమైన జీవితానికి పోలియో చుక్కలు తోడ్పడతాయి. ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని సీఎం తల్లిదండ్రులను కోరారు.

## బాంబులు దూస్తున్న ఇరాన్

>> ప్రయాణిస్తున్న 'కికు' అనే అంతర్జాతీయ చమురు నౌకపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడికి ప్రతిచర్యగా అమెరికా సైన్యం దాడులు ప్రారంభించింది. అమెరికా వరుసగా రెండోరోజు కూడా ఇరాన్ స్థావరాలను ధ్వంసం చేయడంతో ఇచాన్ క్షిపణి దాడులకు దిగింది. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం పొంచి ఉంది.

### వారం - వర్జ్యం

29-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పౌర్ణమి తె.5.26, మూల తె.4.03
వర్జ్యం : రా.2.16-తె.4.03
దు.మ.12.37-మ.1.29,
2) మ.3.14-సా.4.06
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - ఉ.7.30-9.00

### వారాఫలం

**మేషం:** శ్రమకు ఓర్చి మీవంతు సహాయం అందిస్తారు. ఉచిత సలహాలు ఇవ్వకండి. పొదుపు పథకాలు అంది వస్తాయి.

**వృషభం:** దూరమైన ఆప్తులు దగ్గరవుతారు సంతాన విద్యావరంగా అభివృద్ధి కనిపిస్తుంది. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు.

**మిథునం:** అన్యాక్రాంతమైన భూములు, ఇవ్వవలసిన ఋణాలు మొదలయిన విషయాలన్నీ మీకు అనుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం:** సంతాన క్షేమం పురోభివృద్ధి సాధిస్తారు. కాలానుగుణంగా ప్రవర్తించడమే విజయానికి మార్గమని గుర్తించండి.

**సింహం:** ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** క్రెడిట్‌కార్డు, పాస్‌పోర్టు వంటివి ఇతరులకు అప్పగించవద్దు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**తుల:** పొలము, స్థిరాస్తుల తాలూకు ధనము చేతికి వస్తుంది. తప్పుడు లెక్కలు, అబద్ధములు మీ దృష్టికి వస్తాయి.

**వృశ్చికం:** సన్మానాలు, సత్కారాలతో హడావిడిగా కాలం గడుపుతారు. నరఘోష అధికమవుతుంది. బంధువుల కలయిక.

**ధనుస్సు:** కుటుంబంలో ఏర్పడే స్పర్థలు చిన్నపాటి వివాదాలు సర్దుకుంటాయి. దీర్ఘకాలిక సమస్యలను మాత్రం కాలానికి వదిలివేస్తారు.

**మకరం:** ఎంత సాధించినా ఇంకా సాధించాలనే తృప్తి లేని ధోరణి మానసిక ప్రశాంతతను దూరం చేస్తుంది.

**కుంభం:** ఆదర్శప్రాయంగా జీవితం గడపాలనుకొని అందుకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకుంటారు.

**మీనం:** ప్రభుత్వ సంబంధమైన చిక్కులను అతియుక్తిగా తప్పించుకోగలుగుతారు. వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఒట్టేసి చెబుతున్నా..

>> లక్ష్మణ్ బాపూజీ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన త్యాగాలను ఏమనాలని ప్రశ్నిస్తూ, తెలంగాణ వచ్చిన తర్వాతే కోమటిరెడ్డి మంత్రి పదవి చేపట్టారని గుర్తు చేశారు. శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి వంటి అమరవీరుల త్యాగాలను గుర్తు చేసిన సీఎం, వారి త్యాగాలతో పోలిస్తే బీఆర్ఎస్ చెప్పుకునే త్యాగం ఏమిటని నిలదీశారు. బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పుల్లోకి నెట్టారని, వందేళ్లకు సరిపడా విధ్వంసం చేశారని ఆరోపించారు. రాష్ట్ర సంపదను దోచుకున్నారని, బావా-బామ్మర్ది తోడేళ్లలా తిరిగారని విమర్శించారు. ప్రజలు మళ్లీ తమను అధికారంలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, వాస్తవానికి ప్రజలు కాదని, వారి కుటుంబమే అధికారాన్ని కోరుకుంటోందన్నారు. అసెంబ్లీలో చర్చకు సవాల్... కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని, పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల బీజేపీ పాలన, రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రత్యేక అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు ఏర్పాటు చేసి చర్చిద్దామని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మేనిఫెస్టోలపై కూడా చర్చకు సిద్ధమని, ప్రతిపక్షాలు స్పీకర్, కౌన్సిల్ చైర్మన్‌కు లేఖ ఇస్తే ప్రజల ముందే వాస్తవాలు తేల్చుకుందామని అన్నారు. మహిళలు, పేదల సంక్షేమమే లక్ష్యం బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శించిన సీఎం, తమ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం లక్షలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందన్నారు. దొడ్డు బియ్యం ఇచ్చి పేదలను అవమానించారని, ఇప్పుడు ప్రతి సంవత్సరం రూ.16 వేల కోట్లతో మూడు కోట్ల 28 లక్షల మందికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్, జన్వాడలో ఉన్న కేటీఆర్ తింటున్న సన్నబియ్యమే నేడు పేదల పిల్లలు కూడా తింటున్నారని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్లే పేదల ఆత్మగౌరవం పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం నాలుగున్నర లక్షల ఇళ్లను పేదలకు మంజూరు చేసిందని తెలిపారు. పేదలు ఇళ్లు కట్టుకుంటే కొందరికి కళ్లకుడుతున్నాయని విమర్శించారు. గజ్వేల్‌లో కేసీఆర్ వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌస్, జన్వాడలో కేటీఆర్ ఫామ్‌హౌస్, శంకర్‌రెడ్డిపల్లిలో మరో ఫామ్‌హౌస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయినా రికార్డు స్థాయిలో ధాన్యం పండించామని పేర్కొన్నారు. కాళేశ్వరం కాదు... కూలేశ్వరం లక్ష కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు చివరకు కూలేశ్వరంగా మారిందని సీఎం విమర్శించారు. ఒకప్పుడు కాళేశ్వర్ రావు అని చెప్పించుకున్న వారు, ప్రాజెక్టు దెబ్బతిన్న తర్వాత అటువైపు కూడా చూడలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. వందేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, 30 నెలల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టామని తెలిపారు. ప్రజాపాలన కొనసాగాలా.. పాపాల పాలన రావాలా? ప్రజాపాలన పోయి మళ్లీ పాపాల భైరవుడి పాలన రావాలా అని ప్రశ్నించిన సీఎం, రూ.27 వేల కోట్ల రైతు భరోసా, రూ.20 వేల కోట్ల రైతు రుణమాఫీ, స్కిల్ యూనివర్సిటీ, అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని అన్నారు. ఎస్ఎల్‌బీసీ, మూసీపై హామీ.. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పదేళ్ల పాటు నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం బీఆర్ఎస్‌దేనని ఆరోపించారు. మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మూసీ కాలుష్యం వల్ల నల్గొండ జిల్లాలో వికలాంగ పిల్లలు పుడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒట్టు వేసి చెబుతున్నా... మూసీ ప్రక్షాళన చేసి తీరుతా" అని ప్రకటించారు. మూసీ ప్రక్షాళనకు ఎవరైనా అడ్డొస్తే సహించబోమని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్, లీకేజీలు, సింగరేణిపై విమర్శలు భార్యాభర్తల ఫోన్లు కూడా విన్న పాలన మళ్లీ రావాలా? ప్రశ్నాపత్రాలు లీక్ చేసి కోట్లు సంపాదించిన పాలన కావాలా? రేషన్ కార్డులు అడిగిన పేదలను కొట్టించిన ప్రభుత్వం మళ్లీ రావాలా? కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించిన పాలనను ప్రజలు అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ఎవరినీ ఇబ్బంది పెట్టలేదన్నారు. సింగరేణిలో టెండర్లు లేకుండానే దోపిడీ జరిగిందంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఉద్యమంలో యువత ప్రాణాలను బలితీసుకుని, అధికారంలోకి వచ్చాక తెలంగాణను ఎలా దోచుకున్నారో ప్రజలకు తెలుసన్నారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు.


2034 వరకు కాంగ్రెస్‌దే అధికారం.. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి, మూసీ ప్రక్షాళనను పూర్తి చేస్తామని మరోసారి హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, 2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది అని ధీమా వ్యక్తం చేశారు. మహిళల అభివృద్ధితోనే కుటుంబం, గ్రామం, రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ లు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కేతావత్ బాలు నాయక్, మందుల సామేల్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కుందూరు జైవీర్ రెడ్డి, నల్లమాద పద్మావతి, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం ,రోడ్లు భవనాలు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మా ధ్యేయం

>> సీఆర్ఐఎఫ్, ఇతర ప్రణాళిక నిధులతో కలిపి దాదాపు రూ. 23 వేల కోట్ల రహదారి నిర్మాణ కార్యక్రమాన్ని పండుగలా ప్రారంభించారని కొనియాడారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల ద్వారా మొత్తం రూ.90 వేల కోట్లతో రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం దశాబ్దకాలం పాటు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. సూచనల మేరకు ముఖ్యమంత్రి ప్రాజెక్టు ప్రాంతాలను సందర్శించి, అవసరమైన నిధులు సమకూర్చి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు. గత ప్రభుత్వం అధికార అహంకారంతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం మానవీయ కోణంలో ప్రజల అవసరాలను తీర్చే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని భట్టి పేర్కొన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికేనని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు, వేధింపులు ఎదుర్కొంటూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలను ఆయన అభినందించారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల ప్రజల విశ్వాసానికి ప్రతిఫలంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి, భయరహిత పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

**రూ.78 వేల కోట్లతో తెలంగాణ రహదారుల రూపురేఖలు మారుస్తాం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన రహదారుల అభివృద్ధికి తమ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రాష్ట్ర నిధులతో రూ.6,500 కోట్ల పనులతో పాటు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిధులు కలిపి సుమారు రూ.78 వేల కోట్లతో తెలంగాణ రహదారుల రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో కనీసం గుంతలు కూడా పూడ్చని పరిస్థితి నుంచి నేడు తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కొత్త ఊపిరి పోస్తున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.6,500 కోట్ల నిధులను కేటాయించి రహదారుల అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతోందని తెలిపారు. పరిశ్రమల స్థాపన, స్థానిక యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రతి మండల కేంద్రాన్ని జిల్లా కేంద్రంతో డబుల్ రోడ్ల ద్వారా అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. దీంతో యువత సొంత ఊర్లోనే ఉపాధి పొందుతూ తల్లిదండ్రులను, వ్యవసాయాన్ని చూసుకునే అవకాశం కలుగుతుందన్నారు. జిల్లాలో సుమారు 50 వేల మంది ముస్లింల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక షాదీఖానా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆగస్టు చివరి నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు పూర్తిచేసి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ తర్వాత నల్లగొండలోనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఉన్న నగరంగా అభివృద్ధి చెందిందన్నారు. ఏఎంఆర్ కాల్వ అభివృద్ధికి రూ.450 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ, మరో రూ.500 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



ఆదివారం విక్టోరియాలో ప్రధాని మోడీ, సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న ఇరు దేశాల విదేశాంగ మంత్రులు

## ప్రధాని మోడీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

>> అంబులెన్స్‌లు, 10 యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ బోట్లను సీషెల్స్‌కు ప్రధాని మోడీ అందజేశారు. ఈ సహాయం సీషెల్స్ సముద్ర నిఘా సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. అనంతరం ఇరు దేశాల నేతలు కలిసి సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన కోకో డి మెర్ మొక్కను నాటారు. ప్రధాని మోడీకి అంతర్జాతీయ పురస్కారాలు రావడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది మే నెలలో ఆహార భద్రతకు చేసిన సేవలకు గాను ఫుడ్‌అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అత్యున్నత పురస్కారం అగ్రికోలా మెడల్‌అందుకున్నారు. గతంలో 2018 లో సియోల్ శాంతిబహుమతి, ఐక్యరాజ్యసమితి ఛాంపియన్స్ ఆఫ్‌దిఎర్త్ అవార్డులు కూడా ఆయనను వరించాయి.

## 38 లక్షల మంది చిన్నారులకు 'చుక్కలు'

>> సంవత్సరాల లోపు పిల్లలు 40,97,749 మంది ఉంటారని అంచనా వేయగా, అందులో 38,95,550 మంది (95.1 శాతం) చిన్నారులకు తొలి రోజే పోలియో చుక్కల పంపిణీ పూర్తయిందని, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పల్స్ పోలియో బూత్‌లకు పెద్ద ఎత్తున తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించడం పట్ల కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సహకారం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా సాగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించామని కమిషనర్ తెలిపారు.

రంగారెడ్డి జిల్లా 99 శాతం కవరేజ్‌తో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవగా, భద్రాద్రి కొత్తగూడెం 98.9 శాతం, మెదక్ 98.6 శాతం, ములుగు, వనపర్తి జిల్లాలు 98.2 శాతం, జయశంకర్ భూపాలపల్లి 98.1 శాతం కవరేజ్ సాధించాయన్నారు. హైదరాబాద్ జిల్లాలో 93.1 శాతం కవరేజ్ నమోదైందన్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి నేడు, రేపు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశాఖ బృందాలు పోలియో చుక్కలు వేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు.

## ఎన్నికలకు రా..

>> చూసుకుందామని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు సవాల్ విసిరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో నల్గొండలో సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై హరీష్‌రావు కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి పరిపాలన గాలికి వదిలేసి తన ఎత్తు, భౌతిక రూపంపై దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.మా ఎమ్మెల్యేలను లాక్కొని ప్రగల్భాలు పలకడం కాదు రేవంత్‌రెడ్డి దమ్ముంటే వారితో రాజీనామా చేయించి ఎన్నికల బరిలోకి రావాలని..జనం ఎవరిని ఉప్పుపాతర వేస్తారో తేల్చుకుందామని సవాల్ విసిరారు.2034 దాకా కుర్చీ నీదే అని పగటికలలు కనడం కాదు నీ పాలనపై నీకు అంత దమ్ముంటే ఇప్పుడే సిఎం పదవికి రాజీనామా చేసి ఎన్నికలకు రావాలన్నారు.ఉద్యమకారులపై తుపాకి గురిపెట్టి..సోనియాను బలిదేవత అన్న నువ్వా...లాఠీదెబ్బలు తిని 300 కేసులు ఎదుర్కొన్న మా త్యాగాలపై మాట్లాడేదని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీలో బిఆర్ఎస్ 12 కిలో మీటర్లు తవ్వితే...నువ్వు 12 మీటర్లు తవ్వలేక 8 మంది అమాయక కార్మికులను బలితీసుకున్నా హంతక సర్కార్ అన్నారు.కుర్చీ కదులుతోందన్న భయం నిన్ను వెంటాడుతోంది..అందుకే నిద్రలోనూ కెసిఆర్, కెటిఆర్, నన్నే కలవరిస్తూ రోజు బిఆర్ఎస్ నామస్మరణ చేస్తున్నావన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతగాక బిఆర్ఎస్‌ను తిట్టడడమే పనిగా పెట్టుకున్నారని సిఎంపై మండిపడ్డారు.నల్గొండ ఫ్లోరైడ్ రక్కసికి కారణం 60 యేండ్ల పాలించిన కాంగ్రెస్,డిడిపిలు కాదా ఆ ఫ్లోరైడ్ బాధను తీర్చి నల్గొండ బిడ్డలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందించింది కెసిఆరే అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కొండం సంపత్‌రెడ్డి, గుండు భూపేష్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌లాల్, సాయిరాం, ధర్మవరం బ్రహ్మం, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే అధికారం బిజెపిదే

>> ఇప్పుడు అప్రతిహతంగా సాగుతోందన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం సుష్మాస్వరాజ్ ఎంతో పోరాడారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ వల్లే తెలంగాణ కల సాకారమైందన్నారు. పార్టీని కార్యకర్తలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బిజెపిదే విజయమని తెలియజేశారు. బెంగాల్ లో జరిగిందే.. తెలంగాణలోనూ జరుగుతుందని, ఆ రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని కోరారు. కాంగ్రెస్‌తో పాటు ప్రాంతీయ పార్టీల అవకాశవాద రాజకీయాలపై నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా, అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలనే సంకల్పంలో తెలంగాణ కూడా భాగస్వామ్యం కావాలని, కేంద్ర నిధులతో తెలంగాణ అభివృద్ధికి మోదీ కట్టుబడి ఉన్నారనీ, అలాగే రాష్ట్రంలో కూడా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితేనే సంపూర్ణ ప్రగతి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు బిజెపి కార్యకర్తలకు ఒక కొత్త పోరాటానికి నాంది అని, ప్రతి ఒక్కరూ సంపూర్ణ శక్తి సామర్థ్యాలతో పోరాడి జిహెచ్ఎంసీ మున్సిపల్ ఎన్నికల్లో కమలాన్ని వికసింపజేయాలని పిలుపునిచ్చారు. 1980లో స్థాపించబడిన బిజెపి నేడు దేశంలోని 22 రాష్ట్రాలలో అధికారంలో ఉంటూ నిరంతరం ఎదుగుతోందని, రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని నితిన్ నబిన్ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గారు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, బిజెపి తమిళనాడు,కర్ణాటక రాష్ట్రాల కోఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు, వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

**నితిన్ నబీన్‌కు స్వాగతం పలికిన కిషన్‌రెడ్డి,బండి సంజయ్**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణలో మూడు రోజులపాటు పర్యటించనున్నారు. హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న నితిన్ నబీన్‌కు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. నితిన్ నబీన్ జాతీయ అధ్యక్షుడు అయ్యాక రెండోసారి రాష్ట్రానికి వచ్చారు.

# పివి దూరదృష్టే నేటి భారత అభ్యున్నతికి దిక్సూచి

## గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూన్ 28, ప్రభాతవార్త :** భారతదేశ ఆర్థిక సంస్కరణగా పి.వి.నరసింహారావు వేసిన పునాదులే నేటి భారత అభ్యున్నతికి దిక్సూచి నిలిచి సునంపన్నం చేస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా అన్నారు. ఆధునిక భారత ఆర్థిక వ్యవస్థ సంస్కరణల శిల్పి, మాజీ ప్రధానమంత్రి భారతరత్న పి.వి.నరసింహారావు 105వ జయంతి వేడుకలు పి.వి.నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఘనంగా జరిగాయి. పి.వి. జయంతి వేడుకల్లో భాగంగా ట్రస్ట్ వార్షిక సన్మాన కార్యక్రమంలో భాగంగా రక్షణరంగంలో ముందున్న సంస్థలు, విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థలు, వ్యక్తులను గవర్నర్ శివ్‌ప్రతాప్ జాకెట్లతో ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపి ప్రసంగించారు. తెలంగాణ గడ్డపైపుట్టి దేశ ప్రధానమంత్రిగా ఎదిగిన పి.వి.నరసింహారావు ఈ నేల సంస్కృతి, సంప్రదాయాల విలువలను ఎప్పుడూ హృదయాల్లో పెట్టుకున్నారని అన్నారు.

పివి గొప్ప రాజనీతిజ్ఞుడే కాకుండా బహుభాషా కోవిదుడు, రచయిత, దార్శనికుడని కొనియాడారు. దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆర్థిక సంస్కరణలతో దేశానికి సరికొత్త దిశానిర్దేశం కావించిన ఘనత నరసింహారావుకే దక్కుతుందని నొక్కిచెప్పారు. స్వచ్ఛంద రక్తదానం మానవత్వానికి మారుపేరని, రక్తాన్ని ప్రయోగశాలలో తయారు చేయలేమని, కేవలం నిస్వార్థ మానవ హృదయం నుండే లభిస్తుందని గవర్నర్ అన్నారు. పి.వి ఆశయాలకు అనుగుణంగా జ్ఞానం, నీతి నిజాయితీ, దేశసేవకు పునరంకితం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు మాజీ సభ్యుడు, ప్రముఖ సినీనటుడు, వ్యాపారవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత మాగంటి మురళీమోహన్, చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డా. ఎన్.వి.సుధాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.




12వ రాష్ట్రస్థాయి షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని స్వర్ణపతకాన్ని సాధించిన మాజీ డిజిపి అంజనీకుమార్

# 'షూటింగ్'లో మాజీ డిజిపి అంజనీకుమార్‌కు 'గోల్డ్'

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** గచ్చిబౌలిలోని ఫైరింగ్ రేంజ్‌లో అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన 12వ తెలంగాణ రాష్ట్ర స్థాయి షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మాజీ డిజిపి అంజనీకుమార్ పాల్గొన్నారు. రైఫిల్, పిస్టల్ కేటగిరీల్లో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ఆయన 25 మీటర్ల పిస్టల్ షూటింగ్ ఈవెంట్‌లో పోటీపడ్డారు. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఎంతోమంది నిపుణులైన షూటర్లు ఈ పోటీలో పాల్గొన్నప్పటికీ.. అంజనీకుమార్ తన అపారమైన పోలీస్ శిక్షణ అనుభవాన్ని, మానసిక ఏకాగ్రతను ఉపయోగించి టార్గెట్‌ను కచ్చితత్వంతో ఛేదించారు. అత్యధిక పాయింట్లతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలవడమే కాకుండా స్వర్ణ పతకాన్ని గెలుచుకుని అందరినీ ఆశ్చర్య పరిచారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోని క్రీడాకారులు పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మక పోటీలలో మిగిలిన స్థానాల కోసం కూడా గట్టి పోటీ నడిచింది. అంజనీకుమార్ గోల్డ్‌మెడల్ సాధించగా.. ఇదే కేటగిరీలో తీవ్రంగా శ్రమించిన ప్రముఖ షూటర్ షఫాత్ అలీ ఖాన్ తృటిలో అగ్రస్థానాన్ని చేజార్చుకుని రజత పతకాన్ని దక్కించుకుని రెండో స్థానంలో నిలిచారు. అలాగే మరో ప్రతిభావం తమైన క్రీడాకారుడు అగా మహ్మద్ హుస్సేన్ మూడో స్థానాన్ని దక్కించుకుని కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. విజేతలకు క్రీడా అసోసియేషన్ ప్రతి నిధులు, ఉన్నతాధికారులు పతకాలను అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని రాష్ట్ర పోలీస్ బాస్ స్థానాన్ని అధిరోహించిన మాజీ డిజిపి అంజనీకుమార్ పదవీవిరమణ పొందినా తన గురి తప్పలేదని నిరూపించుకున్నారు.



నప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్‌కి బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# దేశ ప్రయోజనాలే ప్రధాని మోడీకి ప్రధానం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (సికిందరాబాద్), జూన్ 28, ప్రభాతవార్త:** సికింద్రాబాద్, బౌద్ధ నగర్ డివిజన్‌లో బీజేపీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి ప్రధాని మోదీ ఖిమన్‌కీ బాత్ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వీక్షి ంచారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రిగా స్థానిక, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై నిరంతరం దృష్టి సారిస్తూ, అదే సమయంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా దేశ ప్రజలతో మన్ కీ బాత్ ద్వారా మమేకం కావడం ప్రధాని మోడీ ప్రత్యేకతన్నారు. దేశంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలను విశ్లేషిస్తూ, ప్రజలకు అవసరమైన కీలక అంశాలపై అవగాహన కల్పించే అత్యంత ప్రభావవంతమైన వేదికగా మన్ కీ బాత్ నిలిచిందన్నారు. అనేక సామాజిక సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ వంటి పలు అంశాలపై ప్రధాని ప్రజలను చైతన్యపరుస్తూ, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యాన్ని పెంచుతున్నారన్నారు. ప్రపంచంలో మరే దేశంలోనూ లేని విధంగా, ప్రతి నెలా కోట్లాది ప్రజలతో నేరుగా మమేకమై దేశానికి మార్గనిర్దేశం చేసే నాయకత్వం భారత ప్రధాని నరేంద్ర మోడిదేనన్నారు. క్రీడలు, పర్యాటకం, సంస్కృతి, ఆవిష్కరణలు, యువత సాధనలు వంటి అనేక రంగాల్లో ప్రధాని అందిస్తున్న సందేశాలు కోట్లాది మంది ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో దేశ ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ సవాళ్ల నేపథ్యంలో ప్రధాని కీలక సందేశం ఇచ్చారని చెప్పారు. విదేశీ మారక ద్రవ్యంగా లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి బంగారం దిగుమతి చేసుకుంటున్నందున, బంగారం కొనుగోళ్లను తగ్గించాలని సూచించారని, అవసరాన్ని బట్టి వినియోగంలో జాగ్రత్త పాటించాలని మాత్రమే చెప్పారని తెలిపారు. ప్రధాని మోదీ పిలుపు తర్వాత బంగారం కొనుగోళ్లలో 70 శాతం తగ్గుదల కనిపించడం, దేశ ప్రజల్లో ప్రధాని నాయకత్వంపై ఎంతటి విశ్వాసం ఉందో తెలియజేస్తోందని వివరించారు.

# అయోధ్య విరాళాల చోరీ కేసులో టిన్నూయాదవ్, 30 మంది ఇళ్లల్లో సోదాలు

## అనూహ్యంగా పెరిగిన నిందితుల ఆస్తులు

## కొలిక్కి వస్తున్న సిట్ దర్యాప్తు

**అయోధ్య, జూన్ 28:** అయోధ్య శ్రీరామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీ కేసులో దర్యాప్తు సంస్థల విచారణ ఎదుర్కొంటున్న పలువురు నిందితుల ఆస్తులు అనూహ్యంగా పెరిగినట్లు సమాచారం. కొందరి నికర ఆస్తులు అత్యంత తక్కువ కాలంలోనే పలు రెట్లు పెరిగినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలుస్తోంది. చట్టబద్ధమైన ఆదాయానికి మించి భూములు, నివాస స్థలాలు, హోటళ్ల వంటి ఖరీదైన ఆస్తులను కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. అక్రమ లావాదేవీలకు సంబంధించిన ఆర్థిక ఆధారాలను కూడా సేకరిస్తున్నారు. విరాళాల పంపకాల విషయంలో నిందితుల మధ్య తలెత్తిన విభేదాల కారణంగానే ఈ భారీ చోరీ వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ కేసులో టిన్నూ యాదవ్ సహా మొత్తం 30 మందిపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగిస్తోంది. దర్యాప్తు ప్రారంభమైన విషయం తెలిసిన వెంటనే నిందితులు డిజిటల్ ఆధారాలను తొలగించే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు. పలువురు తమ మొబైల్ ఫోన్లలోని వాట్సాప్ చాట్లు, ఇతర డేటాను డిలీట్ చేయగా, కొందరు ఫోన్లను పూర్తిగా ఫార్మాట్ చేసినట్లు వెల్లడైంది. ఈ ఘటనతో ఆలయ భద్రతా వ్యవస్థపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంట్రోల్



రూమ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది. సిట్ దర్యాప్తు పూర్తైన తర్వాత శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు చెందిన కొందరు అధికారుల పాత్రపైనా విచారణ కొనసాగుతోంది. ఇప్పటివరకు వారికి ఎలాంటి క్లీన్ చిట్ ఇవ్వలేదని సమాచారం. ఎనిమిది మంది అరెస్ట్‌ఈ కేసులో అవినాశ్ శుక్లా, అనుషల్ మిశ్రా, లవకుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామ్ శంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ్, రామశంకర్ అలియాస్ టిన్నూ యాదవ్ సహా ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

వీరి ఇళ్లలో సోదాలు నిర్వహిస్తూ చోరీకి గురైన నగదు ఎక్కడికి వెళ్లిందనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అరెస్టైన వారంతా ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన నగదు, నగల లెక్కింపు ప్రక్రియలో పనిచేసిన వారేనని అధికారులు తెలిపారు. నిందితుల కుటుంబ సభ్యులను కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఆలయ ప్రారంభోత్సవం తర్వాత వారు సంపాదించిన ఆస్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. అనుషల్ మిశ్రా ఆలయ ట్రస్ట్‌లో ఉద్యోగం ప్రారంభించిన తర్వాత అతని కుటుంబ జీవనశైలి పూర్తిగా మారిపోయిందని అతని అత్త నేహా మిశ్రా పోలీసులకు తెలిపినట్లు సమాచారం.

దర్యాప్తులో ఇప్పటివరకు సుమారు రూ.7.75 కోట్ల విరాళాలు దుర్వినియోగమైనట్లు గుర్తించగా, అందులో రూ.80 లక్షలు మాత్రమే ఇప్పటివరకు స్వాధీనం చేసుకోగలిగారు.

# దక్షిణాఫ్రికా విమానప్రమాదంలో సీతంపేట యువకుడు మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** దక్షి ణాఫ్రికా విమాన ప్రమాదంలో హసన్‌పర్తి మం డలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఆడెపు సుమంత్ (25) దుర్మరణం చెందాడు. ఆడెపు వర లక్షి ్మ చంద్రమోహన్ దంపతుల చిన్న కుమారుడైన సుమంత్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజి నీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీర్ పూర్తి చేసుకున్నాడు. గత 8 నెలలుగా దక్షి ణాఫ్రికాలో సుమంత్ పైలెట్‌గా శిక్షణ పొందుతున్నాడని, ఇందులో భాగంగానే శనివారం దక్షి ణాఫ్రికాలోని జోహెన్నస్‌బర్గ్‌లో సుమంత్ విమానాన్ని స్టార్ట్ చేసిన కొద్ది నిమిషాలకే ప్రమాదం జరిగిందని సమాచారం. విమానం కూలడానికి సాంకేతిక లోపమా, ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నట్టు సమాచారం. విమానం ప్రమాదానికి గురైన సమయంలో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు పైలెట్లలో ఒకరు సీతంపేట గ్రామానికి చెందిన యువకుడు ఆడెపు సుమంత్ కాగా, ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆడెపు సుమంత్ మరణ వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. దీంతో సీతంపేట

# ఢిల్లీ హెల్త్ సదస్సుకు మంత్రి దామోదర

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై చర్చ

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** సోమవారం ఢిల్లీలో జరిగే 16వ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (సీసీహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ) సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరు కానున్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్‌ప్రకాశ్ నడ్డా అధ్యక్షతన జరగ నున్న సమావేశంలో మంత్రి పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగా నికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర, రాష్ట్రాల మధ్య చర్చలు జరగను న్నాయి. అలాగే ప్రజారోగ్య సేవల మెరుగుదల, జాతీయ ఆరోగ్య కార్యక్ర మాల అమలు, డిజిటల్ హెల్త్ అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. అన్ని రాష్ట్రాల ఆరోగ్య మంత్రులు పాల్గొననున్న కీలక సమావేశంలో తెలం గాణ తరపున మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొని రాష్ట్ర ప్రయోజ నాలకు సంబంధించిన అంశాలను సమావేశంలో ప్రస్తావించనున్నారు.

# కొత్త చీఫ్‌సెక్రటరీ సంజయ్‌జాజుకు చిరంజీవి శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్య దర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్‌జాజుకు టాలీవుడ్ మెగాస్టార్, సీనియర్ హీరో చిరంజీవి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఐఏఎస్ అధికారిగా సంజయ్‌జాజుకు ఉన్న క్లీన్ ఇమేజ్, సమర్థత రాష్ట్ర ప్రగ తికి ఎంతగానో తోడ్పడతాయని చిరంజీవి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. అం దులో 'తెలంగాణ కొత్త చీఫ్ సెక్రటరీగా నియమితులైన సంజయ్ జాజుకి నా హృదయపూర్వక అభినందనలు. మీకున్న నిబద్ధత, ముందుచూపు, సుదీర్ఘ పరిపాలనా అనుభవం మిమ్మల్ని సరైన సమయంలో ఈ అత్యున్నత పదవికి తగిన లీడర్‌గా నిలబెట్టాయి. మీ సమర్థవంతమైన పరిపాలనా నాయ కత్వంలో రాష్ట్రం మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని నేను బలంగా నమ్ముతున్నాను. వ్యక్తిగతంగా నాకు మీరు ఎల్లప్పుడూ ఒక మంచి స్నేహి తుడి కంటే ఎక్కువగా, ఒక బ్రదర్ లాంటివారు. ఈ ప్రతిష్టాత్మకమైన బాధ్య తల్లో మీరు అఖండ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, మీకు ఎల్లప్పుడూ నా బెస్ట్ విషెస్' అని చిరంజీవి పేర్కొన్నారు. కాగా చిరంజీవితో సంజయ్ జాజుకు దశాబ్దాల కాలంగా అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గతంలో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా కలెక్టరుగా, ఐటీ శాఖ కార్య దర్శిగా, సివిల్ సప్లైస్ కమిషనర్‌గా పనిచేసిన కాలం నుండి వీరిద్దరి మధ్య మంచి అనుబంధం కొనసాగుతోంది.

# డైట్, సిటిఇ, ఐఎఎస్‌ఇ, ఎస్‌సిఇఆర్‌టిల్లో పోస్టుల భర్తీ

## 202 పోస్టులను భర్తీ చేయనున్న పాఠశాల విద్యా శాఖ

## జిహెచ్‌ఎం, ఎస్‌ఎలు అర్హులు.. రాతపరీక్ష ద్వారా డిప్యుటేషన్‌పై నియామకం

## నోటిఫికేషన్ జారీ చేసిన పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** పాఠశాల విద్యను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని డైట్, సీటీఈ, ఐఏఎస్ఈ, ఎస్‌సీఈఆర్‌టీలను బలోపేతం చేయ డం కోసం వాటిల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయను న్నారు. అయితే వీటిని ప్రస్తుతానికి డిప్యూటే షన్‌లో ఫారన్ సర్వీస్‌లో భర్తీ చేయనున్నారు. గెటిటెడ్ హెడ్మాష్టర్స్ (జీహెచ్‌ఎం), స్కూల్ అసిస్టెం ట్స్ ఇందుకు అర్హులుగా పేర్కొంటూ పాఠశాల విద్య శాఖ ఆదివారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మొత్తం 202 పోస్టులను డిప్యూటేషన్‌పై భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ నంబర్ 33/ఎన్1/ టిఎస్‌సీఈ ఆర్‌టీ/2026ను పాఠశాల విద్య డైరెక్టర్ ఆదివారం జారీ చేశారు.

ప్రస్తుతం ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో జీహెచ్‌ఎం, ఎస్‌ఏలుగా పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డైట్స్‌లో 131, సీటీఈల్లో 36, ఐఏఎస్ఈలో 17, ఎస్‌సీఈఆర్‌టీలో 18 పోస్టులను డిప్యూటేషన్‌పై నియమించనున్నారు. వీటిని నియమించడానికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)ను నిర్వహించను న్నారు. ఆదివారం నోటిఫికేషన్ జారీ చేయగా జులై 4 నుంచి 14 వరకు ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవల్సి ఉంటుంది. జులై 17న దరఖాస్తు ఫారమ్‌లో ఎడిట్ సౌకర్యానికి అవకాశం కల్పించారు. సీబీటీ విధానంలో పరీక్షను జులై 25 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో పరీక్షను నిర్వహించనున్నారు. ఆగస్టు 6 నుంచి 8 వరకు ఇంటర్వ్యూలు, డెమొనిస్ట్రేషన్స్‌ను నిర్వహిస్తారు. డిప్యూటేషన్ ఆర్డర్స్‌ను ఆగస్టు 10న జారీ చేస్తారని నోటిఫికేషన్‌లో షెడ్యూల్‌ను పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ జారీ చేశారు. జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఎంపిక కమిటీ ఉం టుంది. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ఛైర్ పర్సన్‌గా, డీఈవో మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్య డైరెక్టర్ ఛైర్ పర్సన్‌గా ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

# తెలంగాణ ప్రజాక్షేత్రంలోకి జనసేన విద్యార్థి విభాగం

## పోస్టర్‌ను ఆవిష్కరించిన తెలంగాణ జనసేన ఇన్‌ఛార్జి శంకర్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జనసేన విద్యార్థి విభాగం కూడా ఇకపై కార్యక్రమా లను చేపట్టనుంది. ఇందుకు సంబంధించి తెలం గాణ ప్రజాక్షేత్రంలోకి జనసేన విద్యార్థి విభాగం రానున్నట్టు తెలంగాణ జనసేన నేతలు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరిం చారు. తెలంగాణలో విద్యార్థుల హక్కులు, సమస్యలపై పోరాటమే లక్ష ్యంగా జనసేన విద్యార్థి విభాగం పనిచేయనుందని ప్రకటించారు. హైదరాబాద్‌లోని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో ఆదివారం "జనసేన విద్యార్థి విభాగం" అధికారిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి నేమూరి శంకర్ గౌడ్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన జనసేన పార్టీ వేదికగా విద్యార్థి విభాగం మరింత బలంగా పనిచేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జనసేన విద్యార్థి విభాగం నాయకుడు మిరియాల రామకృష్ణ మాట్లాడుతూ.. వందలాది మంది అమరవీరుల, విద్యార్థుల బలిదానాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో నేటికీ విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలు, విద్యార్థులు ఎదుర్కొం టున్న ఇబ్బందుల పరిష్కారానికి జనసేన విద్యార్థి విభాగం ప్రత్యేక కార్యాచరణతో త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి రాబోతోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు శిరీష కోట, సురేష్ రెడ్డి, ప్రజీత్ గౌడ్, తనీష్‌లతో పాటు విద్యార్థి విభాగానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ముగిసిన ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ స్లాట్ బుకింగ్ గడువు

## ఆదివారం సాయంత్రం వరకు 92,529 మంది దరఖాస్తు

## నేటితో ముగియనున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారంతో ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని, స్లాట్‌బుక్ చేసుకోవడానికి గడువు ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు 92,529 మంది దరఖాస్తు చేసుకున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా 37 హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 22 నుంచి ప్రారం భమైన సర్టిఫికెట్ వెరిఫికేషన్ నేటి(సోమ వారం-29)తో ముగియనుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా నెల 25 నుంచి ప్రారంభమైన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ జులై 1 వరకు కొనసాగనుంది. ఇప్పటి వరకు 80,670 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. వారిలో 47,234 మంది తమకు ఏ కాలేజీలో సీటు కావాలో చెబుతూ వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. విద్యార్థు లందరూ 25,29,142 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. అత్యధికంగా ఒక విద్యార్థి 919 వెబ్ ఆప్షన్లను ఇచ్చాడు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి జులై 4న మాక్ సీట్ అలకేషన్‌ను చేయనున్నారు. జులై 5 నుంచి 7 వరకు మాక్ సీట్ అలకేషన్‌లో మోడిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. జులై 10న మొదటి విడత సీట్ల కేటాయింపు చేస్తారు. జులై 10 నుంచి 14 వరకు విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ జులై 17న ప్రారంభిస్తారు. ఎప్ సెట్-2026 పరీక్షల్లో భాగంగా మే 4, 5 తేదిల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను నిర్వహించగా, మే 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగంలో 2,10,766 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,97,241 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అందులో 1,44,704 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 90,977 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 84,954 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే అందులో 73,294 మంది అర్హత సాధించారు.

# రాస్ తనూరా వద్ద కుప్పకూలిన ఆరామ్‌కో హెలికాప్టర్



## 14 మంది మృతి

**రియాద్, జూన్ 28:** సౌదీ అరేబియా తూర్పు ప్రాంతంలోని రాస్ తనూరా వద్ద ఆదివారం అరాంకోకు చెందిన హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న 14 మంది సౌదీ పౌరులు మృతి చెందినట్లు ఆ దేశ అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, పూర్తి స్థాయి విచారణ చేపట్టినట్లు సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఉన్న వారంతా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధృవీకరించారు. సౌదీ అరాంకో సంస్థ వద్ద 60కి పైగా విమానాలు, హెలికాప్టర్లు ఉండగా, దేశవ్యాప్తంగా 300కు పైగా హెలిప్యాడ్‌లకు సేవలు అందిస్తోంది. మధ్యప్రాచ్య ప్రాంతంలో అతిపెద్ద కార్పొరేట్ వైమానిక వాహనాల సముదాయాల్లో ఇది ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ ప్రమాదం ఇటీవల మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్ దాడులు, హర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా గల్ఫ్ దేశాలు చమురు ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలు చేస్తున్న వేళ ఈ ఘటన జరిగింది. అయితే ఈ హెలికాప్టర్ ప్రమాదానికి ఎలాంటి శత్రుదాడి సంబంధం లేదని సౌదీ ప్రభుత్వం స్పష్టం చేసింది. రాస్ తనూరా రోజుకు సుమారు 5.5 లక్షల బ్యారెళ్ల సామర్థ్యం కలిగిన మధ్యప్రాచ్యంలోని అతిపెద్ద రిఫైనరీలలో ఒకటి ఉంది. గతంలో ఇరాన్ డ్రోన్ దాడుల కారణంగా ఈ రిఫైనరీలో అగ్నిప్రమాదం సంభవించి, కొంతకాలం ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు ఎగుమతిదారైన సౌదీ అరేబియా ప్రస్తుతం రోజుకు కోటి బ్యారెళ్లకు పైగా ముడి చమురును ఉత్పత్తి చేస్తోంది.

# పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే మార్గం

## దక్షిణ భారత పెన్షనర్ల మహాసభలో జాతీయ అధ్యక్షుడు కమాండర్ అశోక్‌రావత్

## ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్తా: ఎంపి లక్ష్మణ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జూన్ 28, ప్రభాతవార్త:** ఈపీఎస్95 పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా పెన్షనర్లు ఐక్యంగా ఉద్యమించాలని ఈపీఎస్95 జాతీయ పోరాట సంఘం జాతీయ అధ్యక్షుడు కమాండర్ అశోక్ రావత్ పిలుపునిచ్చారు. ఆదివారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన దక్షి ణ భారత ఈపీఎస్95 పెన్షనర్ల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కమాండర్ అశోక్ రావత్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా దేశ అభివృద్ధికి సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం అత్యంత తక్కువ పెన్షన్‌తో జీవనం సాగించడం దురదృష్టకరమన్నారు. కనీసం రూ.7,500 నెలవారీ పెన్షన్‌తో పాటు డీఏ, ఉద్యోగిజీవిత భాగస్వామికి ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించేలా కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీలక్షి ్మ కరవడి మాట్లాడుతూ ఈపీఎస్95 పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. దక్షి ణ భారత రాష్ట్రాల పెన్షనర్లు ఒకే వేదికపైకి రావడం ఉద్యమానికి కొత్త ఊపునిస్తుందన్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష ్మణ్ మాట్లాడుతూ ఈపీఎస్95 పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ ల పరిష్కారం కోసం త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తో చర్చిస్తానని అన్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, జాతీయ పోరాట సంఘం జాతీయ అధ్యక్షుడు కమాండర్ అశోక్‌రావత్

ఉద్యోగులకు, పెన్షనర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కమిటీ నాయకులు వీరేంద్ర సింగ్ రాజావత్, రమా కాంత్ నారాగండ్ , వై వి సుబ్బయ్య పి.వి.స్వామి లుమాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని పెండింగ్ డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. అవసరమైతే దేశవ్యాప్తంగా ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాసభలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో ఈపీఎస్95 పెన్షనర్లు, జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సమస్యలపై విస్తృతంగా చర్చించి, కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు.

# రుణ పరిమితి రూ.2.2 లక్షల కోట్లకు పెంపు

## పవర్ గ్రిడ్ ఆఫ్ ఇండియా బోర్డు ఆమోదం

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** ప్రభుత్వ రంగ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్, తన రుణ పరిమితిని రూ.1.8 లక్షల కోట్ల నుంచి రూ.2.2 లక్షల కోట్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి బాహ్య వాణిజ్య రుణాల (ఇసిబి) ద్వారా 500 మిలియన్ డాలర్ల (రూ.4,718 కోట్లు) వరకు విదేశీ మారక ద్రవ్య నిధులను సమీకరించే ప్రతిపాదనకు కూడా బోర్డు ఆమోదం తెలిపిందని ఒక రెగ్యులేటరీ ఫైలింగ్ పేర్కొంది. ఈ రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం, రాబోయే వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజిఎం)లో వాటాదారుల ఆమోదానికి లోబడి, రుణ పరిమితిని రూ.1,80,000 కోట్ల నుంచి రూ.2,20,000 కోట్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపిందని వెల్లడించింది. అలాగే బోర్డు ఉడుమల్‌పేట్ - మదురై 400,000 వోల్టుల సింగిల్ సర్క్యూట్ అధిక వోల్టేజ్ ఆల్టర్నేటింగ్ కరెంట్ (ఎసి) ఓవర్‌హెడ్ ట్రాన్స్‌మిషన్ లైన్‌ను ఉన్నతీకరణ చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

టవర్లు లేదా నిర్మాణాలు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి విద్యుత్ శక్తిని ప్రసారం చేయడానికి కేవలం ఒక సెట్ త్రీఫేజ్ కండక్టర్లను (3 వైర్లు) మాత్రమే కలిగి ఉండే ఈ లైన్‌ను ఉన్నతీకరణ, మార్పిడీ చేయడానికి గాను రూ.772.65 కోట్ల అంచనా వ్యయంతో పెట్టుబడి పెట్టేందుకు ఆమోదం కూడా ఇచ్చింది. ఈ పనులు కేటాయింపు తేదీ నుండి 30 నెలలలోపు, అంటే ఆగస్టు 11, 2028 నాటికి అమలు చేయబడతాయని బోర్డు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది.

వార్త

నువ్వు చెప్పిన ప్రతి దానికి తలాడించేవాడు తెలివి తక్కువ వాడైనా అవ్వాలి లేదా నీ భరతం పట్టేవాడైనా అయి ఉండాలి.

- జేమ్స్ టైల్

# పంచాయతీలను నిర్వీర్యం చేయొద్దు!

జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలకపెద్దలు ఏనాటినుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి అవి కాగితాలకే మిగిలిపోతున్నాయి. స్వాతంత్య్రంవచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉంది. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గురించి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఎందరోనాయకులు ఇవే మాటలు చెప్తూనే ఉన్నారు. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాటికి కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటి కప్పుడు హామీ ఇస్తూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవంగా చూస్తే గ్రామ సర్పంచులకు ఒక వ్యూహంప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. అధికారంలేని ఉత్సవ విగ్రహాలుగా మార్చేందుకు ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమవంతు కృషి చేస్తున్నారని చెప్పొచ్చు. చివరకు స్వతంత్రంగా చీపురు కట్టకొనలేని దురదృష్ట పరిస్థితి తెచ్చి పెట్టారు. ఒకనాడు సర్పంచులకు ఉన్న ప్రాధాన్యత నేడు కానరావడం లేదనేది కాదనలేని వాస్తవం. ఇందుకు వారూ వీరు అనే దానికంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారనే చెప్పక తప్పదు. గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలను పెట్టి సర్పంచులను పక్కకు పెట్టారు. వారి ప్రమేయం లేకుండానే, వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితి తీసుకువచ్చారు. ఒక రకంగా చెప్పాలంటే సర్పంచులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. ఇలాంటి చర్యలతో ఉన్న ప్రాధాన్యత కూడా తగ్గిపోయింది. నేతల వాగ్దానాలతో ఏదో సాధించాలని సమాజానికి ఏదో చేయాలని నూతనోత్సహంతో ఎందరో యువకులు గత ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నో వ్యయప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. అప్పట్లో గ్రామాభివృద్ధికి తాముచేసిన వాగ్దానాలు తీర్చేందుకు నడుం కట్టారు. ఈచట్టాల వలలో తాము ఏమీ చేయలేమనే విషయం అర్థంకావడానికి వారికి చాలాకాలం పట్టింది. అయితే గ్రామప్రజలకు తాము చేసే వాగ్దానాలు పూర్తి చేసేందుకు తలతాకట్టు పెట్టి అప్పోసొప్పో చేసి కొన్ని గ్రామాల్లో పనులు పూర్తిచేశారు. అయితే బిల్లులు ఎంతకూ రాకపో వడం, ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి, ఇంకొకపక్క అప్పులు, వడ్డీలు పెరిగి, మరొకపక్క గ్రామస్తుల నుండి తలవంచుకోలేక డజన్ మందికిపైగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. ఈ పరిస్థితుల్లో 2024 జనవరి 31తో వారి పదవీకాలం పూర్తయి మాజీ సర్పంచులైపోయారు. ఆలస్యంగానైనా ఎన్నికలు జరగడంతో కొత్తసర్పంచులు పదవులను అధిష్టించారు. మాజీ సర్పంచుల పరిస్థితి గురించి పట్టించుకునే వారే లేకుండాపోయారు. ముఖ్యంగా ప్రజాభివృద్ధికి వ్యయం చేసిన డబ్బు రాకపోవడం, వారుపడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ఎప్పటికి బిల్లులు వస్తాయో చెప్పేవారు లేరు. అంతా అగమ్యగోచరంగా తయారయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉస్నాబాద్ మండలం మహమ్మాదాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన సర్పంచుగా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధి కోసం చివరకు మామిడితోట విక్రయించి వచ్చిన డబ్బు, మరికొన్ని అప్పులుచేసి అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ డబ్బులు ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్తున్నారు. ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ సర్పంచులు కరీంనగర్, ఉస్మాబాద్ ప్రధాన రహదారిపై రాస్తా రోకో నిర్వహించారు. ఇప్పటికీ మరెందరో మాజీ సర్పంచులు తాము చేపట్టిన ప్రజాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి బిల్లుల కోసం కాలు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగడం పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులు అంటే ఎంతో గౌరవ మర్యాదలుండేవి. భారత దేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడి కంటేముందు నుంచి గ్రామాలు, గ్రామ వ్యవస్థ అమలులో ఉన్నట్లు ఆధారాలున్నాయి. అప్పుడు కూడా గ్రామసభలుండేవి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికవ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేది. అలా ప్రాచీనకాలం నుండి గ్రామవ్యవస్థ ఏదోఒక రూపంలో మనదేశంలో కొనసాగుతూనే ఉన్నది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్ రిప్పన్ స్థానిక సంస్థలకు ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామస్వరాజ్యం లక్ష్యంలో స్థానిక సంస్థ పటిష్టత అన్నది ఒక ముఖ్యాంశం. భారత రాజ్యాంగంలో కూడా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి, ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని స్పష్టంగా సూచించారు. 1952 నుంచి ఎన్నోకమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు, చేర్పులు ఈ పంచాయతీరాజ్ వ్యవస్థలో చేశారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించినఅధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలక పెద్దలకు మనసు ఒప్పడం లేదు. రానురాను పంచాయతీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎన్నిమార్పులు చేర్పులుచేసుకుంటున్నా, ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎందరు నేతలు మారినా అధికార వికేంద్రీకరణ మాత్రం ఆది నుంచి అధికారంలో ఉన్నపెద్దలు మోకాలొడ్డుతూనే ఉన్నారు. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది లాంటిది. అందులో సర్పంచులు కీలకం. రాష్ట్రాలు మరిన్ని అధికారాలు కావాలని కేంద్ర ముందు గావుకేకలు పెడుతున్న నేతలు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడం అత్యంత దురదృష్టకరం.

# జనాభాలో ఎక్కువ..ప్రగతి ప్రమాణాల్లో తక్కువ

**'పౌరస్పృహ' సివిక్ సెన్స్ ఒక ఉద్యమంగా మారినప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. పాలితులు తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే పరువు పోయేది మనదే. నష్టం జరిగేది సమాజానికే. అందుకే కనీస 'పౌరస్పృహే ప్రగతికి తొలి మెట్టు' హక్కులు, బాధ్యతలు రెండు కళ్ళలాంటివి. వీటి నుంచి పాలకులకు, పాలితులకు మినహాయింపు లేదు. నేటి నుంచే మనం పౌరస్పృహతో మెలుగు దాం. ప్రశ్నించే పౌరులుగా, బాధ్యతగల భారతీయులుగా ఎదుగుదాం. అప్పుడు మాత్రమే జనాభాలోనే కాదు, ప్రగతి ప్రమాణాల్లోనూ ప్రపంచానికి ఆదర్శంగా నిలుద్దాం.**



మేకిరి దామోదర్

భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నాయి. అయినప్పటికీ విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, రహదారి క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ, ప్రశ్నించే స్వేచ్ఛ, అవినీతి నిర్మూలన, బాధ్యతాయుత పాలన, పౌర బాధ్యత వంటి అనేక ప్రగతి ప్రమాణాల్లో మనం ఆశించిన స్థాయికి చేరుకోలేకపోతున్నాం. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, పాలితుల నిర్లక్ష్యమూ అంతే. అందుకే ఈ పరిస్థితిని 'తిలా పాపం తలా పిడికెడు' అని చెప్పవచ్చు. ప్రజాస్వామ్యంలో పాలకులు, పాలితులు ఒకే రథానికి రెండు చక్రాలు. ఒకరు బాధ్యత తప్పినా, మరొకరు తమ విధిని విస్మరించినా సమాజం వెనుకబడుతుంది. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు, పౌర స్వేచ్ఛతోపాటు, ప్రతి పౌరుడి బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అంతేముఖ్యం. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ పాలకుల, పాలితుల అత్యంత ప్రధాన బాధ్యత. ఇదే సమిష్టి ప్రగతికి మార్గదర్శి. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే కొందరు పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల మొదటి కర్తవ్యం. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయరాదు. అంతేకాదు జాగ్రత్తగా వినియోగించాలి. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైక్రమం తప్పకుండా సమాధానం చెప్పాలి. ప్రజల సమస్యలను వినాలి. అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడాలి.

పాలనలో జవాబుదారీ తనం లేకపోతే ప్రజల్లో విశ్వాసం తగ్గిపోతుంది. అభివృద్ధి మందగిస్తుంది. కాబట్టి మంచి పాలనకు రాజకీయ నాయకులు ప్రజల పట్ల నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యాన్ని ఓటు తో పాటు, ఎన్నికైన ప్రభుత్వాల (నాయకుల) జవాబుదారీతనమే బలాన్ని చేకూర్చుతోంది. పాలకులను విమర్శించడం సులభం. కానీ మన బాధ్యతలను మనం ఎంతవరకు నిర్వర్తిస్తున్నామో కూడా ప్రశ్నించుకోవాలి. రోడ్లపై చెత్త వేయడం, ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం



చేయడం, క్యూలను పాటించకపోవడం, పన్నులు ఎగవేయడం వంటి చర్యలు మన సమాజంలో తరచూ కనిపిస్తున్నాయి. శుభ్రమైన దేశం కావాలని కోరుకునే మనమే చెత్తను రోడ్లపై పడేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది?. ప్రమాదాలు తగ్గాలని ఆశించే మనమే ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే భద్రత ఎలా పెరుగుతుంది?. ప్రభుత్వ ఆస్తులు ప్రజల సొత్తే అని తెలుసుకున్నా వాటిని నిర్లక్ష్యంగా చూస్తే నష్టం చివరకు ప్రజలకే కదా!. పౌరస్పృహ అనేది పెద్ద పెద్ద ప్రసంగాల్లో ఉండేది కాదు. అది మన రోజువారీ ప్రవర్తనలో కనిపించాలి. ఇంటి ముందు శుభ్రత పాటిం చడం, చెత్తను నిర్దిష్ట ప్రదేశంలో వేయడం, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం, నీటిని పొదుపుగా వాడడం, చెట్లను కాపాడడం, ప్రజా ఆస్తులను సంరక్షించడం ఇవన్నీ మంచి పౌరుడి లక్షణాలు. స్వేచ్ఛ అంటే మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం కాదు? మన హక్కులను కాపాడుకుంటూనే, ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా ప్రవర్తించడమే. బాధ్యతతో కూడిన స్వేచ్ఛే నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతి. ప్రజాస్వామ్యంలో ప్రజలు కేవలం ఓటర్లు మాత్రమే కాదు దేశ నిర్మాణంలో భాగస్వాములు. ఎన్నికల రోజున ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరిశీలించడం, తప్పులను ఎత్తిచూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడి బాధ్యత. అదే సమయంలో ప్రశ్నించే హక్కుతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అవసరం. 'ప్రభుత్వం చేయాలి' అనే భావనతో మాత్రమే సరిపోదు. 'నేను ఏమి చేయగలను?' అనే ఆలోచన కూడా ఉండాలి. సమాజంలోని ప్రతి వ్యక్తి తన బాధ్యతను నిర్వర్తించినప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే అక్కడి ప్రజల్లో ఉన్న క్రమశిక్షణ, పౌరస్పృహ, చట్టాల పట్ల గౌరవం ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి. అక్కడ శిక్షల భయం కంటే బాధ్యతాభావమే ఎక్కువగా పనిచేస్తుంది. మన దేశం కూడా అదే దిశగా అడుగులు వేయాలి. పిల్లలలో చిన్నప్పటి నుంచే పౌర బాధ్యతలను పెంపొందించాలి. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి మంచి పౌరులను తయారు చేయాలి. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు కూడా ఈ విషయంలో చైతన్యం కల్పించాలి. 'పౌరస్పృహ' సివిక్ సెన్స్ ఒక ఉద్యమంగా మారినప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. పాలితులు తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే పరువు పోయేది మనదే. నష్టం జరిగేది సమాజానికే. అందుకే కనీస 'పౌరస్పృహే ప్రగతికి తొలి మెట్టు' హక్కులు, బాధ్యతలు రెండు కళ్ళలాంటివి. వీటి నుంచి పాలకులకు, పాలితులకు మినహాయింపు లేదు. నేటి నుంచే మనం పౌరస్పృహతో మెలుగుదాం. ప్రశ్నించే పౌరులుగా, బాధ్యతగల భారతీయులుగా ఎదుగుదాం. అప్పుడు మాత్రమే జనాభాలోనే కాదు, ప్రగతి ప్రమాణాల్లోనూ ప్రపంచానికి ఆదర్శంగా నిలుద్దాం. ●

# కృత్రిమ వనాలే పర్యావరణ సంరక్షణకు మార్గం

కింజరాపు అమరావతి

మన దేశం ప్రస్తుతం ఒక తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు ఎండలు మండిపోతుంటే మరోవైపు భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. దేశంలో దాదాపు 96 మిలియన్ హెక్టార్ల భూమి అంటే మూడో వంతు భూభాగం వివిధ కారణాల వల్ల నిస్సారంగా మారి చవిటి నేలలుగా మారుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో తీవ్రమైన నీటి ఎద్దడి, ఊపిరాడని కాలుష్యం ముంచుకొస్తాయి. జాతీయ అటవీ విధానం ప్రకారం దేశ మొత్తం భూభాగంలో 33శాతం అడవులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం అది కేవలం 21.73 శాతానికే పరిమితమైంది. మనం నిర్దేశిత లక్ష్యం కంటే చాలా వెనుకబడి ఉన్నాం. తగినంత విస్తీర్ణంలో అడవులు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. దీనికి తక్షణ విరుగుడుగా ఆధునిక సాంకేతికతను మానవ ప్రయత్నాన్ని జోడించి, యుద్ధప్రాతిపదికన 'కృత్రిమ వనాలను' సృష్టించడం ఒక్కటే మన ముందున్న ఆచరణాత్మక మార్గం. మొక్కల పెంపకానికి, వనాల సృష్టికి మధ్య ఉన్న వ్యూహాత్మక వ్యత్యాసాన్ని గమనించాలి. ఇళ్ల ముందు, రోడ్ల పక్కన మొక్కలు నాటడం అనేది ఒక వ్యక్తిగత అలవాటు మాత్రమే. కానీ కృత్రిమ వనం అంటే ఒక నిర్దిష్ట ప్రణాళికతో సహజ పద్ధతిలో ఒక స్వయంసమృద్ధ అడవిని నిర్మించడం. ఇందులో కేవలం చెట్లు మాత్రమే ఉండవు. స్థానిక నేల స్వభావానికి సరిపోయే విభిన్న రకాల దేశీయ వృక్షాలను ఎంపిక చేస్తారు. అవి ఒకదానికొకటి తోడ్పడుతూ పెరిగేలా దట్టంగా నాటుతారు. కొద్ది కాలంలోనే ఇది పక్షులు, కీటకాలు, చిన్న జీవులకు నిలయంగా మారి, ఒక సహజ అడవిలా రూపాంతరం చెందుతుంది. చైనా హరిత ప్రాజెక్ట్ ద్వారా 35 మిలియన్ హెక్టార్ల ఎడారి భూమిని పచ్చని వనాలుగా మార్చింది. జపాన్, ఆఫ్రికా వంటి దేశాలు కూడా ఇదే వ్యూహంతో అద్భుతమైన విజయాలు సాధించాయి. మరి ఇంతటి సాంకేతికత అపారమైన మానవ వనరులు ఉన్న మన దేశం ఈ తరహా భారీ కృత్రిమ వనాల నిర్మాణంలో ఎందుకు ఆశించిన ఫలితాలను సాధించలేకపోతోందో అంతర్మథనం చేసుకోవాలి. మన దేశంలో పర్యావరణ స్పృహ లేకపోవడం సమస్య కాదు. చేస్తున్న ప్రయత్నాల్లో దీర్ఘకాలిక ప్రణాళిక లోపించడమే అసలు సమస్య. ఏటా వర్షాకాలంలో కోట్ల సంఖ్యలో మొక్కలు నాటుతున్నా అందులో ఎన్ని చెట్లుగా మారుతున్నాయనే దానికి సరైన నిఘా లేదు. కేవలం కాగితాల మీద సంఖ్యలు చూపించే రొటీన్ కార్యక్రమాల వల్లే మనం అంతర్జాతీయ స్థాయిలో పటిష్టమైన మార్పును తీసుకురాలేకపోతున్నాం. ప్రస్తుతం ఉన్న అటవీ శాఖకు స్మగ్లింగ్ అడ్డుకోవడం, వన్యప్రాణుల రక్షణ వంటి ఎన్నోఇతర బాధ్యతలు ఉన్నాయి. అందువల్ల, దేశవ్యాప్తంగా కృత్రిమ వనాలను అమలు చేయడానికి 'ప్రత్యేక జాతీయ యంత్రాంగం' ఒకదాన్ని ఏర్పాటు చేయాలి. దీనికి కేంద్ర ప్రభుత్వం భారీ బడ్జెట్ కేటాయించడంతో పాటు, ప్రతి రాష్ట్రం తప్పకుండా ఇందులో భాగస్వామ్యం కావాలి. నిర్దేశిత కాలంలో లక్ష్యాలను అందుకోకపోతే సంబంధిత అధికారులు జవాబుదారీ వహించేలా చట్టబద్ధమైన నిబంధనలు ఉండాలి. ఈ వ్యవస్థకు 'కృత్రిమ వనాల అభివృద్ధి' తప్ప మరో రెండవ లక్ష్యం ఉండకూడదు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పర్యావరణ సంక్షోభం మన ఆర్థిక వ్యవస్థను, సామాన్యుడి జీవనాన్ని ఒకేసారి దెబ్బతీస్తోంది. వాతావరణ మార్పుల వల్ల ఏటా రైతులు సగటున 20 నుండి 25శాతం వరకు పంట దిగుబడిని నష్టపోతున్నారు. మరోవైపు కాలుష్యం వల్ల వచ్చే రోగాల కారణంగా సామాన్యుడి సంపాదనలో సగానికి పైగా వైద్య ఖర్చులకే హారతవుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం సైతం ప్రతి ఏటా బడ్జెట్‌లో దాదాపు 90 వేల కోట్ల రూపాయల కంటే ఎక్కువ మొత్తాన్ని కేవలం ప్రజారోగ్యం, వైద్యపథకాల కోసమే కేటాయించాల్సి వస్తోంది. ఈనష్టాలన్నింటినీ అధిగమించడానికి కృత్రిమ వనాల ఏర్పాటు ఒక అద్భుతమైన మార్గంగా నిలుస్తుంది. ఈ వనాల సృష్టి కేవలం పర్యావరణాన్ని కాపాడటమే కాదు, దేశ ఆర్థిక రంగానికి సరికొత్త ఊపును ఇస్తుంది. వేల ఎకరాల్లో అడవులను నిర్మించే క్రమంలో భూమిని సిద్ధం చేయడం, మొక్కల పెంపకం, నిర్వహణ వంటి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భవిష్యత్తులో ఈ వనాల ద్వారా లభించే కలప రహిత అటవీ ఉత్పత్తులు, ఔషధ మొక్కలు, తేనె వంటి వాటి ద్వారా స్థానిక పరిశ్రమలు వృద్ధి చెందుతాయి. అంతేకాకుండా, గ్లోబల్ స్థాయిలో కార్బన్ క్రెడిట్స్ మార్కెట్ ద్వారా దేశానికి భారీగా విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఈ క్రమంలో ప్రజల పాత్ర అంటే కేవలం పెరట్లో మొక్క నాటడం కాదు. పౌర సమాజంగా, స్వచ్ఛంద సంస్థలుగా ఏర్పడి ఈ వనాలను అసాంఘికశక్తులు, పశువుల బారి నుండి కాపాడే పర్యవేక్షకులుగా బాధ్యత తీసుకోవాలి. మన దేశానికి ఇప్పుడు కావాల్సింది పర్యావరణ నినాదాలు కాదు. పక్కా ప్రణాళికతో కూడిన కృత్రిమ వనాల నిర్మాణం. ●



జీవితంలో సంతృప్తి పడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. అది చేతకాని వ్యక్తి దు:ఖానికి గురవుతూనే ఉంటాడు.

జార్జ్ ఇలియెట్



జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు. ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.

స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



### బంగారు గని యువతకు ఉపాధి

**కర్నూలు** జిల్లా జొన్నగిరిలో బంగారు గని ప్రారంభం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. నిర్ధారిత బంగారు నిల్వలు ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి కేంద్రంగా ఎంపిక చేయడం దూరదృష్టితో తీసుకున్న నిర్ణయంగా చెప్పవచ్చు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చే అవకాశాన్ని కల్పిస్తుంది. అయితే ఈ ప్రాజెక్టు విజయాన్ని కేవలం బంగారం ఉత్పత్తితోకాకుండా, స్థానిక యువతకుకల్పించే ఉపాధి అవకాశాలతో కూడా అంచనా వేయాలి. జొన్నగిరి, పరిసర ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని యువతకు పారదర్శకంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే విశ్వాసం కల్పించడం అవసరం. ప్రాసెసింగ్ యూనిట్లలో ఉద్యోగాలు పొందాలంటే మైనింగ్ టెక్నాలజీ, ఖనిజ శుద్ధి, యాంత్రిక నిర్వహణ, విద్యుత్‌వ్యవస్థలు, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. దీనికోసం ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రికార్డులు బ్రేక్

టెస్ట్ క్రికెట్‌లో ఒకప్పుడు అత్యధిక పరుగులు సాధించిన రికార్డు గవాస్కర్ పేరుమీద ఉండేది. ఆరికార్డును సచిన్ టెండూల్కర్ బ్రేక్ చేశాడు. సచిన్ రికార్డును విరాట్ కోహ్లి బ్రేక్ చేశాడు. 16ఏళ్ల వయసులో క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన వారు టెండూల్కర్. 15ఏళ్లకే మైదానంలో అడుగు పెట్టి క్రికెట్ ఆడినవారు వైభవ్ సూర్యవంశి. టెన్నిస్, బాట్‌మెంటన్, బాక్సింగ్ ఇలా ఏఆటలోనైనా ఒకరి రికార్డును మరొకరెవరో బ్రేక్ చేస్తూనే ఉన్నారు. రికార్డులు అనేవి ఎప్పుడూ ఒకరి పేరు మీదేఉండవు. క్రీడల్లోనైనా, రాజకీయాల్లో నైనా, విద్య, వైద్యరంగాల్లోనైనా.

- శాస్త్రి, హైదరాబాద్

### ఎవరైతేమాకేంటి?

చిన్న జంతువైన కుందేలు అడవికి రాజైన సింహాన్ని తన తెలివితో బోల్తా కొట్టిస్తుంది. ఐకమత్యంతో పావురాలు వేటగాడి బారి నుంచి తప్పించుకుపోతాయి. బలమైన సర్పంపై చీమల దండు దాడి చేసిచంపి పడేస్తాయి. ఒక మనిషిని ఈగ ముప్పుతిప్పలుపెట్టి పగతీర్చుకున్నట్లు ఒక సినిమాలో చూపించారు. సమయస్ఫూర్తి, ఐకమత్యం, తెలివితేటలు ఉపయోగిస్తే మనిషేకాదు అతి చిన్న ప్రాణులు, పక్షులు కూడా తాము అనుకున్నవి సాధించగలవు.

- మిథునం, హైదరాబాద్

### చెప్పడానికే నీతులు

ఒక వ్యక్తి గాంధీ వద్దకు వచ్చి మావాడు బెల్లం ఎక్కువగా తింటున్నాడు నేను ఎంత చెప్పినా వినటం లేదు, మీరు చెబితేనన్నా వింటాడేమోనని మీ వద్దకు తీసుకొచ్చాను అన్నాడు. అప్పుడు గాంధీ ఆ వ్యక్తిని వారం రోజుల తరువాత రమ్మని పంపించాడు. వారం తరువాత వచ్చిన వ్యక్తి వెంట ఉన్న అతనితో బెల్లం ఎక్కువగా తినటం మంచిది కాదు ఆరోగ్యం పాడవుతుంది అందుకే నువ్వు బెల్లం తినటం ఈ రోజు నుంచే మానేసేయ్అన్నారు. ఈమాట అప్పుడే చెప్పేస్తే పోయేదికదా అంటే బెల్లం తినే అలవాటు నకూఉంది ఆ అలవాటు మానుకోవడానికి నాకు వారం రోజులు పట్టింది అని అన్నారు. ఈ రోజుల్లో ఇలాంటివారు నూటికొకరైనా ఉంటారా? నీతులు చెప్పేవారు నీతి సూక్తులు ఇతరులకే కాదు తమకు కూడా వర్తిస్తాయని గర్తించాలి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### కాంగ్రెస్‌పై కక్ష

**జాతీయ** విద్యామండలి వారు తొమ్మిదవ తరగతిలో 1975 లో ఇందిరాగాంధీ పెట్టిన ఎమర్జెన్సీ పై ఒక పాఠం పెట్టారు. ఒదిరాగాంధీ దుర్మార్గం అయిందని, కాంగ్రెస్ పాలన ఇలా ఉంటుందని విద్యార్థులకు చెప్పేందుకే బీజేపీ పాలకులు ఈ అంశము చేర్చారు. చాలా సంతోషం. కాంగ్రెస్ మీద కక్షతో ఇది పెట్టారు అని దేశ ప్రజల భావన. ప్రభుత్వాలు విద్యార్థులకు శాస్త్రీయమైన అంశాలను బోధించాలి. కానీ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత మతపరమైన, అశాస్త్రీయమైనఅంశాలనుపాఠ్యాంశాలుగాపెడుతుంది. ప్రోత్సహిస్తుంది. ప్రతిపౌరుడుఇలాంటివాటికివ్యతిరేకంగా పోరాడాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### శాంతి పవనాలు వీచేనా?

**ఎట్టకేలకు** హార్ముజ్ తెరుచుకుంది. ఉద్రిక్తతలు తగ్గాయి. గత కొదినద నెలలుగా పశ్చిమాసియా దేశాల యుద్ధం కారణంగా చాలా మంది కంటికి కునుకు లేకుండా గడిపారు. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై అమానుషంగా విరుచుకుపడడంతో ప్రపంచ దేశాలు ఆందోళనలో పడ్డాయి. అధ్యక్షుడు ట్రంప్ ఒంటెద్దు పోకడలకు అగ్రదేశంలోనే నిరసనలు తారాస్థాయికి చేరాయి. మనదేశం దిగుమతి చేసుకుంటున్న గ్యాస్, పెట్రోలియం, ఎరువులు, ఇంధన సరఫరాలతో నౌకల రాకపోకలు పెరుగుతుండడం శుభసూచకం. ఎన్నిసార్లు ఎదురుదెబ్బలు తగిలినా మారని దేశాలు చాలా వరకు ఉన్నాయి.

-ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# భాషపై పట్టు అభ్యసనకు ఆయువుపట్టు



మల్లాడి శ్రీనగేష్

విద్యార్థులు తమ వయసు, తరగతి స్థాయి సామర్థ్యాలు సాధించడానికి ప్రతి సబ్జెక్టు చదవడానికి అవగాహన రావడానికి భాష దానిని క్షుణ్ణంగా చదవడం అనివార్యం. అనగా ప్రతి సబ్జెక్టులోనూ భాషను మనం ప్రధానంగా చూడాలి. అనగా చదువు మాతృభాషలో వున్నా ఆంగ్ల భాషలో వున్నా ఆ భాషపట్ల పిల్లలకు పట్టుఉండాలి. ఈపట్టుకు తొలిమెట్టు యనే ప్రాథమికస్థాయి నుండి మౌలిక భాషలో కనీససామర్థ్యాలను సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి. అందుకు కావలసిన వసతులను, వనరులను, వినూత్న విద్యార్థులకు స్నేహపూరిత వాతావరణంలో అభ్యసనను అందించడానికి పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాలి. కోవిడ్కన్నా ముందు తర్వాత కూడా పాఠశాల విద్యార్థులు తరగతి స్థాయి విద్యాసామర్థ్యాలు సాధించలేక పోతున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులభవిష్యత్తు క్లిష్ట తరమోతుందని అనేకఅధ్యయనాలు వెల్లడిస్తునే వున్నాయి. అందుకే పాఠశాల యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఈదిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయకపోతే బాలల బంగారు భవిష్యత్తు చిక్కుల్లో పడుతుందనేది వాస్తవం. విద్యాహక్కు చట్టం 2009 ద్వారా ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి పాఠశాలల నమోదు పెరిగింది తద్వారా నాణ్యమైన విద్యాప్రణాళికల్లో భాగంగా మౌలికసదుపాయాలు, ఉపాధ్యాయుల నియామకం చట్టబద్దంగా కల్పించాల్సిన అవసరాలను గుర్తించాం. అక్షరాస్యత అంటే తెలియని కుటుంబాలలో బడివైపు చూడని, ఆర్థిక సాంఘిక పరిస్థితుల వలన బడిమానేసిన పిల్లలను అక్కున చేర్చుకొనేలా విద్యాహక్కు చట్టాన్ని 2010 నుండి అమలు చేస్తున్నాం. నాణ్యమైన తరగతులను నిర్మించడానికి నూతన విద్యావిధానం 2020ను కూడా రూపొందించుకున్నాం. కానీ ప్రతి విద్యార్థిలోనూ అభ్యసనాలేమి కనిపిస్తూనేఉంది. తరగతి వారీ సామర్థ్యాలు సాధించలేక సతమోతూనేవున్నారు. 5వ తరగతిలో ప్రవేశించినప్పటికీ 2వ తరగతి పాఠ్యంశాలను కూడా చదవలేని లేదా కనీస గణిత సామర్థ్యాలను సాధించలేని విద్యార్థుల పరిస్థితిని మనంకళ్లారాచూస్తూనే. మూడవతరగతిలో 10మందిలో 6 మంది విద్యార్థులు చిన్న కథలను కూడా చదవలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇదే పరిస్థితి అన్నితరగతుల్లోనూ పునరావృతం అవుతుంటే, ఆకోవకు చెందిన విద్యార్థులు చదువు కాలమంతా ఒక విషవలయంలో చిక్కుకుపోవడం అనివార్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈపరిస్థితులకు ప్రధాన కారణం ప్రాథమిక స్థాయిలో పునాది కొరవడడమా లేక సిలబస్సేపే పాఠశాలలు పరుగులెత్తడమాయనేది విశ్లేషించుకోవాలి. ఈమధ్యనేఎన్.సి.ఆర్.టి నిర్వహించిన సర్వే ప్రకారం సుమారు 75శాతం మంది 9వ తరగతి విద్యార్థులు చిన్నచిన్న కాన్సెప్టను కూడా అర్థం చేసుకోని దుస్థితిలో ఉన్నారు. సుమారు 47 శాతం 3వ తరగతి విద్యార్థులు చిన్నకథను కూడా చదివి అర్థం చేసుకోలేని స్థితిలో వున్నారు. 36 శాతం మంది విద్యార్థులు కూడికలు కూడా చేయలేకపోతున్నారు. 6 వ తరగతిలో సుమారు 34శాతం మంది స్థానికసంస్థలు, మార్కెట్,



ఇతర సంస్థల పనిగురించి కుడా తెలియపరచలేకపోయారు. 9వ తరగతి విద్యార్థులు సుమారు 55 శాతంమంది సోషల్ స్టడీస్‌లో రాజ్యాంగం గురించి, వాటి సూత్రాలు జాతీయ ఉద్యమాల గురించి వెల్లడించలేని పరిస్థితిలో వున్నారు. ఇక తెలుగు రాష్ట్రాలు పరిశీలిస్తే తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో 9వ తరగతిలో 17వ స్థానంలో, 6వ తరగతిలో 26వ స్థానంలోఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఎవరికైనా అవగతమయ్యేది, విద్యార్థికి చదవడం, విషయాన్ని అర్థం చేసుకోవడంలో ముందుంటే తద్వారా అభ్యసనా సామర్థ్యాలు సాధించంచడం చాలా సులభమని, దీనితో బాటు గణితంలో కనీసం చతుర్విధ ప్రక్రియలు సాధించడంలో ప్రవేశం ఉంటే విద్యార్థి ప్రగతి సులభతరమోతుందనేది వాస్తవం. ప్రతివిద్యార్థికి పూర్వ ప్రాథమిక స్థాయి నుండి పునాది ఏర్పరచాలి. పునాది కొరవడితే బాలల భవిష్యత్తు సమస్యల వలయంలో చిక్కుకుంటుంది. పిల్లలు భాషపై పట్టు సాధించినప్పుడే మిగతా సబ్జెక్టులపై తగిన ఫలితాలు చాలా సులభంగా సాధించగలుగుతారు. ప్రాథమిక విద్యలో అభ్యసనమంటే భాషపై తగిన పట్టు కలిగి ఉండడమేయని జాతీయ విద్యాచట్రం 2005 వక్కాణించింది. ఈ పునాదులపైననే పిల్లల మానసిక అభివృద్ధి ఆధారపడి ఉంటుంది .విద్యార్థులు చదవడం అంటే ధారాళంగా చదవడం, చదివిన దానిని అర్థం చేసుకొని తన సొంత మాటల్లో చెప్పడం ప్రతిస్పందించడం తప్పనిసరి. ఈవిధంగా విద్యార్థికి భాషలో ఎక్కువ సామర్థ్యాలు సాధించడానికి భాషాభ్యాసానికి అవసరమైన అదనపు సామాగ్రి, బాలలసాహిత్యం, వార్తపత్రికలు, మాగజైన్లు చదివేలా విద్యార్థులను తప్పక ప్రోత్సహించాలి. ఈప్రక్రియ చదువులో ముందంజ వేయడానికి, వ్యక్తిగత అభివృద్ధికి విజ్ఞాన ప్రపంచంలో ఎన్నో కొంగ్రొత్త విషయాలను ఆకళింప చేసుకొని మెరుగైన భవిష్యత్తును గడించడానికి అవసరమైన విషయ విశ్లేషణ, సమస్యాత్మక విషయాలను పరిష్కరించే పరిజ్ఞానం, తనకుతాను ఎదగడానికి పత్రికలు గ్రంథాలయాలో అందుబాటులో వున్న పుస్తకాల పఠనం ఎంతో ఉపకరిస్తుంది. విద్యార్థి తన పాఠ్యంశాలకే పరిమితం కాకుండా ,గ్రంథాలయ పుస్తకాల పఠనం, పుస్తకసమీక్ష ఇవన్నీ నిత్యజీవితంలో అంచెంచెలుగాఎదగడానికి వెసులుబాటు కల్పించాలి. అయితే పిల్లలు పుస్తక పఠనచేయడానికి, తరచూ తాను చదివిన లేదా నేర్చుకున్న విషయాలను చర్చించడానికి, తెలియపరచడానికి ఉపాధ్యాయులు, తలిదండ్రులు, తగిన అవకాశాలను పిల్లలకు ఏర్పరచాలి. స్క్రీన్ చదువులు మొబైళ్లపై ఆధారపడుతున్నారు. పుస్తకాలను తాకి, పేజీలు తిప్పి విషయాన్ని అవగాహన చేసుకుంటూ చదివే ప్రక్రియకనుమరుగైపోయింది. దీనివలన కంటికి అలసట, ఒత్తిడి, అవసరమైన పాఠ్యంశాలపైనే దృష్టిసారించడం వంటి మార్కుల వేటలో పిల్లలు పాఠ్యంశాల పరిధి దాటి ప్రపంచాన్ని చూడలేకపోతున్నారు, చదవలేకపోతున్నారు, అంటే పిల్లల చదువును పాఠ్యప్రణాళిక స్థాయివరకే పరిమితం చేయడం జరుగుతున్నది. అదనంగా గ్రంథాలయ పుస్తకాలు చదవడం పాఠ్యప్రణాళికకు మించి పరిజ్ఞానం కోసం జీవననైపుణ్యాల మెరుగుదలను పెంపొందించే పుస్తక సామాగ్రి అందుబాటులో ఉండకపోవడం ఉన్నప్పటికీ వినియోగంలో సమయాభావం, ఇవన్నీ వెరసి పిల్లల అభ్యసనకు అవరోధాలు ఏర్పడ్డాయి. కారణాలేమైనప్పటికీ విద్యార్థులు తమ వయసు, తరగతిస్థాయి సామర్థ్యాలుసాధించడంలో బాగా వెనుకబడి వున్నారు. డిజిటల్ యుగంలో మొబైల్, టెలివిజన్‌వైపు తక్కువ సమయాన్ని కేటాయించేలా తలిదండ్రులు తమపిల్లలను చైతన్యపరచాలి. తద్వారా పిల్లల్లో పఠనాశక్తిని పెంపొందిందించడం ద్వారా అభ్యసనా సామర్థ్యాలతో ప్రగతి సాధించడం సుసాధ్యమోతుంది. ●

# ప్రకృతి సంపదకు ఈశాన్యభారతం పుట్టినిల్లు

## మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూన్ 28:** భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలు ప్రకృతి సంపదకు, పర్యావరణ హితమైన జీవనశైలికి పుట్టినిల్లు. ఈ క్రమంలోనే పర్యావరణ పరిరక్షణ కోసం అక్కడి ప్రజలు సాగిస్తున్న విశేష కృషిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా పరిచయం చేశారు. ఆదివారం మన్‌కీబాత్ 135వ కార్యక్రమంలో అస్సాంలోని అరుదైన హర్గిలా పక్షి సంరక్షణ, అలాగే మేఘాలయలోని జీవన వేర్ల వంతెనల విశిష్టతను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సమాజంలో ఉన్న అపోహలను తొలగిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడం ఎలాగో ఈ రెండు అంశాలు నిరూపిస్తున్నాయని ప్రధాని మోడీ ప్రశంసించారు. హర్ అంటే ఎముకలు, గిలా అంటే మింగడం అని అర్థం. ఈ పక్షులు ఎముకలను కూడా సునాయాసంగా మింగేయగలవు. సుమారు 1.5 మీటర్ల ఎత్తు, వింతైన రూపం కారణంగా వీటిని చూసి ప్రజలు భయ పడేవారు. అస్సాంలో కనిపించే అరుదైన హర్గిలా పక్షి సుదీర్ఘకాలంగా స్థానిక ప్రజల మూఢనమ్మకాలకు, భయాం దోళనలకు బలవుతూ వచ్చిందని మోడీ అన్నారు. నిజానికి పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడంలో, చనిపోయిన జంతువుల అవశేషాలను తొలగించడంలో ఈ పక్షులు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. అయినప్పటికీ, వీటి మనుగడను గుర్తించని స్థానికులు హర్గిలా పక్షుల గూళ్లు ఉన్న చెట్లను కూడా క్రూరంగా నరికివేసేవారు. కేవలం అజ్ఞానం వల్లే ఒక ఉప యోగకరమైన పక్షిజాతి వినాశనం అంచుకు చేరుకుందని ప్రధాని వివరించారు. ఈ గడ్డు పరిస్థితుల్లో ఆ పక్షుల రక్షణ కోసం జీవశాస్త్రవేత్త పూర్ణిమ దేవి బర్మన్ నడుం బిగించారు. సమాజంలో బలంగా నాటుకుపోయిన ఈ మూఢనమ్మకాలను తొలగించాలని ఆమె గట్టిగా సంకల్పించారు. ఇందులో భాగంగా స్థానిక మహిళలను ఏకంచేసి, శాస్త్రీయ దృక్పథంతో వారికి అవగాహన కల్పించారు. పూర్ణిమ దేవి బర్మన్ చూపిన బాటలో నడిచిన మహిళలు క్రమంగా ఒక పెద్ద ఉద్యమంగా రూపాంతరం చెందారు. అలా ఏర్పడిందే ఈనాటి పర్యావరణ రక్షక దళం హర్గిలా ఆర్మీ. నేడు వేలాది మంది గ్రామీణ మహిళలు ఈ పక్షులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. అస్సాం స్ఫూర్తిదాయక పక్షిసంరక్షణ ఉదంతాన్ని వివరించిన అనంతరం ప్రధాని మోడీ మేఘాలయ పర్వత శ్రేణులలోని అపురూపమైన జీవన వేర్ల వంతెనల వైపు దృష్టి సారించారు. మేఘాలయ అంటేనే మేఘాల నిలయమని, అక్కడి ప్రజల ఆత్మీయత పర్యాటకులను ఎప్పటికీ ఆకట్టుకుంటుందన్నారు. అయితే వీటన్నింటికంటే ఎంతో ప్రత్యేకమైనవి అక్కడి స్థానిక గిరిజనులు నిర్మించే సహజసిద్ధమైన వంతెనలని చెప్పారు. ఇవి కేవలం కొద్దిరోజుల్లోనో లేదా కొద్ది సంవత్సరాల్లోనో కట్టేవి కాదని, వీటి తయారీ వెనుక దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ, పట్టుదల దాగి ఉన్నాయని ప్రధాని వివరించారు.

**మట్టి వినాయక ప్రతిమలనే వాడాలి:** సెప్టెంబరులో వస్తున్న వినాయకచవితికి మట్టితో చేసిన విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా, బియా వ్రాకు చెందిన మహిళల కృషని ప్రధాని ప్రత్యే కంగా ప్రశంసించారు. తమ పరిసరాల్లో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి నిరాశ చెంద కుండా, ఆ మహిళలు స్వయంగా రంగంలోకి దిగి ప్లాస్టిక్ వ్యర్థాలను, ఖాళీ బాటిళ్లను సేకరించడం ప్రారంభించారని ఆయన వివరించారు. ఈ ప్లాస్టిక్‌ను ఈకోబ్రిక్స్‌గా మార్చి, బహిరంగ ప్రదేశాలను సుందరీకరించడానికి ఉపయోగిస్తున్నారని, గత కొద్దినెలల్లోనే వందలకిలోల ప్లాస్టిక్ రీసైక్లింగ్ జరిగిందని మోడీ సంతోషం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్, నేడు నగర సౌందర్యానికి చిహ్నంగా మారడం ఆ మహిళల కృషికి నిదర్శనమని ప్రధాని కొనియాడారు. నీటినిపొదుపు చేద్దాం క్యాచ్ దరెయిన్ ప్రకృతిని కాపాడుకోవడంలో భాగంగా, కొనసాగుతున్న క్యాచ్ ద రెయిన్‌ప్రచారంలో ప్రజలందరూ భాగ స్వాములుకావాలని ప్రధాని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మోడీ దేశ ప్రజలను కోరారు.



## బంగారం కొనవద్దన్న పిలుపునకు అద్భుత స్పందన

### ప్రజలకు ప్రధాని మోడీ కృతజ్ఞతలు

బంగారం కొనుగోళ్లపై దేశ ప్రధాని మోదీ మరోసారి స్పందించారు. తన 135వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు తాను ఇచ్చిన పిలుపునకు సామాన్య ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, దేశ ఆర్థిక స్థిరత్వం కోసం విలాసవంతమైన ఖర్చులు, ముఖ్యంగా బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేసుకోవాలని మోడీ చేసిన విజ్ఞప్తిని ప్రజలు బాధ్యతాయుతంగా స్వీకరించారని వెల్లడించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు మోడీ కృతజ్ఞతలు చెప్పారు విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవడం, ఇంధన ఆదా కోసం సొంత వాహనాల వినియోగాన్ని తగ్గించు కోవడం వంటి చర్యలను ప్రజలు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారని మోడీ తెలిపారు. ఈ సానుకూల ధోరణి దేశ విదేశీ మారక నిల్వలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. బంగారం, ఇంధనం వంటి అత్యవసర దిగుమతులపై భారం తగ్గించడంద్వారా రూపాయి విలువను సుస్థిరం చేయాలనేదే ఈ ప్రయత్నం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ప్రధాని విజ్ఞప్తి తర్వాత మార్కెట్లో గణనీయమైన మార్పులు కూడా వచ్చాం. 10న 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,53,140 ఉండగా, ఆదివారం నాటికి అది రూ. 1,39,873కి పడిపోయింది. అదేవిధంగా కేజీ వెండి ధర రూ. 2,62,350 నుంచి రూ. 2,16,541కి తగ్గింది. ఈ స్వల్ప వ్యవధిలోనే బంగారం ధర రూ. 13,267, వెండి ధర రూ. 45,809 మేర తగ్గడం విశేషం.



## అమర్‌నాథ్ యాత్రకు సహకరించాలి

### ముస్లిం సంఘాల నేతలతో లెఫ్టినెంట్ గవర్నర్ సమావేశం

**శ్రీనగర్, జూన్ 28:** హిందువులు పవిత్రంగా భావించే అమర్‌నాథ్ యాత్ర మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఈ యాత్రకు కాశ్మీరీ ముస్లిం నేతలతోపాటు పౌర సంఘాల నేతలు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ యాత్ర విజయవంతం కావాలని వారంతా ఆకాంక్షించారు. తాము ఈ యాత్రికుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని అన్నారు. యాత్ర సజావుగా సాగేందుకు యాత్రికులకు సహకారం అందించేందుకు అన్ని విధాల సహకరిస్తామని వారు స్పష్టం చేశారు. ఆదివారం శ్రీనగర్‌లో అమర్‌నాథ్ యాత్ర పుణ్య క్షేత్ర బోర్డ్ చైర్మన్, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి కాశ్మీర్ ముస్లిం నేతలతోపాటు పౌర సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో పాల్గొని అమర్‌నాథ్ యాత్రకు మద్దతు ప్రకటించిన వారిపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రశంసలు కురిపించారు. వారంతా ఆధ్యాత్మిక సంప్రదాయ సంరక్షకులని, దేశ రక్షకులని అభివర్ణించారు. తరతరాలుగా ఈ అమర్‌నాథ్ యాత్ర ఆధ్యాత్మిక వారసత్వంగా కొనసాగుతోందన్నారని గుర్తు చేశారు. ఈ యాత్రకు మరోసారి భక్తులను స్వాగతించడానికి తాము సిద్ధమవుతున్నామని తెలిపారు. అలాంటి తరుణంలో మీ మార్గదర్శనం, సహకారం కోసం మీలో ప్రతి ఒక్కరి కోసం తాను ఎదురు చూస్తున్నానని తెలిపారు. ప్రతి యాత్రికుడు గౌరవం, భద్రతతోపాటు తాము కూడా ఈ ప్రాంతానికి చెందిన వారమనే భావన పెంపొందేలా చూడటంలో మీ పాత్ర అత్యంత కీలకమని ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ సిన్హా వ్యాఖ్యానించారు. తమ హోటళ్లలో బస చేసే అమర్‌నాథ్ యాత్రికుల నుంచి వసూలు చేసే ఛార్జీల్లో 30 శాతం తగ్గిస్తామని హోటల్ యజమానులు ప్రకటించారు. వారు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. జులై 3న ఈ యాత్ర ప్రారంభం కానుంది. ఆగస్టు 28వ తేదీతో ఈ యాత్ర ముగియనుంది. ఈ యాత్ర కోసం ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. భద్రత కోసం పోలీసులు, సైన్యంతోపాటు 670 కంపెనీల పారా మిలిటరీ బలగాలను మోహరించనుంది.

# కేంద్ర మంత్రికి రూ.99లక్షలు పైగా సబ్సిడీ..



**న్యూఢిల్లీ,జూన్ 28:** కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి రాజస్థాన్‌లో తన దోసకాయల సాగు కోసం రూ.99 లక్షలకుపైగా మొత్తాన్ని సబ్సిడీగా పొందారు. ఈ రాయితీని ఆయన తాను ఉపాధ్యక్షునిగా పని చేస్తున్న బోర్డునుంచే పొందడం విశేషం. ఒక ఆంగ్లపత్రిక ప్రచురించిన వివరాల ప్రకారం కూచామన్ జిల్లా, పీహ్ గ్రామంలో నేషనల్ హార్టికల్చర్ బోర్డ్(ఎన్‌హెచ్‌బీ), వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం వారి సహాయంతో అనే బోర్డు కలిగిన ఒక విస్తారమైన వ్యవసాయ క్షేత్రం ఉంది. దానిపై లబ్ధిదారుని పేరు దగ్గర మిస్టర్ భగీరథ్‌చౌదరి అని, సబ్సిడీ మొత్తం 50శాతం అంటే రూ.99, 60,000 అని స్పష్టంగా రాసి ఉంది. గత ఏడాది దేశవ్యాప్తంగా అమోదం పొందిన 467 ప్రాజెక్టులలో మంత్రి ప్రాజెక్టు ఒకటి కావడం విశేషం. కేంద్ర మంత్రికి రాయితీ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తిన వేళ భగీరథ్ చౌదరి మాట్లాడుతూ తాను మంత్రి కాకముందే తన దోసకాయల సాగు ప్రాజెక్టు కోసం ప్రభుత్వ పథకం కింద రూ.99.03 లక్షల సబ్సిడీని పొందినట్లు తెలిపారు. ఈ విషయంలో తానేమీ దాచలేదని, తనపై వస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. కాగా ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా సోషల్‌మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ధర్మం ఇంటి నుంచే మొదలవుతుందంటారు. కానీ బీజేపీకి మాత్రం సబ్సిడీ ఇంటి నుంచే మొదలవుతుందని వ్యాఖ్యానించారు. మంత్రి చేపట్టిన ప్రాజెక్టు వ్యయం రూ.1.99 కోట్లు. ఇందులో లబ్ధిదారు వాటా రూ. 49.8 లక్షలు. మంత్రి ఈ ప్రాజెక్టు కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.1.49 కోట్లు రుణం తీసుకున్నారని ఆ వార్తకథనంలోఉంది ఈ ఉదంతంపై మంత్రి కార్యాలయ సహాయకుడు స్పందిస్తూ, ఈ ప్రాజెక్టు వివరాలను త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.

## ఈ యేడాదే బంగ్లాదేశ్‌కు వెళ్లిపోతా: మాజీ ప్రధాని షేక్ హసీనా



**న్యూఢిల్లీ,జూన్ 28:** రెండేళ్ల క్రితం బంగ్లాదేశ్ లో తలెత్తిన జెన్ జీ తిరుగుబాటు తర్వాత దేశం వదిలి భారత్ కు తరలివచ్చేసిన మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పటి నుంచీభారత్‌లో ప్రవాసంలో ఉంటున్నారు. తాను ప్రధానిగా ఉన్నప్పుడు భారత్‌లో సానుకూల సంబంధాలు నెరిపిన చరిత్ర ఉన్న హసీనాను మన ప్రభుత్వం శరణార్థిగా పరిగణించి ఆశ్రయం ఇచ్చింది. బంగ్లాదేశ్ లో ఆమెపై పలు కేసులు ఉన్నా, వాటి విచారణ కోసం ఆమెను అప్పగించాలని అక్కడి ప్రభుత్వం కోరినా భారత్ మాత్రం పట్టించుకోలేదు. అయితే హసీనా ఇప్పుడు స్వదేశం తిరిగి వెళ్లడంపై క్లారిటీ ఇచ్చారు. తాను ఈ ఏడాదే స్వదేశానికి తిరిగి వెళ్లిపోతానని తాజాగా ఇచ్చిన టివి ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. తన పార్టీ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక శక్తి అని ఆమె స్పష్టం చేశారు. మైనారిటీలపై ఎలాంటి దాడి అయినా బంగ్లాదేశ్ స్వాతంత్రంపై దాడితో సమానమని హసీనా తేల్చి చెప్పారు. దేశవ్యాప్త నిషేధాన్ని ధిక్కరిస్తూ అవామీ లీగ్ తాజాగా తన 77వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సందర్భంగా డజన్ల కొద్దీ కార్యకర్తలు అరెస్టు అయ్యారు. తన తిరుగు ప్రయాణం అనేది వ్యక్తిగత ఆశయానికి సంబంధించిన విషయం కాదని, ఇది బంగ్లాదేశ్ ప్రజల రాజకీయ హక్కులు, ప్రజాస్వామ్య పునరుద్ధరణ, చట్ట పాలన, మన విముక్తి పోరాట స్ఫూర్తి వంటి అత్యంత కీలకమైన అంశాలతో ముడిపడి ఉందని టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో హసీనా తెలిపారు. తాను అధికారం కోసం రాజకీయాలు చేయనని, బంగ్లాదేశ్ ప్రజల సంక్షేమం కోసం, సోనార్ బంగ్లా (సువర్ణ బంగ్లా)ను నిర్మించాలన్న జాతిపిత బంగాబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ కలను సాకారం చేయడం కోసం రాజకీయాలు చేస్తానని తెలిపారు. తనకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పు న్యాయమైనది కాదన్నారు.

## లోహ్‌గఢ్ కోటలో కేతన్ హత్య సీన్ రీకన్‌స్ట్రక్షన్



**పూణె,జూన్ 28:** మహారాష్ట్రలోని పూనేకు చెందిన వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసు విచారణలో ప్రధాన నిందితురాలు సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి ప్రస్తుతం పోలీసు కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్నారు. దీనిలో భాగంగా సియా గోయల్‌ను పోలీసులు ఆదివారం ఉదయం 6.30 గంటలకు లోహాగఢ్ కోటకు తీసుకువచ్చారు. పర్వతంపైనున్న ఈ కోట నుంచే కేతన్‌ను సియా తోసేసి చంపేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హత్యకు సంబంధించిన వివరాల్ని సేకరించేందుకు పోలీసులు కోట వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. సియాను తీసుకెళ్లి అక్కడ ఆమెఎలా హత్య చేసిందో వివరంగా తెలుసుకున్నారు. ఈ సీన్ రీక్రియేషన్‌లో భాగంగా మనిషిని పోలిన ఒక బొమ్మను కూడా పోలీసులు పర్వతంపైనుంచి తోసేశారు. ఇక, పోలీసు కస్టడీలో విచారణలో సియా, చేతన్‌లు కీలక విషయాల్ని తెలిపారు. కేతన్ హత్యకు ముందు లోహాగఢ్ కోటలో మర్డర్ రిహార్సల్స్ కూడా చేసినట్లు తేలింది. హత్య చేయడానికి కొద్ది రోజుల ముందు ఇద్దరూ కోటకు వెళ్లి ఏ ప్రదేశం నుంచి తోసేస్తే ఈజీగా చంపవచ్చు అనేది పరిశీలించారు. అనేక ప్రదేశాల్ని పరిశీలించి, అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నారు. అతడిని తోసేసిన తర్వాత అది హత్యలా కాకుండా ప్రమాదంగా అనిపించేలా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో ముందే ప్లాన్ చేశారు. కేతన్ హత్య అనంతరం పోలీసులు విచారణలో అడగబోయే ప్రశ్నలు ఏంటి వాటికి ఏం సమాధానంచెప్పాలో కూడాముందుగానే సిద్ధమయ్యారు. హత్య చేసే విధానాల గురించి గూగుల్‌లో, యూట్యూబ్‌లో సెర్చ్ చేశారు. సియా, చేతన్ కలిసి చాలా పకడ్బందీగా హత్యకు ప్లాన్ చేశారు.




## రాజకీయాలంటే పార్ట్‌టైమ్ బాధ్యతలు కాదు

### రాహుల్‌పై మాజీ రాష్ట్రపతి ప్రణబ్ కుమార్తె చురకలు

**న్యూఢిల్లీ,జూన్ 28:** మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయాలంటే కొద్ది రోజులు ప్రజల్లో ఉంటూ, మళ్లీ మాయమయ్యే వ్యవహారం కాదని, రాజకీయం 24 గంటలు, ఏడాది పొడవునా కొనసాగే ఫుల్‌టైమ్ బాధ్యత అని ఆమె అన్నారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 2014లో రాహుల్ గాంధీ కాంగ్రెస్ ముఖ్య నేతగా ఉన్నప్పటి నుంచి పార్టీ వరసగా ఎన్నికల్లో ఓటములు చవిచూస్తోందని, ఇది ఆయన నాయకత్వ వైఫల్యంగా భావించాల్సిందే అని పేర్కొన్నారు.

## 'కన్యత్వం' పోతే బాధితురాలిని తప్పుబట్టలేం



### అత్యాచార కేసులో అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు

### నిందితుడు 10రోజుల్లోపు లొంగిపోవాలని ఆదేశం

**ప్రయాగ్‌రాజ్, జూన్ 28:** అత్యాచార బాధితురాలి వాంగ్మూలం విశ్వసనీయంగా ఉన్నట్లయితే, ఆమె హైమెన్ (కన్యత్వ పొర) చిరిగిపోయి ఉండటం అనే కారణంతో నిందితుడికి 'సందేహ ప్రయోజన్మం' లభించదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. అత్యాచారం అనేది ఒక చట్టపరమైన పదం తప్ప వైద్యపరమైన పదం కాదని కూడా కోర్టు పేర్కొంది. 1982లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి, అత్యాచార నేరస్తుడికి 1983లో విధించిన శిక్షను (నేర నిర్ధారణ, మూడేళ్ల జైలు శిక్ష) కోర్టు సమర్థించింది. క్రీడలు, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, గుర్రపు స్వారీ, కఠినమైన శారీరక శ్రమ లేదా ప్రమాదవశాత్తు జరిగే గాయాల వంటి వివిధ కారణాల వల్ల హైమెన్ చిరిగిపోయే అవకాశం ఉందని జస్టిస్ సంతోష్ రాయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. కొంతమందికి పుట్టుకతోనే హైమెన్ రంధ్రం కలిగి ఉండటం లేదా అసలు లేకపోవడం వంటివి జరుగుతాయని, మరికొందరిలో అది చాలా సాగే గుణం కలిగిఉంటుందని కోర్టు పేర్కొంది. కాబట్టి, ఇటువంటి వైద్యపరమైన అంశాలు బాధితురాలి విశ్వసనీయమైన వాంగ్మూలాన్ని అధిగమించలేవని కోర్టు అభిప్రాయపడింది. అత్యాచారం సాధారణంగా రహస్య వాతావరణంలో జరుగుతుందని, అంటే స్వతంత్ర ప్రత్యక్ష సాక్షులు దొరికే అవకాశం ఆచరణలో దాదాపు ఉండదని కూడా కోర్టు నొక్కి చెప్పింది. రాకేష్ అప్పటికే బెయిల్‌పై ఉన్నాడు. జూన్ 23నాటి తన తీర్పులో, హైకోర్టు ఆ దోషిబెయిల్ బాండ్లను తక్షణమే రద్దు చేసింది. తన శిక్షలో మిగిలిన భాగాన్ని అనుభవించడానికి 10 రోజుల్లోగా విచారణ కోర్టు (ట్రయల్ కోర్టు) ముందు లొంగిపోవాలని అతన్ని ఆదేశించింది.

## పెళ్లికి తిరస్కరించిందని మహిళపై దాడి, ఇంటికి నిప్పు

### నిందితుడు అరెస్టు



**భువనేశ్వర్, జూన్ 28:** ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో ప్రేమ ప్రతిపాదనను తిరస్కరించినందుకు ఒక వ్యక్తి మహిళ ఇంటికి నిప్పు పెట్టడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. నిందితుడిని అరెస్టు చేశామని, తదుపరి విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన సుందర్‌గఢ్ జిల్లాలోని బిస్రా బ్లాక్ పరిధిలోని ఒక గ్రామంలో జరిగింది. ప్రాథమిక విచారణ ప్రకారం, నిందితుడు ఆ మహిళ పట్ల తీవ్ర వ్యామోహం పెంచుకున్నాడు. ఆమె తన వివాహ ప్రతిపాదనను తిరస్కరించడంతో దాడికి పాల్పడ్డాడు. ఆమె గదిలో నిద్రిస్తుండగా, నిందితుడు కిటికీ గుండా పెట్రోల్ పోసి, ఆమెను చంపాలనే ఉద్దేశంతో నిప్పు పెట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. మంటలు చెలరేగడానికి కొద్ది క్షణాల ముందు నిందితుడు రజత్ కిరోను కిటికీ దగ్గరచూసినట్లు బాధితురాలి తండ్రి జెనా టోప్పో ఆరోపించారు. వివాహ ప్రతిపాదనను తిరస్కరించినప్పటి నుండి కిరో తన కుమార్తెను పలుమార్లు వేధించాడని కూడా ఆయన తెలిపారు. మహిళ ఆర్త నాదాలు విని, మంటలను గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని, కాలిపోతున్న ఇంటి నుండి ఆమెను రక్షించి రూర్కెలాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు తీవ్రమైన కాలిన గాయాలయ్యాయని (సుమారు 40 శాతం వరకు అని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి), ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. పోలీసులు శాస్త్రీయ పరిశోధన బృందంతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించారు. నిందితుడికి ఆ మహిళ పట్ల ఉన్న వ్యామోహమే ఈ దాడికి కారణమని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. "నిందితుడిని అరెస్టు చేశాము. అతన్ని కోర్టులో హాజరు పరుస్తాము. తదుపరి విచారణ కొనసాగుతోంది" అని పోలీసులు తెలిపారు.

# కరాచీలో భీకర ఉగ్రదాడి

## నలుగురు సైనికులు మృతి

### ఆరుగురు ఉగ్రవాదులు కూడా ఖతం

**కరాచి,జూన్ 28:** పాకిస్థాన్‌లోని అతిపెద్ద నగరమైన కరాచీలో శనివారం భీకర ఉగ్రదాడి జరిగింది. నగరంలోని సింధ్ రేంజర్ల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడి, కాల్పుల ఘటనలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమవగా, మరొకరిని సజీవంగా పట్టుకున్నారు. కరాచీలోని గులిస్తాన్‌ఎజౌహార్ ప్రాంతంలో ఉన్న సింధ్ రేంజర్ల ప్రధాన కార్యాలయంపైకి ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో దూసుకొచ్చారు. స్థావరాన్ని ఢీకొట్టి వాహనాన్ని పేల్చివేసిన వెంటనే, మిగిలిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు వెంటనే ఎదురుదాడికి దిగడంతో ఆ ప్రాంతం మొత్తం కాల్పుల మోతతో దద్దరిల్లింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు, కమాండోలను రంగంలోకి దించారు. ఈ దాడికి తామే బాధ్యులమని తెహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) నుంచి విడిపోయిన జమాత్‌ఉల్‌అహ్రార్ అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. పాకిస్థాన్‌లో భద్రతా బలగాలపై ఇటీవలి కాలంలో దాడులు పెరిగిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈదాడిపై సింధ్ ముఖ్యమంత్రి సయ్యద్ మురాద్ అలీషా తీవ్రంగా స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, కూంబింగ్ నిర్వహిస్తు న్నాయి. ఈ ఘటనలో సామాన్య పౌరులెవరూ గాయపడలేదని అధికారులు ప్రాథమికంగా తెలిపారు.

## 15వేల మందిని చంపే టార్గెట్‌తోనే క్యాప్సూల్స్ తెచ్చా..

### మొహర్రం వేడుకల్లో పట్టుబడిన నిందితుడు వెల్లడి



**ముంబయి,జూన్ 28:** మహారాష్ట్ర రాజధాని ముంబైలో మొహర్రం ఊరేగింపు సందర్భంగా భారీ విషాదం త్రుటిలో తప్పింది. ఊరేగింపులో పాల్గొన్న వారికి విషపూరిత క్యాప్సూల్స్ పంపిణీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు 14,900 క్యాప్సూల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు క్యాప్సూల్స్‌ను నొప్పి నివారణ మాత్రలు, రోగనిరోధక శక్తిని పెంచే మందులని చెప్పి ప్రజలకు అందజేశాడు. ఆ క్యాప్సూల్స్‌లో జింక్ ఫాస్ఫైడ్ అనే అత్యంత విషపూరిత రసాయనం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ రసాయనం సాధారణంగా ఎలుకల మందులో ఉపయోగిస్తారు. ఈ క్యాప్సూల్స్ తీసుకున్న 11 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే సకాలంలో హాస్పిటల్‌లో చేర్చడంతో ప్రాణాలతో బయటపడ్డారు. తాను సుమారు 15 వేల మందిని చంపాలనుకున్నట్టు నిందితుడు ఫయాజ్ ప్రేమ్‌జీ చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. అతడు ముందుగానే 30 వేల ఖాళీ క్యాప్సూల్స్, 50 కిలోల జింక్ ఫాస్ఫైడ్ ఆర్డర్ చేసినట్టు దర్యాప్తులో బయటపడింది. అతడి ఉద్దేశం, ఈ ఘటన వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ భారీ ప్రమాదాన్ని ముగ్గురు మహిళా వాలంటీర్లు పసిగట్టి అడ్డుకోగలిగారు. నిందితుడు అనుమానాస్పదంగా క్యాప్సూల్స్ పంచుతుండటాన్ని గమనించిన వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం లౌడ్‌స్పీకర్ ద్వారా ప్రజలకు ఆ క్యాప్సూల్స్ తీసుకోవద్దని హెచ్చరికలు జారీ చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిందితుడు ముందుగా ఒకరోజు హోటల్‌లోనే ఉండి ఈ క్యాప్సూల్స్ తయారు చేసాడని దర్యాప్తులో అంగీకరించాడు.


## త్రిశూర్‌లో సింథటిక్‌డ్రగ్స్ ముఠా అరెస్టు..

### 308 గ్రాముల ఎంఎండిఎ స్వాధీనం

**త్రిశూర్,జూన్ 28:** కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో భారీ ఎత్తున సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఇద్దరు మహిళలు సహా మొత్తం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 308 గ్రాముల నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో పట్టుబడిన అతిపెద్ద డ్రగ్స్ కేసుల్లో ఇది ఒకటని అధికారులు తెలిపారు. వాణియంపార ప్రాంతంలో యాంటీ నార్కోటిక్ స్పెషల్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఈముఠా వ్యవహారం బయటపడింది. పాలక్కాడ్ నుంచి వస్తున్న స్విఫ్ట్ కారును ఆపి సోదా చేయగా, అందులో ఉన్న ఒక మహిళ తన రహస్య భాగాల్లో రెండు గ్రాముల ఎండీఎంఏను దాచి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో కారులోని షిఫాస్, విద్య, జిష్ణు, శ్రీలక్ష్మిలను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిని విచారించగా, ఈ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు షిఫాస్ ఇంట్లో సోదాలు చేయగా మరో 18 గ్రాముల డ్రగ్స్ లభించాయి.

# సంక్షిప్త వార్తలు

## జపాన్‌లో మళ్లీ భూకంపం: రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రత



**టోక్యో, జూన్ 28:** జపాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. ఆదివారం ఉదయం మళ్లీ భూమి కంపించింది. ఆ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.1గా నమోదైంది. అమోరి ప్రిఫెక్చర్ సమీపంలో 40 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు జపాన్ వాతావరణ విభాగం (జెఎంఎ) వెల్లడించింది. కాగా గత కొన్ని రోజులుగా పలు దేశాలను భూకంపాలు వణికిస్తున్నాయి. ఈ ప్రకృతి విపత్తు ఇటీవల వెనుజులాలో భారీ విధ్వంసాన్ని సృష్టించి విషాదాన్ని మిగిల్చింది. వెనుజులాలో భూకంపం సంభవించిన సమయంలోనే జపాన్‌లో 7.2 తీవ్రతతో భూకంపం వచ్చింది. మళ్లీ కొద్ది రోజుల వ్యవధిలో ఇలా రెండోసారి ప్రకంపనలు రావడంపై జపాన్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## 13యేళ్ల బాలికపై 5 రోజుల్లో 30మంది అత్యాచారం


**న్యూఢిల్లీ, జూన్ 28:** రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో 13యేళ్ల బాలికపై 30 మందికి పైగా వ్యక్తులు ఐదు రోజుల పాటు అత్యాచారం చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ లైంగిక దాడి ఘటనలు పలు హోటళ్లలో జరిగినట్లు చెబుతున్నారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఇంటి నుండి అదృశ్యమైన బాలికను ఒక రిక్షా డ్రైవర్ హోటల్ యజమానికి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మైనర్ బాలిక లైంగిక దోపిడీలో మరికొందరు హోటల్ నిర్వాహకులు కూడా ప్రమేయం కలిగి ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. బాధిత బాలిక ఫిర్యాదుతో పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులను అరెస్టు చేశారు.

## రాజధానిలో రాహుల్ కనిపించడంలేదంటూ పోస్టర్లు..





**న్యూఢిల్లీ,జూన్ 28:** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ కలకలం రేగింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కనిపించడం లేదు అంటూ ఆదివారం ఢిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో వెలిసిన పోస్టర్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాహుల్‌గాంధీ తాజా విదేశీ పర్యటనను లక్ష్యంగా చేసుకుని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో ఈ పరిణామం సరికొత్త మలుపు తిప్పింది. ఢిల్లీలోని ఫిరోజ్‌షా రోడ్డుతో పాటు పలు ప్రధాన కూడళ్లలో రాహుల్ గాంధీ ఫొటోతో కూడిన మిస్సింగ్ పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. అయితే ఈ పోస్టర్లను ఎవరు అంటించారనేది ప్రస్తుతానికి స్పష్టంగా తెలియరాలేదు.

## ప్రొఫెల్లర్ తగిలి ట్రైనీ పైలట్‌కు గాయాలు..



**లక్నో, జూన్ 28:** శిక్షణలో భాగంగా విమానం నడిపిన మహిళా ట్రైనీ పైలట్ ల్యాండింగ్ తర్వాత ఇంజిన్ ఆన్‌లో ఉండగానే కిందకు దిగింది. దీంతో తిరుగుతున్న ప్రొపెల్లర్ ఆమె వెనుక భాగానికి తగలడంతో గాయపడింది. ఆ మహిళను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూంలో ఈ సంఘటన జరిగింది. ఈనెల 26న కాన్పూర్‌లోని చకేరి విమానాశ్రయంలో గార్గ్ ఏవియేషన్‌కు చెందిన ట్విన్ ఇంజిన్ విమానంలో మహిళా ట్రైనీ పైలట్ రాత్రిపూట శిక్షణ పొందింది. ఆమెతో పాటు ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ కూడా అందులో ఉన్నారు.

## పార్టీగుర్తు ఫోర్జరీ చేశారంటూ టిఎంసి లీగల్‌సెల్ ఫిర్యాదు



**కోల్‌కత్తా,జూన్ 28:** పశ్చిమ బెంగాల్‌లో అధికారాన్ని కోల్పోయిన అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే పార్టీ రెండుగా చీలింది. మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బయటికి వెళ్లి పోయారు. అసలు టీఎంసీ ప్రతిపక్ష హోదా సైతం కోల్పోయింది. ఎన్నికలు ముగిసిన నెల రోజుల్లోపే తృణమూల్ మొత్తం కూడా చెల్లాచెదురైంది. పార్టీ అధినేత్రి మమత బెనర్జీ, ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సహా పార్టీ సీనియర్లు కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిణామాల మధ్య మమత బెనర్జీ తాజా ఎత్తుగడవేశారు. పార్టీ అధికారిక గుర్తును ఫోర్జరీ చేయడంతో పాటు, పేరును దుర్వినియోగం చేస్తూ కొందరు నేతలు ప్రైవేట్‌గా సమావేశాలు నిర్వహించారనే అంశాన్ని తెర మీదికి తెచ్చారు. ఈ క్రమంలో పార్టీ లీగల్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వార్త, ఖమ్మం, సోమవారం 29, జూన్ 2026



ఆదివారం మాజీ ప్రధాని పివి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, పిసిపి చీఫ్ మహేశ్, ఎంపి అనిల్‌కుమార్ తదితరులు

## పివి ఆశయాలు స్ఫూర్తిదాయకం

### 105వ జయంతి సందర్భంగా పివి ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించిన పలువురు నేతలు

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 28, ప్రభాతవార్త:** భారతరత్న మాజీ ప్రధాని పివి నరసింహారావు 105వ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీవీ జ్ఞానభూమి వద్ద ఆదివారం వివిధ రాజకీయ పార్టీల నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలిసి పివి సమాధి వద్ద పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొని యాడారు. దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మహానేత పీ.వీ. అని ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉన్న సమయంలో సమర్థవంతమైన నాయకత్వం అందించి భారత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధిపథంలో నడిపించిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం పీవీకి జ్ఞానభూమిలో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాజ్యసభసభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఫిషరీస్ కార్పరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ ఇతర పార్టీలకు చెందిన ముఖ్య నేతలు, పీవీ కుటుంబసభ్యులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. పొన్నం మాట్లాడుతూ పీవీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, దూరదృష్టి కలిగిన నేత అని కొనియాడారు. ఆయన సేవలను చిర స్థాయిగా నిలిపేందుకు ప్రభుత్వం కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన స్ఫూర్తిని భావితరాలకు చేరవేస్తుందన్నారు. నివాళులు అర్పించిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కే.కేశవరావు(కేకే), బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, దైవజ్ఞశర్మ, మాజీస్పీకర్ మధుసూదనాచారి తదితరులు ఉన్నారు.

## పివికి ప్రధాని మోడీ ఘన నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ప్రధాని మోడీ ఘన నివాళులు అర్పించారు. కీలక దశలో దేశ పురోగతికి పీవీ చిరస్మరణీయమైన కృషి చేశారని కొనియాడారు. సమర్థవంతమైన పరిపాలనాదక్షుడిగా పీవీ తనదైన ముద్ర వేశారన్న ప్రధాని, అపారమైన జ్ఞానం, అవగాహన కలిగిన విశిష్ట పండితులుగా పీవీ గుర్తింపు పొందారని కీర్తించారు.

## అసెంబ్లీ ఆవరణలో పివి చిత్రపటానికి స్పీకర్, చైర్మన్ నివాళి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** మాజీ ప్రధాని, భారత రత్న పివి నరసింహారావు జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం శాసనసభ భవనం లాబీహాల్‌లోని చిత్రపటానికి పూలమాలలు వేసి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్, పివి కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు ఘన నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఘన నివాళులు అర్పించారు. ఆర్థిక సంస్కరణలకు ఊతమిచ్చి, భారతదేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన తెలంగాణ ముద్దుబిడ్డ, బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తున్నానని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమంలో కేసీఆర్ పోస్టు పెట్టారు. ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడు భారతరత్న పీవీ నరసింహారావు అని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. గడ్డుకాలంలో దేశాన్ని భారీ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించారని కొనియాడారు. ఆయన తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమని తెలిపారు. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ హయాంలో ఎంతో ఘనంగా నిర్వహించామని ప్రస్తావించారు. వెటర్నరీ యూనివర్శిటీకి పీవీ పేరు పెట్టామని చెప్పుకొచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమంలో కేటీఆర్ పోస్టు పెట్టారు. తెలంగాణ గర్వించే బిడ్డగా, అత్యుత్తమ పరిపాల నాదక్షుడిగా, ప్రధానిగా దేశానికి అమూల్యమైన సేవలను భారతరత్న పీవీ నరసింహారావు అందించారని మాజీ మంత్రి హరీశ్‌రావు కొని యాడారు. పీవీ జయంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ నివాళి అర్పిస్తున్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమంలో హరీశ్‌రావు పోస్టు పెట్టారు.

## మొక్కజొన్న ఇ-వేలంతో రాష్ట్ర ఖజానాకు రూ.202 కోట్ల ఆదా

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మొక్కజొన్నను ఈ వేలం విధానంలో విక్రయించడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.202 కోట్ల మేర ఆదా అయింది. గత వానాకాలం సీజన్‌కు సంబంధించి మార్క్ఫెడ్ వద్ద నిల్వ ఉన్న 3,80,187 టన్నుల మొక్కజొన్నను ఈవేలం విధానంలో విక్రయించింది. ప్రస్తుత యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో పంటల కొనుగోళ్లు జరుగుతుండటంతో గోదాములలో నిల్వ ఉన్న ఖరీఫ్ మొక్కజొన్నను ఖాళీ చేయించడంలో భాగంగా వీటిని ఈ వేలంలో విక్రయించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. గత పదేళ్లుగా మార్క్ఫెడ్లో మొక్కజొన్న విక్రయాల కోసం గోదాముల వారీగా ఈటెండర్లు నిర్వహించడం, ఆశించిన ధరలు రాకపోతే టూబిడ్ సిస్టమ్ ద్వారా ఈ టెండర్లు నిర్వహిస్తున్నారు. అదే విధానంలో ఈ ఏడాది ఏప్రిల్ 1న నిర్వహించిన ఈటెండర్లలో సుమారు సగం పరిమాణానికి మాత్రమే మెట్రిక్ టన్నుకు సగటున రూ.14,355 ధర లభించగా, మిగిలిన నిల్వలకు బిడ్డర్లు ముందుకు రాలేదు. అనంతరం ఏప్రిల్ 24న నిర్వహించిన ఈటెండర్లలో కూడా మెట్రిక్ టన్నుకు కేవలం రూ.14,010 మాత్రమే ధర లభించింది. దీంతో ప్రభుత్వం ఆ టెండర్లను కూడా ఆమోదించకుండా రద్దు చేసింది. పాత విధానానికి పూర్తిగా భిన్నంగా దేశవ్యాప్తంగా మరింత మంది వ్యాపారులు పాల్గొనేలా కొత్త ఈవేలం విధానాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగా ఇటీవల నిర్వహించిన ఈవేలంలో తీవ్ర పోటీ నెలకొనడంతో మెట్రిక్ టన్నుకు సగటున రూ.19,337 ధర లభించింది. ఇది గత టెండర్లలో లభించిన ధరతో పోలిస్తే టన్నుకు రూ.5,327 అధికమని అధికారులు వెల్లడించారు.

## వ్యవసాయ భవిష్యత్తు కోసం..

# ఆహార భద్రత, పరిశోధన, సాంకేతికత ప్రధానం

### ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** వ్యవసాయ భవిష్యత్ కోసం ఆహార భద్రత, వ్యవసాయ పరిశోధన, సాంకేతిక ఏకీకరణ, సుస్థిరత ప్రధానమని ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది సెమీ ఆరిడ్ ట్రాపిక్స్ (ఐసిఆర్ఐఎస్ఎటి-ఇక్రిశాట్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ క్షీణతను తగ్గించడానికి, వాతావరణ మార్పులను తట్టుకోగల, అధిక దిగుబడినిచ్చే పంటలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మెట్ట భూముల వ్యవసాయాన్ని పరివర్తన చెందించడంపై దృష్టి సారిస్తూ, ఐసీఆర్ఐఎస్ఏటీ, భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) సంయుక్తంగా న్యూఢిల్లీలోని ఎన్ఏఎస్సీ కాంప్లెక్స్‌లో ప్రపంచ మెట్ట భూముల కాంగ్రెస్‌ను సెప్టెంబర్ 10 నుండి 12 వరకూ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాన వ్యూహాత్మక పొత్తులు, వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయ కార్యక్రమాలు, పంటల పెంపకంలో పురోగతులు మరింత సాధించాలన్నారు. వాతావరణ అంతరాయాల నేపథ్యంలో, వాటి మార్పులను తట్టుకునే పంటలు, నీటి పొదుపు పద్ధతులను అవలంబించడంపై రైతులకు మార్గనిర్దేశం చేయడానికి ఇక్రిసాట్, దాని భాగస్వాములు ఒక ముందస్తు కార్యాచరణ ప్రణాళికను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిష్కారాలను విస్తరించడానికి, మెట్ట వ్యవసాయంలో స్థితిస్థాపకతను పెంపొందించే డిజిటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి సాంకేతిక సంస్థలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు ఏర్పరచ బద్ధాయన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల ద్వారా చిన్న రైతులకు మద్దతు ఇవ్వడానికి, కరువును తట్టుకునే, వేడిని తట్టుకునే, తెగుళ్ళను నిరోధించే పంట రకాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టామన్నారు. మెట్ట పంటల విత్తనాల సేకరణలను సంరక్షించి, పంపిణీ చేసే ఒక భారీ, ప్రపంచవ్యాప్తంగా ముఖ్యమైన జన్యు బ్యాంకును నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# యూరోపియన్ వర్సిటీలతో అవగాహన ఒప్పందాలు



### జర్మనీలో పర్యటిస్తున్న 35 మంది ఉన్నతవిద్యా ప్రతినిధి బృందం

### జులై 5 వరకు కొనసాగనున్న పర్యటన

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** యూరోపియన్ యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు చేసుకోనుంది. అందులో భాగంగా 35 మందితో కూడిన ప్రతినిధి బృందం జర్మనీలో పర్యటిస్తుంది. ఆదివారం జర్మనీకి బయలుదేరిన బృందం జులై 5 వరకు పర్యటనను కొనసాగించనుంది. జర్మనీలో ఉన్నత విద్యా అధ్యయన పర్యటనకు తెలంగాణ ప్రతినిధి బృందంఆదివారం బయలుదేరి వెళ్లింది. తెలంగాణలో ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లే దిశగా విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, రూసా 2.0 అంతర్జాతీయీకరణ కార్యక్రమంలో భాగంగా 35 మంది ఉన్నత విద్యా ప్రతినిధుల బృందం జర్మనీ పర్యటనకు వెళ్లింది. జులై 5 వరకు జరిగే ఏడు రోజుల అధ్యయన పర్యటనలో జర్మనీ లోని ప్రముఖ విశ్వవిద్యాల యాలు, పరిశోధనా సంస్థలు, పారిశ్రామిక సంస్థలను బృందం సందర్శించనుంది. తెలంగాణ ఉన్నత విద్యను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడం, విదేశీ విశ్వ విద్యాలయాలతో విద్యా భాగస్వా మ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఈ పర్యటనను నిర్వహిస్తోంది. ప్రతినిధి బృందంలో వివిధ విశ్వవిద్యాలయాల ఉపకుల పతులు, అధ్యాపకులు, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్, సాంకేతిక విద్య కమిషనరేట్ అధికారులు, అధ్యాపకులు, విద్యా నిపుణులు ఉన్నారు. ఆర్‌డబ్ల్యూటీహెచ్ ఆచెన్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అకాడమీ, ఓస్ట్‌ఫాలియా యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్, గోట్టింగెన్ యూనివర్సిటీ, టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్, మెర్సిడెజ్ బెంజ్ సిండెల్‌ఫింజెన్‌లో పర్యటించి పరిశీలించనున్నారు. జర్మనీలో అమలవుతున్న డ్యూయల్ అప్రెంటిస్ షిప్, నైపుణ్యాభివృద్ధి విధానాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికల రూపకల్పన, పరిశ్రమలు విద్యాసంస్థల భాగస్వామ్యం, ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలు, విద్యా పరిపాలన, విద్యార్థుల అంతర్జాతీయ మార్పిడి కార్యక్రమాలు, పరిశోధన సహకారం వంటి అంశాలను ప్రతినిధి బృందం అధ్యయనం చేయనుంది.

దాంతోపాటు ప్రముఖ యూరోపియన్ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయు), ఉద్దేశ్య పత్రాలు కుదుర్చుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. పర్యటన సందర్భంగా వివిధ విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులతో సమావేశాలు, పరిశోధనా ప్రయోగశాలల సందర్శనలు, నిపుణుల ఆధ్వర్యంలో విద్యా సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్టుట్ గార్ట్ లోని మెర్సిడెస్ బెంజ్ సిండెల్ ఫింగెన్ తయారీ కేంద్రాన్ని సందర్శించి, జర్మనీ డ్యూయల్ విద్యా విధానం పరిశ్రమలతోకలిసి ఎలా అమలవుతోందో ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్ లో పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం కూడా ఏర్పాటు చేశారు. ఈ పర్యటన ద్వారా పాఠ్య ప్రణాళికల సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ విద్యాసంస్థల అనుసంధానంపై విలువైన అనుభవాలను తెలంగాణకు తీసుకురావడంతో పాటు, జర్మనీ ప్రముఖ విశ్వవిద్యాలయాలతో దీర్ఘకాలిక విద్యా భాగస్వామ్యానికి బాటలు పడనున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీకళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, విద్యాసంస్థలకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు మరింత విస్తరించనున్నాయి.

# విద్యుత్ వ్యవస్థ మరింత బలోపేతం

### వినియోగదారులకు మెరుగైన విద్యుత్

### దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ డైరెక్టర్ నర్సింహులు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ మరింత బలోపేతం చేసే దిశగా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంతో ఉన్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ ఎన్ నర్సింహులు తెలిపారు.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రంగారెడ్డి జోన్ పరిధిలోని రాజేంద్రనగర్ డివిజన్, రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఉన్న 33/11 కేవీ రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఈ అప్‌గ్రేడేషన్ ద్వారా సబ్‌స్టేషన్ సామర్థం 8 ఎంవీఏ నుంచి 16 ఎంవీఏకు పెరిగి విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతమైందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన అన్ని సాంకేతిక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి, సంతృప్తికర ఫలితాలు వచ్చిన అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఛార్జ్ చేసి సేవల్లోకి తీసు కొచ్చినట్లు తెలిపారు. ఈ సామర్థ్య పెంపుతో సంబంధిత వివిధ ప్రాంతంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా తీర్చడంతో పాటు విద్యుత్ సరఫరా నాణ్యత మరింత మెరుగుపడనుందని స్పష్టం చేశారు.

అలాగే విని యోగదారులకు నిరంతరాయ విద్యుత్ అందిం చడంలో ఈ అప్‌గ్రేడేషన్ కీలకంగా ఉపయోగపడనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ పాండ్యా తదితరులు పాల్గొన్నారు.



పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు.

## పోలియోరహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

### బోరబండలో పోలియో చుక్కల కార్యక్రమం

### పాల్గొన్న మంత్రులు రాజనర్సింహ, పొన్నం, అడ్లూరి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 28, ప్రభాతవార్త:** పోలియో రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్రస్థాయి పల్స్ పోలియో కార్యక్రమాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ, సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మంత్రి మాట్లా డుతూ రాష్ట్రవ్యాప్తంగా 42 లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 22 వేలకుపైగా పోలియో కేంద్రాలు, 900 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. పోలియో కారణంగా అంగవైకల్యం వంటి తీవ్ర పరిణా మాలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. హైదరాబాద్ జిల్లాలో 5 లక్షలకుపైగా చిన్నారులకు 2,800 పోలియో కేంద్రాల ద్వారా చుక్కలు వేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## విబి జిరాం జిపై సదస్సుకు నేడు ఢిల్లీకి మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. వీబీజీ రాం జీపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కీలక సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొననున్నారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరిగే సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలు, సూచనలు, సవరణల ప్రతిపాదనలను స్పష్టంగా వినిపించాలని శనివారం జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు.
దీంతో పాటు వీబీజీ రామ్‌జీ చట్టంలోని అన్ని కీలక నిబంధ నలను సమగ్రంగా సమీక్షించారు. గ్రామీణ ఉపాధి హక్కు, పేదల జీవనోపాధి, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు, అమలు వ్యవస్థ, ఆర్థిక బాధ్యతలు, కేంద్ర రాష్ట్ర సంబంధాలపై ఈ చట్టం చూపే ప్రభావాన్ని సభ్యు లు విస్తృతంగా చర్చించారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రితో సమావేశం కారణంగా తాను ఆదివారం సాయంత్రం నల్లగొండ కేంద్రంగా సీఎం చేతుల మీదుగా ప్రారంభం కానున్న హ్యామ్‌రోడ్ల శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కాలేకపోయానని ఒక ప్రకటనలో వెల్లడించారు. పోరాటాల పురిటి గడ్డ నల్గొండ కేంద్రంగా ప్రారంభమైన హ్యామ్‌రోడ్ల నిర్మాణం విజయ వంతం అవుతుందని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# తెలుగు వర్సిటీలో 'ప్రైవేటు సంస్థలు' ప్రవేశించొద్దు



తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో పెద్దయెత్తున నిరసనలు తెలుపుతున్న విశ్వవిద్యాలయ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు

### ఆద్యకళా సమితి అక్రమ ప్రయత్నాలను అడ్డుకోవాలంటున్న వర్సిటీ విద్యార్థులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 28, ప్రభాతవార్త :** తెలంగాణలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, కళలు, సంస్కృతికి కేంద్రబిందువుగా ఉన్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ నాంపల్లి ప్రాంగణాన్ని ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేసే ప్రయత్నాలను వెంటనే విరమించాలని విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రభుత్వానికి, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావుకు విజ్ఞప్తి చేశారు. ఈరోజు ఆదివారం సెలవు దినమైనప్పటికీ వచ్చిన నాంపల్లి ప్రాంగ ణంలో జ్యోతిష విద్యార్థులు మా చదువుల తల్లిని దూరం చేయొద్దు అనే ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దయెత్తున నిరసన వ్యక్తపరిచారు. ప్రాంగణాన్ని పరిరక్షించాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళ నను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం నాంపల్లి విశ్వ విద్యాల యం ప్రాంగణం లో ఉన్న తరగతి గదులే అవసరా లకు సరిపో వడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ నిర్ణయాల మేరకు కొంత భాగాన్ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు, చేనేత జౌళి పరిశ్రమ శాఖలకు కేటాయించడంతో స్థలాభావం తీవ్రమైందని ఆవేదన వ్యక్త పరిచారు. ఒక మాజీ ఆచార్యుడు తాను సేకరించిన ప్రాచీన వస్తువులను విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని 4వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అనధికారికంగా అనుమతులు లేకుండా ఉంచడమేకాక ఉంచిన కర్ర సామగ్రి పాడైపోతుం దని తప్పుడు ప్రకటనలు చేయడం హాస్యాస్ప దమని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఆద్యకళా సమితి సభ్యులు తమ అభిప్రాయాన్ని మార్చుకుని అనధికారంగా ఉంచిన వస్తువులను తరగతి గదుల నుండి ఖాళీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆద్యకళా సమితి సభ్యులు జయధీర్ తిరుమలరావు సేకరించిన వస్తువులను విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నెలకొల్పాలని ఇచ్చిన ప్రకట నను వెనక్కి తీసుకోవాలని విద్యార్థి సంఘం ఎబివిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎబివిపి ఆల్‌ఇండియా స్టేట్ యూనివర్సిటీస్ కోకన్వీనర్ కమల్ సురేష్ విద్యార్థులతో కలిసి మాట్లాడుతూ ఇప్పటికే విశ్వవిద్యాల యంలో విద్యార్థులకు సరిపడా భవనాలు, తరగతి గదులువేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో వారిని విద్యకు దూరంచేసే కుట్ర ఇదని దుయ్యబట్టారు.

# పివి జమానాలో భూసంస్కరణలు అమలు

### ఇప్పుడు దేశంలో దుర్యోధన, దుశ్శాసన పాలన సాగుతోంది

### సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెలుగు ప్రజలతో సహా దేశ ప్రజలకు సుపరిచితులని సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె నారాయణ అన్నారు. జూన్ 28 పీవీ నరసింహ రావు జయంతి. పీవీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆయన భూ సంస్కరణలు అమలు చేయడంతో భూస్వాములు అంతా కలిసి జై ఆంధ్రా ఉద్యమం తీసుకొచ్చారని, ఆనాడు గుంటూరులో విద్యార్థిగా ఉన్న తాను సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నానని నారాయణ తెలిపారు. పీవీ నరసింహారావు భారత దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ప్రధానిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా కృష్ణార్జునులవలె పాలన సాగించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం దేశంలో దుర్యోధన, దుశ్శాసన పాలన సాగుతోందని మండిపడ్డారు. పీవీ నరసింహారావు హయాంలో రాజకీయంగా మాకు విభేదాలు ఉన్నప్పటికీ నాడు ప్రపంచవ్యాప్తంగా ప్రపంచీకరణ సరళీకరణ ఆర్థిక విధానాలు, సంస్కరణలో అమలు చేయటాన్ని మేము కమ్యూనిస్టులుగా తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. కానీ రాను రాను అదే ఇంప్లిమెంట్ అయిందన్నారు. సంస్కరణల్లో ఏది ప్రయోజనకరంగా ఉందో, ఏది లేదో తాము సూక్ష్మంగా పరిశీలించి ఉంటే బాగుండేదన్నారు. ప్రస్తుతం దేశంలో దుర్యోధన, దుశ్శాసన పరిపాలన సాగుతున్న క్రమంలో .. నాడు పీవీ నరసింహారావు ఉన్నత వ్యక్తిత్వానికి, దేశ ఆర్థిక భద్రతకు, నిబద్ధతకు ప్రతీకగా నిలిచారని నారాయణ కొనియాడారు. పీజీ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని నారాయణ తెలిపారు. ఆనాటి నిర్ణయాలని సమీక్షించుకోవాలి. ఈనాటి పరిస్థితులను గమనించుకోవాలి. కేంద్రంలో దుర్యోధన, దుశ్శాసన పాలనపై పోరాటం సాగించాల్సిన అవసరం మనందరిపైన ఉందనేది గుర్తెరగాలని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలి

### నేడు లోక్‌భవన్ ముట్టడి చేపట్టనున్న ఎస్ఎఫ్ఐ

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇదే అంశంపై నేడు(సోమవారం) ఛలో లోక్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని ఈ నేపథ్యంలో ఈ పరీక్షను నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌ను రద్దు చేసి రాష్ట్రాలే పరీక్షలను నిర్వహించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## 2023 బ్యాచ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 2023 బ్యాచ్ అధ్యా పక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ జూని యర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరింప చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాసినట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వస్కుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 2023 బ్యాచ్ అధ్యాపకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేఖలో కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలు చేస్తున్న విద్యార్థులకు అల్పా హారం, మధ్యాహ్నం భోజన పథకాన్ని స్వాగతిస్తున్నామని, ప్రభుత్వా నికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. 2023 బ్యాచ్ అధ్యా పకులకు సంబంధించిన సమస్యలు పరిష్కారంలో హైకోర్టు సాను కూలమైన తీర్పు ఇచ్చినప్పటికీ, కొంతమంది అధికారులు ఇబ్బంది పెడుతున్నారన్నారు.



# రేవంత్ ముందే.. తెలంగాణ సిఎం చిరంజీవి అంటూ..

## రగ్బీ ఇండియా ప్రీమియర్ లీగ్ కార్యక్రమంలో పొరబడిన రాహుల్‌బోస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 28:** హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో రగ్బీ ప్రీమియర్ లీగ్ ఫైనల్స్ జరిగాయి. దీనికి ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెగాస్టార్ చిరంజీవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎస్‌ఆర్‌జి చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు హాజరయ్యారు. హైదరాబాద్ హీరోస్ వర్సెస్ ముంబై డ్రీమర్స్ ఫైనల్ మ్యాచ్‌ను ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వీక్షించారు. ఫైనల్స్‌లో 41-17 తేడాతో విజయం సాధించిన హైదరాబాద్ హీరోస్ టీమ్‌కు ట్రోఫిని సీఎం ప్రదానం చేశారు. ఈనెల 16న మొదలైన ఈ లీగ్ ఆదివారంతో ముగిసింది. కాగా, రగ్బీ ప్రీమియర్ లీగ్ ప్రజెంటేషన్ సెరమనీలో నటుడు, రగ్బీ ఇండియా ప్రెసిడెంట్ రాహుల్ బోస్ పొరబడ్డారు. చీఫ్ మినిస్టర్ చిరంజీవి అని ప్రసంగించారు. ఫైనల్ మ్యాచ్‌కు సిఎం రేవంత్‌తో పాటు చిరంజీవి కూడా గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కన్ఫ్యూజ్ అయినట్లు తెలుస్తోంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# సంగారెడ్డిలో 800 ఎకరాల్లో కీలక ఖనిజ నిల్వలు

## తుది దశకు టెండరింగ్ ప్రక్రియ

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త :** రాష్ట్రం కీలక ఖనిజాలకు గనిగా మారుతోంది. తాజాగా సంగారెడ్డి జిల్లా గోవిందాపూర్, పర్వతాపూర్‌లలో దాదాపు 800 ఎకరాల్లో గణనీయమైన కీలక ఖనిజ నిల్వలు ఉన్నాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నిర్ధారించిన నేపథ్యంలో ఈ ప్రాంతానికి ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా మొగుడంపల్లి మండలం గోవిందపూర్, పర్వతపూర్ గ్రామాలలో ఇనుము, టైటానియం లాటరైట్, కీలక ఖనిజాలు మరియు అల్యూమినియం లాటరైట్‌ల నిక్షేపాలను జీఎస్ఐ ధృవీకరించింది. ఈ సర్వేలో 15.25 మిలియన్ టన్నుల వెనేడియం, 87 మిలియన్ టన్నుల అల్యూమినియం లాటరైట్ మరియు టైటానియం నిల్వలను గుర్తించారు. ప్రపంచంలోనే అత్యంత అరుదైన కీలక ఖనిజాలలో ఒకటైన వెనేడియంను ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, అణు విద్యుత్ మరియు రక్షణ పరికరాలలో ఉపయోగిస్తారని అధికారులు తెలిపారు. ఈ కీలక ఖనిజ నిల్వలకు సంబంధించి ఆన్‌లైన్ టెండరింగ్ ప్రక్రియ ఇప్పటికే తుది దశకు చేరుకోవడంతో, జహీరాబాద్ మరో పారిశ్రామిక ముందడుగు వేయబోతోంది. జహీరాబాద్ నియోజకవర్గంలోని బర్దిపూర్, కోటూర్, సత్వార్, బుచినెల్లి, నైమతాబాద్‌లలో కూడా అన్వేషణ కొనసాగుతోందని, ఈ ప్రాంతంలోని ఖనిజ సంపద ఆ రెండు గ్రామాలకు మించి విస్తరించి ఉందని సూచిస్తోందని మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి విజయ్ కుమార్ తెలిపారు. కాగా జాతీయ ఉత్పాదక మరియు పెట్టుబడి జోన్ వేగం పుంజుకుంటున్న తరుణంలో, ఈ ఆవిష్కరణ ఈ ప్రాంత భూగర్భంలో మరో ఆశాజనకమైన సంపదను చేర్చింది. సుమారు ఏడాది క్రితం జిల్లా గనుల శాఖ అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ సర్వే జరిగిందని అధికారులు తెలిపారు. నిక్షేపాలు నిర్ధారణ కావడంతో, కేంద్ర ప్రభుత్వం వాటి కేటాయింపు కోసం ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించింది. ఈ సందర్భంగా పర్వతాపూర్‌ను బ్లాక్ 1గా, గోవిందపూర్‌ను బ్లాక్ 2గా పేర్కొంది. ఈ మైనింగ్ జహీరాబాద్‌ను ఒక ప్రధాన వాణిజ్య కేంద్రంగా మార్చగలదని అధికారులు భావిస్తున్నారు.



ఆదివారం భైంసాలో లబ్ధిదారులకు గృహ పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

# సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అనే ద్వి సూత్రంతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆదివారం భైంసా పట్టణంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి.. రూ.30.32 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు నిరుపేదల కోసం నిర్మించిన 440 డబుల్ బెడ్‌రూం గృహాలను అధికారికంగా ప్రారంభించారు. పట్టణంలో సామూహికంగా నిర్మించిన 440 డబుల్ బెడ్‌రూం గృహాల సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి, అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు, గృహ పట్టాలను పంపిణీ చేశారు. ఎన్నో ఏళ్ల సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత అమృత్ పథకం కింద రూ.28.18 కోట్లతో చేపట్టనున్న తాగునీటి సరఫరా వ్యవస్థ ఆధునికీకరణ, కొత్త పైప్‌లైన్ల నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అలాగే రూ.2.14 కోట్లతో చేపట్టనున్న మహదేవ్‌పూర్ చెరువు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులతో భైంసా పట్టణ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు భూగర్భ జలాల మట్టాలు పెరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన బహిరంగ సభ, గృహ పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. భైంసా పట్టణ సమగ్ర అభివృద్ధికి నిధుల కొరత లేదని, త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

# గాంధీభవన్‌లో 'ప్రజలతో ముఖాముఖి' కమిటీ నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 28:** గాంధీభవన్‌లో ప్రతి బుధవారం మంత్రులు, ప్రజాప్రతినిధులతోనిర్వహించే ప్రజలతో ముఖాము కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీపీసీసీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇంచార్జిగా పార్టీ సీనియర్ నేత సంగిశెట్టి జగదీశ్వర్ రావు, కన్వీనర్ గా మద్దుల గాల్ రెడ్డిని నియమిస్తూ మహేశ్ కుమార్ గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా హైమావతి, మద్దెల సంతోష్ ముదిరాజ్, వంశీకృష్ణ పెండ్యాల నియమితులయ్యారు. మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకోవడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. అంతేకాకుండా, ప్రజలు ఇచ్చే అర్జీలపై సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తూ, సమస్యల పరిష్కారానికి తుది చర్యలు తీసుకునేలా ఈ కమిటీ పనిచేస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

# ప్రతి బూత్‌లో కమలం వికసించేలా పనిచేద్దాం

## కాంగ్రెస్ హామీలు ఇస్తుంది, కానీ నెరవేర్చదు

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి ప్రతీకగా మారింది

### బూత్ అధ్యక్షుల సమావేశంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** తెలంగాణ ప్రజల కల ఇంకా పూర్తికాలేదు. ప్రజలు ఆశించిన మార్పు ఇంకా రాలేదని, అవినీతి, కుటుంబ పాలన చేస్తున్న రాజకీయ పార్టీలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. ఆదివారం సాయంత్రం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి బూత్‌లో కమలం వికసించేలా పనిచేద్దాం. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ విజయాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ నిరంతరం ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉందని, 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అరాచక పాలన నుంచి బయటపడింది. ఇప్పుడు అదే మార్పు తెలంగాణలో కూడా రావాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రస్తుతం సంఖ్యాపరంగా మనం వెనుకబడి కనిపించవచ్చు.

కానీ బీజేపీ కార్యకర్తల కష్టం, శ్రమ, త్యాగంపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. తెలంగాణలో జాతీయవాద ఆలోచనలతో కూడిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలు చేసిన త్యాగాలు ఎంతో గొప్పవి. ఆ పోరాటంలో బీజేపీ కార్యకర్తల పాత్ర కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల కలలను పూర్తిగా సాకారం చేయగలిగేది నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ మాత్రమేనని,గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిని మొదటి నుంచి చివరి వరకు ఎదిరించి పోరాడింది భారతీయ జనతా పార్టీయేనని చెప్పారు.

ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కానీ కాంగ్రెస్ తన పాత రాజకీయ సంస్కృతినే కొనసాగిస్తోందన్నారు. కాంగ్రెస్ కేవలం అధికారంలోకి రావడానికి మాత్రమే హామీలు ఇస్తుంది.. అమలు కోసం కాదని ఆరోపించారు. ఎన్నికల్లో గెలవాలంటే గెలుపు సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు.

మొదటి సంకల్పం - ప్రతి ఇంటికి వెళ్లాలి. ప్రతి కుటుంబం దగ్గరకు బీజేపీ కార్యకర్త చేరుకోవాలి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పార్టీ విధానాలను ప్రజలకు వివరించాలి. రెండో సంకల్పం - ప్రతి ఓటరును సంప్రదించాలి. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలి. మూడో సంకల్పం - కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులందరినీ కలవాలి. వారి సమస్యలను తెలుసుకోవాలి అని సూచించారు. సమాజంలోని ప్రతి వర్గంతో అనుబంధం పెంచుకోవాలి. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపు నిచ్చారు. త్వరలో జీహెచ్ఎంసీతో పాటు ఇతర స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. భాగ్యనగరాన్ని సరైన దిశలో నడిపించగలిగేది, ప్రజల ఆశలను నెరవేర్చగలిగేది భారతీయ జనతా పార్టీ మాత్రమేనని చెప్పారు. అభివృద్ధి రాజకీయాలా? లేక కుటుంబ రాజకీయాలు, అవినీతి రాజకీయాలా? అనే నిర్ణయం ఇప్పుడు ప్రజల చేతిలో ఉందన్నారు.

భాగ్యనగర భవిష్యత్తును మార్చాలంటే మనం ప్రజల మధ్యకు మరింత బలంగా వెళ్లాలి. ప్రతి యువకుడు, ప్రతి మహిళ, ప్రతి వ్యాపారి, ప్రతి లబ్ధిదారుని కలిసి వారి ఆశీర్వాదం కోరుదామని చెప్పారు. బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించిన తర్వాత కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కానీ కాంగ్రెస్ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్, ఈరోజు తెలంగాణ యువతను మోసం చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో కమలం గుర్తుతో పోటీ చేసే ప్రతి అభ్యర్థిని పూర్తి శక్తితో గెలిపించాలని చెప్పారు. తెలంగాణలో ఎన్నో సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అవినీతిలో మునిగిపోయాయన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి ప్రతీకగా మారిందని చెప్పారు. గత బీఆర్ఎస్ సర్కారు పేద ప్రజల కష్టార్జిత ధనాన్ని దోచుకునేందుకు కాళేశ్వరాన్ని ఏటీఎంలా వాడుకుందని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని, తెలంగాణ ప్రజలకు న్యాయం జరిగే వరకు, అవినీతికి పాల్పడిన దోషులను శిక్షించే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటం ఆపదన్నారు.




ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో ప్రసంగిస్తున్న బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్

# ఇక 'గ్రీన్ క్రికెట్'!

## ప్రతి డాట్ బాల్, ఫోర్, సిక్స్‌కు మొక్కలు నాటే ప్రతిపాదన

## ప్రతి మొక్కకు జిపిఎస్ జియోట్యాగింగ్, 1,000 రోజుల సంరక్షణ

## గ్రీన్ ఇండియా చాలెంజ్-హెచ్‌సిఎ భాగస్వామ్యానికి ప్రతిపాదన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్28:** తెలంగాణ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం మొదలు కాబోతోంది. ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లలో బీసీసీఐ అమలు చేసిన గ్రీన్ డాట్ బాల్ తరహాలో, రాష్ట్రంలో ఏకంగా గ్రీన్ క్రికెట్‌ను తీసుకురావాలని గ్రీన్ ఇండియా చాలెంజ్‌వ్యవస్థాపకులు, ఇగ్నైటింగ్ మైండ్స్ చైర్మెన్, మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రతిపాదన చేశారు. ఈ మేరకు అదివారం ఆయన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఎం. జీవన్ రెడ్డికి అధికారిక లేఖ రాశారు. ఈ ప్రతిపాదన ప్రకారం.. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ స్టేట్ ప్రీమియర్ లీగ్, తెలంగాణ గోల్డ్ కప్ లాంటి టోర్నీలలో కేవలం డాట్ బాల్స్‌కే పరిమితం కాకుండా.. నమోదయ్యే ప్రతి డాట్ బాల్, ఫోర్, సిక్సర్‌లకు మొక్కలు నాటుతారు. బౌలర్ వేసే ప్రతి డాట్ బాల్ క్రమశిక్షణకు ప్రతీకగా, బ్యాటర్ బాదే ప్రతి బౌండరీ ప్రకృతికి బహుమతిగా మారాలని సంతోష్ కుమార్ ఆకాంక్షించారు. ఇటీవల లండన్‌లో జరిగిన క్లైమేట్ యాక్షన్ వీక్ లో 'ప్లేయింగ్ ఫర్ ది ప్లానెట్' అనే కాన్సెప్ట్‌కు ప్రపంచవ్యాప్తంగా పార్లమెంటేరియన్ల నుంచి వచ్చిన విశేష స్పందనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.బీసీసీఐ, టాటా గ్రూప్ సంయుక్తంగా ప్రారంభించిన గ్రీన్ డాట్ బాల్ కార్యక్రమంలో భాగంగా ఐపీఎల్‌లో ప్రతీ డాట్ బాల్‌కు మొక్కలను నాటుతున్నారు. ఈ ఉద్యమంలో భాగంగా ఇప్పటి వరకు 6.4 లక్షల మొక్కలు నాటారు. కేవలం మొక్కలు నాటడమే కాదు, వాటికి జియో ట్యాగింగ్ చేసి, కచ్చితమైన జీపీఎస్ కోఆర్డినేట్స్‌తో ఎవరైనా ట్రాక్ చేసేలా ఈ ప్రాజెక్ట్‌ను డిజైన్ చేశారు. పైగా, నాటిన ప్రతి మొక్కను 1,000 రోజుల పాటు కంటికి రెప్పలా కాపాడే బాధ్యతను కూడా తీసుకుంటారు. అఫీషియల్ స్కోర్‌కార్డ్ ఆధారంగా మొక్కల సంఖ్యను పారదర్శకంగా లెక్కించనున్నారు. ఈ లెక్కన ఒక టీ20 మ్యాచ్ జరిగితే కనీసం వందలకొద్దీ వెరిఫైడ్ మొక్కలు నాటే అవకాశం ఉంది. ఈ చొరవతో తెలంగాణలోని 33 జిల్లాల్లో ఏటా లక్షకు పైగా మొక్కలు నాటి, పచ్చదనాన్ని మరింత పెంచవచ్చని అంచనా వేస్తు న్నారు. ప్రపంచంలోనే క్రికెట్‌ను పర్యావరణంతో అనుసంధానం చేస్తూ ఇలాంటి జియోట్యాగ్డ్ క్లైమేట్ యాక్షన్ చేపట్టడం ఇదే తొలిసారి అవుతుందని లేఖలో వివరించారు. ఈ భాగస్వామ్యం కోసం త్వరలోనే ఒక అధికారిక అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలని హెచ్‌సీఏ పాలక మండలిని సంతోష్ కుమార్ కోరారు. ఈ గ్రీన్ క్రికెట్ ప్రాజెక్ట్ గనుక కార్యరూపం దాల్చితే, రాష్ట్ర యువ క్రికెటర్లు కేవలం క్రీడాకారులుగానే కాకుండా, పర్యావరణ రక్షకులుగా కూడా ప్రపంచ వేదికపై గుర్తింపు తెచ్చుకుంటారు.

# మోసపోతే గోసపడతామని నాడే చెప్పాం

## జిల్లాకు సిఎం, స్పీకర్‌తో ఒరిగిందేమీ లేదు: కెటిఆర్

**వికారాబాద్, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో వికారాబాద్ కు వచ్చినప్పుడు ఓటరు మహాశయులను అభ్యర్థించడం జరిగింది . మోసపోతే గోస తప్పదని నాడు హెచ్చరించాను. మార్పు కావాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ను గద్దెనెక్కించారని నేడు గోస పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గౌలీకార్ ఫంక్షన్ హాల్ లో సర్, బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లాకు చెందినవారు సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లు ఉన్నారని, అత్యున్నత పదవుల్లో ఉండి కూడా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరచడంలో విఫలమయ్యారని దుయ్యపట్టారు. పాలమూరురంగారెడ్డి తో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేద్దామని సంకల్పంతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నాడు కెసిఆర్ ప్రారంభిస్తే కోర్టుల్లో కేసులు వేసి కాంగ్రెస్ వారు అడ్డుకున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకొని ప్రభుత్వంలో కొనసాగుతుంటే కళ్ళు కనిపించని దృతరాష్ట్రుడిలా వ్యవహరించి క్లీన్ చీట్లు ఇచ్చారని వ్యాఖ్యానించారు. 7 లక్షల కోట్లు అప్పు చేశారంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2.80 లక్షల కోట్లు అప్పు ఉందని పార్లమెంట్ సాక్షి గా నివేదికలు కాగ్ వెల్లడించిందని, ప్రస్తుత స్పీకర్ ప్రసాద్ కుమార్, సీఎం రేవంత్ రెడ్డిలు మాత్రం 7 లక్షల కోట్లు, లక్షల కోట్లు అంటూ కేసిఆర్ పై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబాట్టారు. పరిపాలన చేతకాక పచ్చి అబద్దాలు ఆడుతున్నారని, రైతుబంధు రైతు రుణమాఫీ చేయలేని అసమర్ధ సీఎం రేవంత్ రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని ఆయన మండిపడ్డారు. నాడు ప్రభుత్వ మెడికల్ కళాశాల లు లేక జిల్లా వాసులు ఇబ్బందులు పడుతుంటే, రంగారెడ్డి, వికారాబాద్ తో పాటు 33 జిల్లాల్లో జిల్లాకు ఒక్కో మెడికల్ కళాశాల ఇచ్చిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందని అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలు అని కాంగ్రెస్ వారు హామీలు ఇచ్చారు. మూడు నెలల్లో పిల్లలు పుట్టడం సాధ్యమేనా.. అలా అని చెప్పి 30 నెలలు గడిచిన పిల్లలు కాకపోతే ఏమంటారు.. ఆ మాట నా నోట అనని చమత్కరించారు. పరిపాలన చేతకాకి కెసిఆర్ ప్రభుత్వం పై విమర్శలు, అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కెసిఆర్ ప్రభుత్వంలో దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగింది. దానికి 12 లక్షల చెట్లు తొలగిస్తామనడంతో కేసీఆర్ ఒప్పుకోలేదని, దీంతో నేవీ రాడార్ పనులు అప్పుడు నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి హయాంలో నేవీ రాడార్ అనుమతులు ఇట్టే వచ్చాయని, అనంతగిరి లాంటి అహ్లాదకరమైన వాతావరణం, దామగుండం అడవిలో కూడా ఉంది. అలాంటి అటవీ ప్రాంతాన్ని విఛ్చిన్నం చేయడం ఈ ప్రాంత ప్రజలకు మంచిది కాదని ఆయన మండిపడ్డారు. మూసి ప్రక్షాళన చేస్తానని కంకణం కట్టుకున్న సీఎం, మూసి పుట్టిన వికారాబాద్ ప్రాంతంలో 12 లక్షల చెట్లు ఎలా నరికి వేయిస్తాడని విమర్శించారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కెటిఆర్

# బిజెపి చీఫ్ నితిన్‌నబీన్ పర్యటన ఒక ఫ్లాప్‌షో

## తెలంగాణ గడ్డపై బెంగాల్ తరహా రాజకీయాలు చెల్లవు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 28:** బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ పర్యటన ఒక ఫ్లాప్ షో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అని వ్యాఖ్యానించారు. బిజెపి సమావేశం ఫ్లాప్ షోగా మారిందని, తెలంగాణ బీజేపీ నాయకులు ఒక చిన్న సమావేశాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు.,రాబోయే గ్రేటర్ హైదరాబాద్ (జిహెచ్ఎంసి) ఎన్నికల్లో వీరు సాధించేది ఏముంది? బూత్‌లు గెలుస్తాం, కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుస్తాం అని ప్రగల్భాలు పలికే ముందు గ్రౌండ్ రియాలిటీ చూసుకోవాలి అన్నారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మీ విభజన రాజకీయాలను తిరస్కరించారని చెప్పారు. జీహెచ్ఎంసీ గురించి మాట్లాడే ముందు, హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం నుండి ఉన్న అన్ని అడ్డంకులను తొలగించి, ఆ తర్వాత వేరే విషయాల గురించి మాట్లాడండి అని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై విచారణకు నితిన్ నబిన్ సిద్ధమా? లక్ష కోట్ల కాళేశ్వరం అవినీతిపై సీబీఐ ఎందుకు చర్యలు తీసుకోవట్లేదో సమాధానం చెప్పాలని అన్నారు.

# 'సర్'పై మజ్లిస్, కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు ఎందుకు భయం?

## ప్రక్రియలో పాల్గొంటున్నది తెలంగాణ ఉద్యోగులే

### వాళ్ల పేర్లు ఓటరు లిస్ట్‌లో ఉండకూడదు: కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 28:** బిజెపి అధికారంలోకి వచ్చాక బెంగాల్,అస్సాంలో చొరబడిన బంగ్లాదేశ్ అక్రమ వలసదారులను తిరిగి పంపిచామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. మజ్లీస్ పార్టీ కబంధ హస్తాల నుంచి హైదరాబాద్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. భారతీయుడు కాని ఏ ఒక్కరి పేరు కూడా ఓటర్ లిస్ట్‌లో ఉండకూడదన్నారు. ప్రతి బిజెపి కార్యకర్త బిఎల్ఓతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్ లిస్ట్‌ను సరిచూడాలని చెప్పారు. సర్‌పై కాంగ్రెస్,బిఆర్ఎస్,మజ్లీస్ ఎందుకు భయపడుతున్నాయని ప్రశ్నించారు. సర్ ప్రక్రియలో పాల్గొంటుంది తెలంగాణ ఉద్యోగులే కదా మీ ఉద్యోగులపై నమ్మకం లేదా అని ప్రశ్నించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి ప్రాంతాలను సీఎం రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ అడ్డాలుగా మార్చేశారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ పాలనలో ఒక రోజు వాన పడితేనే హైదరాబాద్ సగం మునిగిపోయే పరిస్థితి ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో చిన్న వాన పడినా రోడ్లు జలమయం అవుతున్నాయి. వాహనాలు వరదల్లో చిక్కుకుంటున్నాయి. కరెంట్ షాక్‌లతో ప్రాణాలు కోల్పోతున్నారు. నగరం మొత్తం నదీ ప్రవాహంలా మారిపోతోందన్నారు. హైదరాబాద్‌ను బాగుచేయాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదు. కేవలం నగర భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చి తమ ఖజానాలు నింపుకోవడమే లక్ష్యంగా కనిపిస్తోందన్నారు.

# సుప్రీం కొలీజియంలో హైదరాబాద్ సీనియర్ న్యాయమూర్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 28:** సుప్రీంకోర్టు కొలీజియంలో న్యాయమూర్తి పిఎస్ నరసింహ సభ్యులు కానున్నారు. ఆదివారం జస్టిస్ జెకె మహేశ్వరి రిటైర్మెంట్‌తో కొలీజియంలో సభ్యులుగా సుప్రీంకోర్టులో ఐదవ సీనియర్ న్యాయమూర్తి నరసింహకు అవకాశం దక్కింది. ఈ బాధ్యతల్లో ఆయన 2028 మే 2వ తేదీ వరకూ ఉంటారని సుప్రీంకోర్టు అధికారిక కార్యాలయ వర్గాలు ఆదివారం తమ ప్రకటనలో తెలిపాయి. ఇప్పటి మార్పుల తరువాత కొలీజియంలో ఇకపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఎంఎం సుంద్రేష్‌తో పాటు జస్టిస్ పిఎస్ నరసింహ కూడా తాజాగా చేరుతారు. కొలీజియంలో సభ్యుడు అయ్యే న్యాయమూర్తి నరసింహ 1963 మే3న హైదరాబాద్‌లో జన్మించారు.

విద్యాభ్యాసం ఎక్కువగా హైదరాబాద్‌లోనే సాగింది, నిజాం కాలేజీ విద్యార్థి అయిన నరసింహ ఢిల్లీ యూనివర్శిటీలో 1988లో క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు.

# వరి స్థానంలో ప్రత్యామ్నాయం


## ఎకరాకు రూ.8 వేల అదనపు సాయం

## పంటల బీమా అమలు చేయాలి

## భిన్నమైన సవాళ్లను ఎదుర్కొంటోన్న వ్యవసాయం

## సర్కార్‌కు వ్యవసాయ్ణ వర్సిటీ నివేదిక

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సుస్థిర వ్యవసాయం, రైతుల ఆదాయ భద్రత కోసం సంస్కరణలు అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిఫార్సు చేసింది. వరి స్థానంలో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, ఇందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే రైతులకు ఎకరానికి రూ.4 నుంచి రూ.8 వేల వరకు నగదు బదిలీ చేయాలని సూచించింది. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యల నేపథ్యంలో అగ్రి వర్సిటీని నోడల్ ఏజన్సీగా ప్రకటిస్తూ నూతన విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వం గతంలో ఆదేశించింది. ఈ నేపథ్యంలో సుస్థిర వ్యవసాయ, అభివృద్ధి అధ్యయన కేంద్రం జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. బలమైన మార్కెటింగ్, ప్రభుత్వ నిధులతో పంటల బీమా, వాల్యూ ఎడిషన్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపొందించిన ఈ నివేదికపై జులై 2న మంత్రిమండలి చర్చించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర ఆవిర్భావ సమయంలో 57 లక్షల ఎకరాలుగా ఉన్న నికర సాగు విస్తీర్ణం 2024 నాటికి సుమారు 92 లక్షల ఎకరాలకు చేరుకోవడం గొప్ప ప్రగతి అయినప్పటికీ, ప్రస్తుతం ఈ రంగం భిన్నమైన సవాళ్లను ఎదుర్కొంటోందని నివేదిక స్పష్టం చేసింది. రైతులు ఒకే పంటపై అధికంగా ఆధారపడటంతో నీరు, భూమి, ప్రభుత్వ వనరులపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. పెరుగుతున్న మిగులు ధాన్యం నిల్వలు, వాటి నిర్వహణ వ్యయాలు, సహజ వనరుల సుస్థిర వినియోగం వంటివి ఇప్పుడు పెద్ద విధానపరమైన సవాళ్లుగా మారాయి. ఈ తరుణంలో నూతన విధానం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకాలని వర్సిటీ అభిప్రాయ పడింది. ఆదాయ వృద్ధి, ప్రైవేట్ పెట్టుబడులకు కొత్త అవకాశాలను సృష్టిస్తూ రైతుల జీవన ప్రమాణాలను పెంచడంపై దృష్టి పెట్టాలని సూచించింది. ఈ మార్పుల్లో భాగంగా రాబోయే ఐదేళ్లలో 25 లక్షల ఎకరాల వరి సాగు విస్తీర్ణాన్ని దశల వారీగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని లక్ష్యంగా నిర్దేశించారు. పంట మార్పిడికి స్వచ్ఛందంగా ముందుకొచ్చే రైతులకు ప్రోత్సాహకంగా ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.8 వేల వరకు నగదు బదిలీ చేయాలని ప్రతి పాదించారు. పత్తి, పెసర, వేరుసెనగ, పొద్దు తిరుగుడు, నువ్వుల పంట సాగుచేసే రైతులకు రైతు భరోసా పంట పెట్టుబడి సాయం కాకుండా ఎకరానికి రూ.8 వేల చొప్పున, జొన్నకు రూ.5 వేలు, అలాగే మొక్కజొన్న, కంది, మినుము, ఆముదం, సోయాబీన్, శనగ పంటలకు ఎకరానికి రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నివేదికలో పేర్కొన్నారు. రైతులకు కేవలం పంట మార్పిడి మాత్రమే కాకుండా.. ప్రత్యామ్నాయ పంటల కోసం స్థిరమైన, లాభదాయకమైన మార్కెట్ అవకాశాలను అందుబాటులోకి తేవడం అత్యంత అవసరమని వర్సిటీ స్పష్టం చేసింది. ముడి ఉత్పత్తుల విక్రయానికే పరిమితం కాకుండా వాల్యూ ఎడిషన్ ద్వారా అధిక లాభాలు పొందేలా పప్పుధాన్యాల మిల్లులు, చిరుధాన్యాలు, నూనె గింజల శుద్ధి కేంద్రాలు, అధునాతన నిల్వ, ప్యాకేజింగ్ మౌలిక సదుపాయాలు, బ్రాండింగ్ మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలి. ఈ ప్రక్రియలో మహిళా స్వయం సహాయక సంఘాలు, ప్రైవేటు సంస్థలకు పెద్దపీట వేయాలి. అలాగే, ప్రత్యామ్నాయ పంటలు వేసే రైతుల్లో నష్ట భయాన్ని పోగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి నిధులు సమకూర్చి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ద్వారా ప్రత్యేక పంటల బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని నివేదిక సిఫార్సు చేసింది.



ఆదివారం హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

# హిమాయత్‌సాగర్ గేటు ఎత్తివేత

## ఇన్‌ఫ్లో 60 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 339 క్యూసెక్కులు

**నార్సింగి, జూన్ 28 ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరం శివారుల్లో ఉన్న హిమాయత్ సాగర్ జలాశయం నిండుకుండగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి కొంత కొత్తనీరు రావడంతో ఈ జలాశయం నీటిమట్టం ప్రస్తుతం 1762,25 అడుగులకు చేరకుంది. పూర్తి మట్టం 1763.50.అడుగులు. మరో 1.25.అడుగుల నీరువస్తే పూర్తిస్థాయికి చేరుకుంటుంది. గత సంవత్సరం వర్షాకాలంలో జంట జలాశయాలగేట్లు ఎత్తడం వలన రాజధాని హైదరాబాద్ నగరంలోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్తలో భాగంగా ఆదివారం సాయంత్రం జలమండలి ఉన్నతాధికారుల ఆదేశాలతో 8వ నెంబర్ గేటును ఎత్తి ఈసీ వాగులోకి నీటిని వదిలిపెట్టారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గేటుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈసీ వాగులోకి 339 క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. ఇంత ఆగమేఘాల మీద ఎందుకు నీటిని వదులుతున్నారని స్థానికులు గుసగుసలాడారు. మరో జలాశయం గండిపేట పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా ప్రస్తుతం 1784.15 అడుగుల నీరుంది. మరో 6 ఫీట్ల కొత్త నీరు వస్తే ఈ జలాశయంగేట్లు ఎత్తుతారు. కృష్ణా, గోదావరి, మంజీర ప్రాజెక్టుల నీటిని నగర ప్రజలకు సరఫరాచేస్తుండడం వలన ఈ జంట జలాశయాల నీటిని ఎక్కువగా సరఫరా చేయడంలేదు. ఫలితంగా వేగంగా ఈ జలాశయాలు నిండిపోతున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేం దర్‌గౌడ్, చైర్మన్లు మల్లేష్, వేణుగౌడ్, మాజీ సర్పంచ్ హరికృష్ణ, అంతారం నరేష్, దొబ్బ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం బాగ్ లింగంపల్లిలో నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సదస్సు లో పాల్గొన్న పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్, జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ , పూర్వ డీజీపీ, ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త జె.పూర్ణచందర్ రావు తదితరులు

# అన్ని కులాల పాలన రావాలి

## పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్, జెఎసి చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 28 ప్రభాతవార్త :** తెలంగాణలో కొన్ని కులాల పాలన పోయి, అన్ని కులాలకూ ప్రాతినిధ్యం ఉన్న పాలన రావాలని, అది బీసీ, ఎస్సీ,ఎస్టీ జేఏసీ ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం ముమ్మాటికీ సాధ్యమవుతుందని పూర్వ న్యాయమూర్తి, బీసీ జాతీయ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్ అన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొన్ని కులాల పాలనకు బదులుగా అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించే పాలన రావాల్సిన అవసరం ఉందని ఈశ్వరయ్య గౌడ్ పేర్కొన్నారు. పూర్వ డీజీపీ, ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త జె.పూర్ణచందర్ రావు మాట్లాడుతూ భారతదేశంలో ప్రాంతాలు, మతాలు, భాషల కంటే కుల ఆధిపత్యమే రాజకీయ అధికారాన్ని నిర్ణయిస్తున్న ప్రధాన అంశమని, ఈ వాస్తవాన్ని బహుజన సమాజానికి విస్తృతంగా వివరించి రాజకీయ చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ అగ్రకుల భూస్వామ్య పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు నిరంతరం బలిపశువుల వుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుల ఆశయాలు, ఆలోచనల రథాన్ని తెలంగాణలో ముందుకు నడిపించేందుకే ఈ జేఏసీ ఆవిర్భవించిందన్నారు. సమ్మక్కసారలమ్మ, సర్వాయి పాపన్న గౌడ్, పండగ సాయన్న, కొండా లక్ష్మణ్ బాపూజీల ఆత్మ గౌరవ జెండాని, బహుజన రాజ్యాధికార అజెండాని పునర్నిర్మించడమే జేఏసీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సదస్సులో పలువురు బహుజన సంఘాల నాయకులు, సదస్సులో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, బిసి ఎస్సి, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్ర ముదిరాజ్, ప్రొఫెసర్ నాగం కుమారస్వామి, ప్రొఫెసర్ రామయ్య యాదవ్, రాము యాదవ్, అహ్మద్ పాషా, పూసల సాయిబాబా, హై కోర్ట్ న్యాయవాదిరఘునాథ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమైన రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్ణయ్య

# కొత్తగా 120హాస్టళ్లు, 150 గురుకులాలు మంజూరు చేయాలి

## బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 28 ప్రభాతవార్త :** రాష్ట్రంలో విపరీతమైన డిమాండ్ ఉన్నందున కొత్తగా 120 బీసీ కాలేజీ హాస్టళ్లను, మరో 150 బీసీ గురుకుల పాఠశాలలను తక్షణమే మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాంపల్లిలోని బీసీ సంక్షేమ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ నాయకుల బృందం సమావేశమై పలు విజ్ఞప్తులతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీ జనాభా 52 శాతానికి పైగా ఉన్నప్పటికీ దానికి తగినట్లుగా గురుకులాలు, హాస్టళ్ల వసతి లేదన్నారు. హాస్టల్ సీట్లు దొరకక వేలాది మంది గ్రామీణ విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్ల ఫీజులు భరించలేక చదువులు మానేసే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి హైదరాబాద్ జిల్లాలో 20, మహబూబ్‌నగర్‌లో 12, వరంగల్‌లో 12, నల్గొండలో 12, కరీం నగర్‌లో 12, రంగారెడ్డిలో 12, సంగారెడ్డిలో 10, వికారాబాద్‌లో 10, మేడ్చల్‌లో 10, ఖమ్మం జిల్లాలో 10 చొప్పున బాలబాలికల హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణంగా 5, 6, 7, 8 తరగతుల్లో అదనపు సెక్షన్లను ప్రారం భించాలని సూచించారు. అలాగే, సాధారణ జూనియర్ కాలేజీల్లో క్లాసుకు 40 మంది చొప్పున సీట్లు కేటాయిస్తుంటే, బీసీ గురుకులాల్లో మాత్రం కేవలం 30 సీట్లే ఇస్తున్నారని, దీన్ని 40కి పెంచాలని కోరారు. సాధారణ కాలేజీల్లో ఒక్కో గ్రూపునకు 160 సీట్లు ఉంటే, బీసీ గురుకుల కాలేజీలకు 80 సీట్లే కేటాయించడం అన్యాయమన్నారు. ఈ ఏడాది గురుకులాల్లో 10వ తరగతి, ఇంటర్ ఫలితాలు 99 శాతం రావడంతో సీట్లకు డిమాండ్ భారీగా పెరిగిందని, లక్షలాది మంది దరఖాస్తు చేసుకుంటున్నా వేల మందికి మాత్రమే సీట్లు వస్తున్నాయని పేర్కొన్నారు.

**ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటా : మంత్రి పొన్నం:** బీసీ నాయకుల విజ్ఞప్తులపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి కొత్త హాస్టళ్ల మంజూరుతో పాటు గురుకులాల్లో అదనపు సెక్షన్లు, సీట్ల పెంపునకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# భూగర్భ జలాలకు కాలుష్యం ముప్పు



## దేశంలో తెలంగాణ మూడో స్థానం

## సురక్షిత తాగునీరు సరఫరాలో విఫలం

### 28 జిల్లాల్లో ఫ్లోరైడ్, 32 జిల్లాల్లో నైట్రేట్

### రసాయనం, ఎరువులు, వ్యవసాయ వ్యర్థాలతో ముప్పు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా భూగర్భ జలమట్టాల్లో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ, పలు జిల్లాల్లో సురక్షితమైన తాగునీటిని అందించడంలో విఫలమైంది. అధిక వర్షపాతం, బలమైన రీఛార్జ్ కారణంగా పర్యవేక్షించిన 98శాతం బావులలో భూగర్భ జలాల పరిస్థితి మెరుగుపడినప్పటికీ, పలు జిల్లాల్లో ఫ్లోరైడ్, నైట్రేట్ కాలుష్యం ఇంకా కొనసాగుతున్నట్లు భూగర్భజలశాఖ తాజా అంచనాలో వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం మంచిర్యాల జిల్లాలో ఫ్లోరైడ్ స్థాయిలు గరిష్టంగా లీటరుకు 13.9మిల్లీగ్రాములుగా, నిజామాబాద్‌లో 697 మిల్లీ గ్రాములు, కామారెడ్డి జిల్లాలో లీటరు నీటికి 683 మిల్లీ గ్రాములుగా నమోదయ్యాయి. ప్రపంచ రోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం, త్రాగునీటిలో ఫ్లోరైడ్ అనుమతించదగిన పరిమితి లీటరు నీటిలో 1.5 మిల్లీ గ్రాములు, నైట్రేట్ 50 మిల్లీ గ్రాములుగా ఉండాలి. జలశక్తి మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం, తెలంగాణలోని 28 జిల్లాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉండగా, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 32 జిల్లాల్లో నైట్రేట్ సురక్షిత పరిమితులను మించిపోయింది. దీంతో నైట్రేట్ కాలుష్యం విషయంలో తెలంగాణ దేశంలో మూడవ అత్యంత అధ్వాన్నమైన రాష్ట్రంగా నిలిచింది. రుతుపవనాలకు ముందు, తరువాత కాలంలో సేకరించిన 2,200కు పైగా భూగర్భ జల నమూనాల ఆధారంగా జరిపిన అంచనాలో, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఫ్లోరైడ్, నైట్రేట్, లవణీయత వల్ల కాలుష్యం ఉన్నట్లు తేలింది. ప్రధానంగా ఫ్లోరైడ్ కాలుష్యం తెలంగాణ యొక్క అత్యంత ముఖ్యమైన భూగర్భజల నాణ్యత ఆందోళనలలో ఒకటిగా ఉంది. ప్రభావిత జిల్లాల్లో నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హన్మకొండ, జనగాం, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, మహబూబ్ నగర్‌లోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. వర్షాకాలం ముందు కాలంలో ఆసిఫాబాద్ జిల్లాలో లీటరుకు 0.01 మిల్లీ గ్రాముల నుండి మంచిర్యాలలో 13.9 మిల్లీ గ్రాముల వరకు ఫ్లోరైడ్ సాంద్రతలు ఉన్నాయి. ఇక నైట్రేట్ కాలుష్యం మరింత విస్తృతంగా ఉంది, దాదాపు ప్రతి జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో దీని స్థాయిలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. రసాయన ఎరువుల మితిమీరిన వాడకం, వ్యవసాయ వ్యర్థాలు, మురుగునీటి లీకేజీ మరియు మురుగునీటి చొరబాటు వంటి మానవ కార్యకలాపాలే దీనికి ప్రధాన కారణాలని నిపుణులు పేర్కొంటున్నారు.

ఫ్లోరైడ్ కాలుష్యా నికి ప్రధానంగా తెలంగాణ భూగర్భ నిర్మాణమే కారణమని నివేదిక పేర్కొంది. రాష్ట్రంలో దాదాపు 81 భూభాగం గ్రానైట్లు, గ్నైస్‌లు, స్కిస్ట్‌లు, క్వార్ట్‌జైట్‌లు, దక్కన్ బసాల్ట్‌లతో సహా గట్టి శిలా నిర్మాణాలతో నిండి ఉంది. ఈ నిర్మా ణాలలో నిల్వ ఉన్న భూగర్భ జలాలు ఫ్లోరైడ్ కలిగిన ఖనిజాలతో దీర్ఘకాలం పాటు సంపర్కం లో ఉండటం వల్ల, కాలక్రమేణా ఫ్లోరైడ్ భూగర్భ జల పొరలలోకి కరిగిపోతుంది. కేవలం భూగర్భ జలాల లభ్యతను మెరుగుపరచడం మాత్రమే సురక్షితమైన తాగునీటికి హామీ ఇవ్వలేదని పర్యావరణ నిపుణులు హెచ్చరించారు. నిరంతర భూగర్భ జల నాణ్యత పర్యవేక్షణ, మెరుగైన ఎరువుల నిర్వహణ, రీఛార్జ్ జోన్‌ల పరిరక్షణ, ఫ్లోరైడ్, నైట్రేట్ ప్రభావిత ప్రాంతాలలో లక్షిత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు కల్పనా రమేష్ అన్నారు.

# రేపు ఇఎపిసెట్ ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు ఈనెల 30న విడుదల కానున్నాయి. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటన మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల చేయనున్నారు.మే 12 నుంచి 20 వరకు ఆన్ లైన్ విధానంలో రేపు ఈఏపీసెట్ నిర్వహించారు.ఈ ఏడాది ఈఏపీసెట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3.29లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఎంపీసీ స్ట్రీమ్‌లో 2.5 లక్షల మంది విద్యార్థులు, బైపీసీలో 70,929 మంది పరీక్షరాశారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రిలిమినరీ కీ మే 25న విడుదల చేశారు. ఇక షెడ్యూల్ ప్రకారం ఫలితాలు జూన్ 1న ఫలితాలు విడుదల కావాల్సి ఉంది. అయితే ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు రాసిన ఇంప్రూవ్‌మెంట్, సీబీఎస్ఈ రివ్యాల్యుయేషన్ ఫలితాల కారణంగా ఫలితాల విడుదల రెండు సార్లు వాయిదా పడింది. ఈ రెండు అడ్డంకులు తొలగిపోవడంతో ఈఏపీసెట్ ఫలితాల విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 వెయిటేజీ ఉంటుంది. ర్యాంకులు కేటాయించాలంటే ఇంటర్మీడియట్ మార్కులూ తప్పనిసరి. ఈ కారణంగానే విద్యార్థులు నష్టపోకూడదని ఇంప్రూవ్‌మెంట్ ఫలితాలు వచ్చేంత వరకు ఈఏపీసెట్ ఫలితాలను వాయిదా వేసింది. ఎట్టకేలకు ఫలితాలు వెలువడనుండటంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మా కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు.

# రికార్డు స్థాయి ఎండలతో ఐరోపా ఉక్కిరి బిక్కిరి

## ఫ్రాన్స్‌లో వారంలోనే అదనంగా వెయ్యి మంది మృతి



**ప్యారిస్,జూన్ 28:** యూరప్‌ను రికార్డు స్థాయి వడగాడ్పులు తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తున్నాయి. ఫ్రాన్స్‌లో గత వారం నమోదైన తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా అదనంగా సుమారు వెయ్యి మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ప్రజారోగ్య సంస్థ వెల్లడించింది. మరోవైపు, ప్రపంచ ఆరోగ్య సంస్థ యూరప్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వేడెక్కుతున్న ఖండంగా మారిందని హెచ్చరిస్తూ, ప్రజల రక్షణ కోసం ప్రభుత్వాలు అత్యవసర చర్యలు చేపట్టాలని సూచించింది. వారాంతంలో యూరప్‌లోని పలు దేశాల్లో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జర్మనీలో అడవి మంటలు చెలరేగగా, రాజధాని బెర్లిన్‌లో ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు పోలీసులు వాటర్ కానన్లతో చల్లని నీటిని పిచికారీ చేశారు. ప్రస్తుతం ఈ హీట్‌వేవ్ తూర్పు యూరప్ వైపు కదులుతోంది. జర్మనీలో పోలాండ్ సరిహద్దుకు సమీపంలోని నైసెముండే ప్రాంతంలో వరుసగా మూడో రోజు కొత్త ఉష్ణోగ్రత రికార్డు నమోదైంది. అక్కడ గరిష్ఠంగా 41.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. చెక్ రిపబ్లిక్‌లోనూ చరిత్రలోనే అత్యధికంగా 41.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. యూరప్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ విడుదల చేసిన తాజా అధ్యయనం ప్రకారం, గత వారం నమోదైన ఈ తీవ్ర ఉష్ణోగ్రతలు, అధిక తేమ పరిస్థితులు వాతావరణ మార్పులు లేకుండా సంభవించే అవకాశం లేదని స్పష్టం చేసింది. ఐదు దశాబ్దాల క్రితం ఇటువంటి పరిస్థితులు దాదాపు లేవని, ప్రస్తుతం ఇవి 20 ఏళ్ల క్రితంతో పోలిస్తే 200 రెట్లు ఎక్కువగా సంభవించే అవకాశముందని అధ్యయనం వెల్లడించింది.

**ఫ్రాన్స్‌లో ఒక్కసారిగా పెరిగిన మరణాలు**

ఫ్రాన్స్‌లో హీట్‌వేవ్ తీవ్రత అత్యధికంగా ఉన్న రోజుల్లో మరణాల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ముఖ్యంగా పారిస్ ప్రాంతంలో ఇళ్లలోనే మరణించిన వారి సంఖ్య గణనీయంగా అధికమైంది. బుధవారం ఒక్కరోజే 1,200 మందికిపైగా మరణించగా, ఆ తర్వాతి రెండు రోజుల్లో రోజుకు 1,400 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో రోజుకు 900 నుంచి వెయ్యి మరణాలు మాత్రమే నమోదయ్యేవని అధికారులు తెలిపారు. మూడు రోజుల్లోనే కనీసం వెయ్యి అదనపు మరణాలు సంభవించినట్లు ప్రజారోగ్య సంస్థ అంచనా వేసింది. తీవ్ర ఉష్ణోగ్రతల హెచ్చరికలు జారీ చేసిన ప్రాంతాల్లోనే మరణాలు ఎక్కువగా నమోదయ్యాయి. హీట్‌వేవ్ గరిష్ఠ స్థాయిలో ఉన్న సమయంలో ఫ్రాన్స్‌లో దాదాపు మూడు వంతుల ప్రాంతాలు రెడ్ అలర్ట్ పరిధిలో ఉండగా, మొత్తం మరణాల్లో 85 శాతం మంది 65 ఏళ్లు దాటిన వృద్ధులేనని వెల్లడించింది.

**ప్రపంచ ఆరోగ్యసంస్థ హెచ్చరిక**

ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ గ్రాబియేసస్ మాట్లాడుతూ, ప్రపంచ సగటుతో పోలిస్తే యూరప్ రెండు రెట్లు వేగంగా వేడెక్కుతోందన్నారు. ప్రస్తుతం దాదాపు 15 కోట్ల మంది వడగాడ్పుల ప్రభావంలో జీవిస్తున్నారని, వందలాది మంది మరణించారని, పాఠశాలలు మూతపడగా విద్యుత్ వ్యవస్థలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోందని తెలిపారు.వాతావరణ మార్పుల కారణంగా ఒకప్పుడు తరంలో ఒక్కసారి మాత్రమే సంభవించే హీట్‌వేవ్‌లు ఇప్పుడు దాదాపు ప్రతి ఏడాది కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జూన్ 21 నుంచి ఇప్పటివరకు యూరప్‌లో అధిక ఉష్ణోగ్రతలతో సంబంధం ఉన్న 1,300కుపైగా అదనపు మరణాలు నమోదైనట్లు తెలిపారు. యూరప్‌లోని ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు ఇలాంటి ఉష్ణోగ్రతలను తట్టుకునేలా నిర్మించబడలేదు" అని హెచ్చరిస్తూ, ముందస్తు ప్రణాళికలు, నివారణ చర్యలు, ఆరోగ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సభ్య దేశాలకు సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి, ఆరుగురికి గాయాలు



**చిట్యాల రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులోని బతుకమ్మ కుంట సమీపంలో జాతీయ రహదారి65పై ఆదివారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివ రాల ప్రకారం, హైదరాబాద్ నుంచి చిట్యాల వైపు వస్తున్న డీమ్యాక్స్ విక్రాస్ వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న ఇన్నోవా కారు బతుకమ్మకుంట సమీపంలోని మూల మలుపు వద్ద ఢీకొట్టింది. దీంతో డీమ్యాక్స్ వాహనం టైర్ పేలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎదురువైపు రోడ్డులోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో చిట్యాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కియా కారు, స్విఫ్ట్ డిజైర్ కార్లను ఢీకొట్టడంతో పాటు వెనుక వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కూడా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. కియా కారు పల్టీలు కొడుతూ రహదారిపై నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ డిజైర్ కారులో ప్రయాణిస్తున్న నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన కసిరెడ్డి దేవేందర్‌రెడ్డి (52), దేప సరిత (48) మృతి చెందారు. ప్రమాద సమయంలో స్విఫ్ట్ డిజైర్ కారును దేవేందర్‌రెడ్డి నడుపుతుండగా, వెనుక సీటులో ప్రయాణిస్తున్న సరిత అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. అదే కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాస్ రెడ్డి, కసిరెడ్డి మంజుల, యాపాల మమత గాయపడగా, కియా కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారి65పై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్లలో చిక్కుకున్న వారిని స్థానికులు, పోలీసులు బయటకు తీసి సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం క్రేన్ల సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను రహదారి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పున రుద్ధరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# అమరావతికి పరిరక్షణ కమిటీ రావడం వెనుక కుట్ర

## రాజధాని రైతుల ఆరోపణ

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతికి వైసీపీ సీఆర్డీఏ పరిరక్షణ కమిటీ రావడం,అనుసరణగా జరిగిన ఘటనకు వెనుక కుట్రకోణం దాగి ఉందని రాజధాని రైతులు ఆరోపించారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యమని ఆక్షేపించారు.రాజధాని నిర్మాణాన్ని నిలిపివేయడానికి వైసీపీ నేతల కుట్రలు నేటికీ జరుగుతున్నాయని మండిపడ్డారు. ఆదివారం అమరావతిలోని మందడంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి రాజధాని రైతులు పలు కీలక విషయాలు వెల్లడించారు. అన్నదాతల ప్రయోజనాలకు వైసీపీ నేతలు వ్యతిరేకంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. అమరావతి అభివృద్ధి కొందరికి ఇష్టం లేదని చెప్పుకొచ్చారు. అమరావతిలో మాజీ మంత్రి పేర్ని నాని ఇతర వైసీపీ ముఖ్య నేతల పర్యటనపై తాము అభ్యంతరం తెలిపామన్నారు. తమను వైసీపీ రెచ్చగొట్టొద్దని పేర్కొన్నారు. అవసరమైతే కొత్త తరహా ఉద్యమానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. అమరావతి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అవసరమైతే 10 వేల మంది రైతులతో తాడేపల్లి ప్యాలెస్‌ను, వైసీపీ కార్యా లయాలను ముట్టడిస్తామని వార్నింగ్ ఇచ్చారు. 1631 రోజుల ఉద్యమంలో వైసీపీ నాయకులు ఎందుకు తమను పరామర్శించలేదని ప్రశ్నిం చారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు కవ్వింపు చర్య లు మానుకోవాలని డిమాండ్ చేశారు.తమపై టీడీపీ వారు దాడి చేశారనే ఆరోపణలు అవాస్త వమని అమరావతి రైతన్నలు అన్నారు. రాజ ధానిపై వైసీపీ కుట్రలు కొనసాగితే గట్టిగా బదులిస్తామని అమరావతి రైతులు హెచ్చరించారు.

# రూ.20 కోట్లు ఇవ్వకపోతే లేపేస్తాం: బిష్ణోయ్‌గ్యాంగ్ వార్నింగ్



**ముంబయి,జూన్ 28:**బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టికి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తీవ్రమైన హెచ్చరికలు అందాయి. రూ. 20 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దుండగులు ఒక ఆడియో క్లిప్ పంపారు. ఈ ఘటన బాలీవుడ్‌లో తీవ్ర కలకలం రేపింది. కొద్ది నెలల క్రితం ఆయన ఇంటిపై కాల్పులు జరిగిన నేపథ్యంలో ఈ తాజా పరిణామం ఆందోళన కలిగిస్తోంది. ముందురోజు ఉదయం రోహిత్ శెట్టి సిబ్బందికి సుమారు 90 సెకన్ల నిడివి గల ఆడియో క్లిప్ వచ్చింది. అందులో "ఫిబ్రవరిలో మీ ఇంటిపై జరిపిన కాల్పులు కేవలం ట్రైలర్ మాత్రమే. డిమాండ్ చేసిన రూ. 20 కోట్లు ఇవ్వకపోతే ఈసారి బుల్లెట్లు నేరుగా నీకే తగులుతాయి" అని గ్యాంగ్‌స్టర్లు హెచ్చరించారు. ఈ వాయిస్, లారెన్స్ బిష్ణోయ్ ముఖ్య అనుచరుడిగా భావిస్తున్న శుభం లోంకర్‌దిగా పోలీసులు అనుమానిస్తున్నారు. 2024లో జరిగిన నేత బాబా సిద్ధిఖీ హత్య కేసుతో పాటు రోహిత్ శెట్టి ఇంటిపై కాల్పుల కేసులో కూడా శుభం లోంకర్ నిందితుడిగా ఉన్నాడు. రోహిత్ శెట్టి సిబ్బంది ఈ ఆడియో క్లిప్‌ను ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులకు అందజేశారు. ఈ కాల్పుల ఘటనపై ముంబై క్రైం బ్రాంచ్ ఏప్రిల్‌లో 1,624 పేజీల చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఇందులో 15 మందిని నిందితులుగా పేర్కొనగా, ప్రవీణ్ లోంకర్, ఆర్జో బిష్ణోయ్‌లను పరారీలో ఉన్న వారిగా ప్రకటించారు. ఈ కేసు దర్యాప్తు జరుగుతుండగానే, అదే గ్యాంగ్ నుంచి మరోసారి బెదిరింపులు రావడం గమనార్హం.

# సముద్ర స్నానానికి వెళ్లిన ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి

**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), జూన్ 28 ప్రభాతవార్త:** శ్రీకాకుళంజిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్రపుబీచ్‌లో ఆదివారం ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు స్నానానికి వెళ్లి మృతి చెందారు. టెక్కలి ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు భావనపాడు వెళ్లి సముద్రంలో స్నానానికి దిగారు. వీరిలో విశాఖపట్నంజిల్లా కశింకోటకు చెందిన గోరివుంకల అగస్త్య (19), విజయనగరం జిల్లా మెరక ముడిదాం గ్రామానికి చెందిన సారపెంట యశ్వంత్ (18) సముద్రంలో అలల ఉధృతికి కొట్టుకుపోయి మృతిచెందారు. ఈ ఇద్దరిలో భావనపాడుసముద్రపు ఒడ్డుకు ఓ విద్యార్థి మృతదేహం చేరగా,వజ్రపుకొత్తూరు మండలం అల్లాడ సముద్రపు ఒడ్డుకు మరో విద్యార్థి మృతదేహం కొట్టుకు వచ్చింది.మరో విద్యార్థి జజ్జన అభిలాష్ కెరటాలలో కొట్టుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమయంలో మెరైన్ పోలీసులు ప్రాణాలతో ఒడ్డుకు తీసుకువచ్చి రక్షించారు. నౌపడఎస్సై నారాయణ స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# లారీని ఢీకొన్న కారు: ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

## మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై ప్రమాదం





ప్రమాదానికి గురైన కారు. వెంకటసాయి (ఫైల్)

**జైపూర్, జూన్ 28, ప్రభాతవార్త :** మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల -చెన్నూర్ జాతీయ రహదారిపై శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి వెంకటసాయి (18) సంఘటనా స్థలంలో మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ ఎస్సై భూమేష్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలలో నివాసం ఉంటున్న పద్మ శ్రీనివాస్ వారి కుమారుడు వెంకటసాయి, మృతుడి నాయినమ్మ ఉదయలక్ష్మి నలుగురు కలిసి వారి ఆటోకారులో పెద్దపల్లిలో శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో సాయంత్రం ఇందారం ఎక్స్‌రోడ్ దాటిన కొద్ది దూరంలో లారీ ఎలాంటి ట్రాఫిక్ నియమాలు పాటించకుండా అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నిలిపి ఉండడం వలన కారు నడుపుతున్న కారు డ్రైవర్ శ్రీనివాస్ లారీని గమనిం చకపోవడం వల్ల లారీ వెనుకభాగానికి ఢీ కొనడంతో ముందు సీటులో కూర్చుని ఉన్న వెంకటసాయి అక్కడికక్కడే మృతి చెందాడని, మిగిలిన ముగ్గురికి తీవ్రగా యాలు కావడంతో ఆసుపత్రికి రలించి నట్లు తెలిపారు. మృతుని తల్లిదండ్రులు వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులు. మృతుడి తల్లి నరేందులపద్మ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ద్విచక్ర వాహనాలు ఢీ: ఇరువురు మృతి

**రేపల్లె (బాపట్లజిల్లా), జూన్ 28, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా రేపల్లె మండలం పెనుమూడి రోడ్‌లో ఆదివారం మధ్యాహ్నం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో కృష్ణా జిల్లాకు చెందిన ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణా జిల్లా కోడూరు మండలంలోని ఈరాల గ్రామానికి చెందిన గంజాల బాపనయ్య(37) తన భార్య నాంచారమ్మ,కుమారుడు సంతోష్‌కుమార్‌తో కలిసి ఎపి39కెవై7236 నెంబరు గల మోటారు బైక్‌పై రేపల్లెలోని బంధువులు ఇంటికి బయల్దేరాడు. రేపల్లె పట్టణం నుండి కృష్ణా జిల్లాలోని స్వగ్రామమైన చల్లపల్లికి వెళ్తూ రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చి ఎపి40ఇటి 2998 నెంబరు గల బైక్‌ను నడిపిన రాకేష్ ఎదురుగా వస్తున్న బాపనయ్య బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో కాకి రాకేష్(27), గంజాల బాపనయ్య అక్కడికక్కడే మృతి చెందారు. ఈ రెండు మోటార్ బైక్‌లపై ప్రయాణిస్తున్న గంజాల నాంచా రమ్మ, గంజాల సంతోష్‌కుమార్,ప్రకాష్‌లు గాయపడ్డారు. నాంచారమ్మ,సంతోష్‌కుమార్‌లను చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు,ప్రకాష్‌ను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.సంఘటనా ప్రదేశాన్ని రేపల్లెటౌన్ సిఐ బి.అశోక్‌కుమార్ పరిశీలించారు.మృతుడు గంజాల బాపనయ్య సతీమణి నాంచారమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు.

# తోట పనితో ప్రశాంతత



**కొన్ని దశాబ్దాలుగా ఆహారం కోసం మాత్రమే పెంచే ఇంటి తోట,** ఆధునిక కాలంలో అలంకరణ ప్రాయంగానూ మారింది. ఏదేమైనప్పటికీ చిన్నాపెద్దా అంతా తోటపనిలో పాలుపంచుకుంటు న్నారు. గార్డెనింగ్‌తో శారీరక ప్రయోజనాలతో పాటు, మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని అధ్యయనాలూ చెబుతున్నాయి. మొక్కల చుట్టూ తిరుగుతూ పని చేయడం వల్ల మనకు తెలియకుండానే శరీరానికి చిన్నపాటి వ్యాయామం అయిపోతుంది. మట్టి తవ్వినప్పుడూ, వంగినపుడూ, మల్చ్ చేసేట ప్పుడు, తేలికపాటి బరువు ఎత్తడం వంటివి అన్నీ మన శరీరానికి ఎంతో మేలుచేస్తాయి. ఇంటి తోటలో సమయం గడపడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలో ఎక్కడైనా వాపులు ఉంటే తగ్గుతాయి కూడా.. స్వచ్ఛమైన గాలి పెరగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసన్ పేర్కొంటోంది. తోటపనివల్ల విటమిన్–డి శాతం పెరుగుతుంది. జీవక్రియ కూడా మెరుగవుతుంది. నాడీవ్యవస్థ బలంగా మారుతుంది. ఇది పిల్లల్లో ఎముకల అభివృద్ధికీ, పెద్దవారిలో ఎముకలను బలోపేతం చేయంలోనూ తోడ్పడుతుంది. అంతేనా ఆరు బయట, బాల్కనీ, పోర్టి కోల్లో తోటను పెంచేవారిలో సూర్య కాంతి కారణంగా మెలటోనిన్ ఉత్పత్తవు తుండట. తద్వారా సెరటోనిన్ ఉత్పత్తి పెరిగి నిద్రకు దోహదపడుతుంది.. ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ (పియన్ఎయస్) ప్రకారం తోటమట్టి నుంచి వచ్చే పరిమళాలకు కూడా కొన్ని దీర్ఘకాలిక రోగాలను నియంత్రణ చేయగల శక్తి ఉందట. పెద్దపేగు క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను అదుపులోఉంచుతుంది. తోటమట్టిలో ఉండే మంచి బ్యాక్టీరియా ఒత్తిడిని తగ్గిస్తుంది. ◻

# అందాన్ని లాక్ చేద్దాం..



స్కిన్‌కేర్.. ప్రస్తుతం చాలామంది అమ్మాయిల రొటీన్‌లో ఇది భాగం. ఈ క్రమంలో అనేక రకాల క్రీములు వాడుతుంటాం కదా! అయితే, ప్రస్తుతం నడుస్తోంది మాత్రం గ్లూటాథయోన్ ఉత్పత్తుల ట్రెండే.. చర్మాన్ని కాంతిమంతంగా చేయడంలో ఇదే కీలకం మరి.. శరీరం సహజంగా ఉత్పత్తిచేసే శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ గ్లూటాథయోన్. ఇందులోని అమైనో ఆమ్లాలు, శరీరానికి హానిచేసే ఫ్రీ ర్యాడికల్స్‌ను తటస్థపరిచి, వృద్ధాప్య ఛాయలు రాకుండా చూస్తాయి. అంతేకాదు, చర్మానికి మంచి ఛాయ వచ్చేలానూ చేస్తాయి.

**ట్యాన్ తగ్గించి...** ఎన్ని సంరక్షణ పద్ధతులు పాటించినా సూర్యరశ్మి దాడి నుంచి తప్పించుకోవడం కష్టమే కదా! కాసేపు ఎండలో ఉన్నా సరే అతినీల లోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీసి, ట్యాన్ ఏర్పరుస్తాయి. ఇలాంటప్పుడు గ్లూటాథయోన్ ఉండే క్రీముల్ని మనం ఎంపిక చేసుకుంటే, శరీరంలో టాక్సిన్లను తొలగించి, క్లియర్ చర్మాన్ని అందిస్తుంది. చర్మంపై రక్షణ కవచంలా ఏర్పడి యూవీ కిరణాల నుంచి రక్షిస్తుంది.

**రిపేర్ చేసి...** వయసుపై బడే కొద్దీ చర్మం సాగే గుణాన్ని కోల్పోతుంది. అప్పుడూ మనకు ఉపయోగపడే మ్యాజిక్ క్రీమ్ ఇదే. ఎందుకంటే చర్మం ఎలాస్టిసిటీని కాపాడడంలో కొలాజెన్ పాత్ర కీలకం. శరీరంలో కొలాజెన్ తయారీకి గ్లూటాథయోన్ తోడ్పడుతుంది.



**తల్లులకు చిన్న పిల్లలు అమ్మా నేనెక్కడి నుంచి వచ్చాను నీ పొట్టలో ఎందుకు న్నానంటూ అడుగుతారు. ఊహించని ఈ ప్రశ్నలకు ఏం చెప్పాలో అర్థం కాదు. ఈ సందర్భం దాదాపు ప్రతి తల్లికీ ఎదురవుతుంది. ఇబ్బందిగా ఉన్నా వారి వయసుకు తగ్గ సమాధానం చెప్పాల్సిందే.**

# సమాధానం చెప్పాల్సిందే..

పిల్లలకు తమకెదురయ్యే ప్రతీదీ కొత్తగా, వింతగా కనిపిస్తుంది. సందేహాలెన్నో వస్తుంటాయి. వారడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం తెలిస్తేనే తృప్తి పడతారు. లేదంటే ఆ ప్రశ్నకు మరో ప్రశ్న వారి మెదడులో చేరి అయోమయానికి గురవుతారు. అందుకే ఎప్పటికప్పుడు వారి సందేహాలను తీర్చాల్సిందే. అవి వారి పాఠ్యాంశాలు, కథలు, వాటిలోని పాత్రలు, అంతరిక్షం, ఆహారం, ఆటలు వంటివి మాత్రమే అయితే ఇబ్బంది లేదు. మరికొంత ముందుకుకెళ్లి వారి పుట్టక గురించి, గర్భధారణ వంటివి ప్రశ్నిస్తే మాత్రం ఇబ్బంది అవుతుంది. ఆ వయసులో వారికి అవసరంలేనివి అడుగుతున్నరని కోప్పడి వాళ్ల నోరు మూయించొచ్చు. అయితే ఆ సందేహం వారి మనసు నుంచి దూరం కాదు. అది పెరిగి పెద్దదవుతుంది.

**ఎలా చెప్పాలంటే...** ఏడెనిమిదేళ్లలోపు చిన్నారుల కైతే ఏదైనా కథ రూపంలో సమాధానమివ్వాలి. మరొకసారి మరింత సమాచారం చెబుతానని అక్కడితో సంభాషణను పూర్తిచేయొచ్చు. ఎనిమిదేళ్లు దాటిన ఆడపిల్లలకు సమాధానం తప్పనిసరి. కొన్ని విషయాలు అర్థం చేసుకోగలుగుతారు. విసుక్కోకుండా మృదువుగా వారికి కావాల్సినంత మేరకు సమాచారాన్నివ్వొచ్చు. అమ్మ గర్భంలో బిడ్డ ఎదుగుదల గురించి వివరించాలి. మరింత అవగాహన తెచ్చుకొనే వయసైతే ప్రసవం గురించీ వివరించొచ్చు.

**చనిపోవడమంటే చెప్పాలి..** అమ్మమ్మ, నాయినమ్మ, జేజమ్మ ఎందుకు చనిపోయారని, వారెక్కడికి వెళ్లారని కొందరు పిల్లలకు సందేహాలొస్తుంటాయి. పదేళ్లవారికైతే జీవితంలో చివరగా వచ్చేమృతువు గురించి మృదువుగా వివరించాలి. అంతకన్నా చిన్నపిల్లలను దేవుడి దగ్గరకెళ్లాలరని చెప్పి మరిపించొచ్చు. అలానే, అన్నయ్యకన్నా నేనెందుకు భిన్నంగా ఉన్నాననే సందేహం ఆడపిల్లలకొస్తుంది. ప్రతి ఒక్కరి శరీరానికి ప్రత్యేకత ఉందని చెప్పాలి. ఆడపిల్లల్లో ఆయా వయసుకు తగినట్లు శారీరకపరమైన మార్పులెలా వస్తాయో అవగాహన కలిగించాలి. పరిశుభ్రత ప్రాముఖ్యతనూ చెప్పి పాటించేలా చేయాలి. ఇవన్నీ పిల్లల్లో శారీరకంగా ఆరోగ్యాన్నే కాకుండా మానసిక పరిపక్వతనూ పెంచుతాయి. ◻

# సరిదిద్దాలి !

**వృషపర్వుడు రాక్షసరాజు.** ఆయన వద్ద పురోహితుడు శుక్రాచార్యుడు. రాకుమార్తె శర్మిష్ఠ, శుక్రాచార్యుని కుమార్తె దేవయాని. ఒక రోజు కొందరు చెలికత్తెలతో కలిసి శర్మిష్ఠ, దేవయాని వనవిహారానికి వెళ్లి ఒక కొలనులో స్నానం చేస్తుండగా పెద్ద సుడిగాలి వచ్చి వారి వస్త్రాలన్నీ చిందర వందరగా ఎగిసి పడ్డాయి. వారంతా నీళ్ళలో నుండి త్వరత్వరగా బయటికి వచ్చి ఎవరికి ఏ వస్త్రం దొరికితే దాన్ని ధరించారు. రాజకుమారి శర్మిష్ఠ దేవయాని దుస్తుల్ని ధరించింది. రాకుమారి శర్మిష్ఠ వస్త్రాలు ధరించటానికి ఇష్టపడని దేవయాని శర్మిష్ఠతో 'నేను బ్రాహ్మణ కన్యను, నీకు పూజ్యురాలను. నీవు కట్టిన మలిన వస్త్రాన్ని నేను కట్టుకోను అనింది. శర్మిష్ఠ కోపంతో, నా తండ్రి రాజు, నీ తండ్రి నా తండ్రిని ఆశ్రయించి బ్రతుకుతున్నాడు, అని అంటూ దేవ యానిని ప్రక్కన ఉన్న పాడుబడిన బావిలోకి తోసింది. వేటకై వచ్చిన యయాతి దేవయాని ని బావిలో నుంచి తీసి రక్షించి వెళ్లి పోయాడు. దేవయాని పట్టణంలోకి పోవటానికి ఇష్టపడక అక్కడే కూర్చొన్నది. విషయా న్నంతా తెలుసుకొని శుక్రాచార్యుడు వచ్చి, గొప్ప యజ్ఞాలు చేసిన వారికన్నా కోపం లేనివాడే ఉత్తముడు శర్మిష్ఠపై కోప్పడక ఇంటికి వెళదాం రా' అన్నాడు. వృషపర్వుడు వచ్చి దేవయానితో, ' నీ కోరికేమో చెప్పు, నెరవేరుస్తాను, అన్నాడు దేవయానితో శర్మిష్ఠతో కలిసి వేయి మంది దాసీలు కావాలని దేవయాని కోరింది. శర్మిష్ఠ ఆమెకు దాసి అయింది. వ్యాస భగవానుడు ఏ గొప్ప సత్యాన్ని, నీతిని నేర్పుతున్నాడో గమనించారా? కులాన్ని గూర్చి అహంకరించరాదు, హోదాను బట్టి విర్ర వీగరాదు, యజ్ఞ యాగాదులను చేయుట కన్నా కోపాల్ని వదలటం శ్రేష్ఠం. ఏ కులస్తులైనా, ఎంత అధికారమున్న వారైన కర్మ ఫలితాన్ని అనుభవించక తప్పదు. పిల్లలు తప్పువారిని సమర్థించక వృషపర్వుని వలె, శుక్రాచార్యుని వలె వారికి తగిన విధంగా బుద్ధి చెప్పి సరిదిద్దాలి. ఇలాంటి వందల కథలను మనకు అందిస్తుంది మహాభారతం. ◻

# ఇంట్లోనే వర్కవుట్ ..

**బరువు తగ్గే క్రమంలో ఆహారానికి ఎంత ప్రాధాన్యమిస్తామో..** వ్యాయామాలకూ అంతే ప్రాధాన్యమిస్తా. అయితే



ఇందుకోసం కొంతమందికి జిమ్‌కి వెళ్లే సమయం ఉండదు. మరికొందరు నలుగురిలో వ్యాయామాలు చేయడానికి ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారి కోసం వర్చువల్ ట్రైనర్స్ అందుబాటులో ఉన్నారు అంటే.. వర్కవుట్ యాప్స్ ద్వారా సంబంధిత నిపుణుల సలహా మేరకు ఇంట్లోనే వ్యాయామాలు చేయడానికి ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారి కోసం వర్చువల్ ట్రైనర్స్ అందుబాటులో ఉన్నారు అంటే. మర్కవుట్ యాప్స్ ద్వారా సంబంధిత నిపుణుల సలహా మేరకు ఇంట్లోనే వ్యాయామాలు చేయడమన్నమాట! 'హోమ్ వర్కవుట్' జిమ్ వర్కవుట్ ట్రాకర్.. వంటి వివిధ రకాల యాప్స్ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదంటే కొంతమంది ఫిట్‌నెస్ నిపుణులూ ప్రత్యేకంగా యాప్స్ నక్రియేట్ చేసుకుంటారు. కొంత మొత్తం చెల్లిస్తే వాటిని డౌన్‌లోడ్ చేసుకొని వ్యాయామ చిట్కాలు పొందచ్చు. అయితే ఇక్కడ మనం చేసే వ్యాయామాల్ని బట్టి ఆయా జిమ్ పరికరాల్ని కొనుక్కోవడం మంచిది. ఇక కొంతమంది యూట్యూబ్ వీడియోలు చూస్తూ వర్కవుట్లు చేస్తుంటారు. కానీ కొన్ని రకాల వ్యాయామాల్ని నిపుణుల పర్యవేక్షణలోనే చేయాల్సి ఉంటుంది. కాబట్టి కొత్తగా వ్యాయామాలు ప్రారంభించే వారైనా లేదంటే అప్పటికే అలవాటున్న వారైనా.. సంబంధిత యాప్స్ డౌన్‌లోడ్ చేసుకొని లైవ్ సెషన్స్ ద్వారా ఎక్సర్‌సైజ్ మొదలు పెట్టడం సురక్షితం. ◻

# అన్నం పునుగులు

కావలసిన పదార్థాలు
అన్నం: కప్పు
బియ్యప్పిండి: పావు కప్పు
కొత్తిమీర: గుప్పెడు
అల్లం: చిన్న ముక్క
పచ్చిమిరపకాయలు: మూడు
కరివేపాకు: నాలుగు రెబ్బలు
బేకింగ్ సోడా: చిటికెడు
ఉప్పు: తగినంత
నూనె: వేయించడానికి సరిపడా

ముందుగా అన్నాన్ని మిక్సీలో వేసుకొని మెత్తగా మాష్ చేసుకోవాలి. బియ్యప్పిండిని ఇందులో కలుపుకోవాలి. కొత్తిమీర కరివేపాకులను సన్నగా తరుక్కోవాలి. అల్లం పచ్చిమిర్చిలను మిక్సీలో వేసి ముద్దగా చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు వీటన్నింటితో పాటు తగినంత ఉప్పు కొద్దిగా బేకింగ్ సోడాలని మాష్ చేసిన అన్నం మిశ్రమానికి కలుపుకోవాలి. బేకింగ్ సోడా వేశాక ఆ పిండిని చేత్తో బాగా కలియ బెట్టాలి. దీనివల్ల పునుగులు బోలుగా వస్తాయి.



కలపడం పూర్తయ్యాక పొయ్యి మీద నూనె పెట్టి గుండ్రటి బంతుల్లా వచ్చేలా కడాయిలో పునుగులు వేసుకుంటే సమ్మర్‌లో వెరైటీ స్నాక్స్ సిద్ధమైపోతాయి. ◻

తెర

# 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' విడుదల తేదీ ఖరారు



తెలుగు సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ ఎట్టకేలకు వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తోన్న కుటుంబ కథా చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ పోస్టర్ సినిమాలోని హృద్యమైన, ఉత్సాహభరితమైన ప్రపంచాన్ని పరిచయం చేస్తోంది. ఇందులో వెంకటేష్, శ్రీనిధి శెట్టి ఎంతో హుందాగా, ఆకర్షణీయంగా కనిపిస్తూ, ఆత్మీయ కుటుంబ కథకు అద్దం పట్టేలా ఉన్నారు. ఈ చిత్రం భావోద్వేగాలు, వినోదం, హృదయాన్ని హత్తుకునే క్షణాలతో నిండిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని పోస్టర్ స్పష్టం చేస్తోంది. వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో ప్రకటన వచ్చినప్పటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్రివిక్రమ్ శైలిలో మనసును హత్తుకునే భావోద్వేగాలు, గుర్తుండిపోయే పాత్రలు, కట్టిపడేసే హాస్యం, అర్థవంతమైన కథనం కలగలిపి, ప్రేక్షకులకు సంపూర్ణమైన సినిమా అనుభూతిని అందించడానికి ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 సిద్ధమవుతోంది. తన సహజమైన ఆకర్షణ, అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించే వెంకటేష్.. ఈసారి కూడా కుటుంబ విలువలతో కూడిన పాత్రలో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ చిత్రానికి అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరి స్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, కెవిన్ కుమార్ యాక్షన్ సన్నివేశాల కొరియోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ప్రతిష్టాత్మ కంగా నిర్మిస్తున్నారు. తెలుగు సినీ పరిశ్రమలో అత్యంత విజయవంత మైన కలయికలో ఒకటైన వెంకటేష్–త్రివిక్రమ్ కాంబో మరోసారి కలిసి వస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. అక్టోబర్ 2, 2026న పండుగ సీజన్‌లో విడుదల కానున్న "ఆదర్శ కుటుంబం హౌస్ నం: 47" చిత్రం, ఒక పరిపూర్ణ కుటుంబ వినోదభరిత చిత్రంగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. వెంకటేష్ ఆకట్టుకునే స్క్రీన్ ప్రజెన్స్, త్రివిక్రమ్ అద్భుతమైన కథాకథనం కలయికతో ఆవిష్కృతమయ్యే మ్యాజిక్‌ను చూడటానికి అభిమానులు, సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'నాగబంధం' గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది

## నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. **నాగబంధం ప్రాజెక్టులోకి మీరు ఎలా వచ్చారు?** మేము సాఫ్ట్‌వేర్ కంపెనీని విజయవంతంగా నిర్వహించాం. అక్కడి నుంచి ఎగ్జిట్ అయిన తర్వాత బిజినెస్‌ను డైవర్సిఫై చేయాలనే ఉద్దేశంతో సినిమా పరిశ్రమను కూడా ఒక మంచి అవకాశంగా భావించాం. నాగబంధం కంటే ముందు మరో కథ విన్నాం. అది చాలా పెద్ద హీరోతో చేయాల్సిన భారీ ప్రాజెక్ట్. అయితే అప్పటికి మేము నిర్మాతలుగా నిరూపించుకోలేదు కాబట్టి ఆ అవకాశం రాలేదు. రవీందర్ రెడ్డి గారు అభిషేక్ నామా వద్ద ఉన్న స్క్రిప్ట్ గురించి చెప్పారు. అలా మేము అభిషేక్‌ని కలిశాం. ఆయన విజన్ మాకు చాలా నచ్చింది. పెద్ద స్థాయిలో సినిమా చేయాలనే ఆలోచనతో నాగబంధం మొదలైంది. మొదటి నుంచి క్రియేటివ్ ఫీల్డ్‌పై మాకు ఆసక్తి ఉంది. అయితే కేవలం పేరు కోసం మేము ఈ రంగంలోకి రాలేదు. సాఫ్ట్‌వేర్ రంగంలోనే మేము మంచి గుర్తింపు సంపాదించాం. **సినిమా అనేది రిస్కీ బిజినెస్ కదా?** రిస్క్ అనేది అన్ని రంగాల్లో ఉంటుంది. మేము స్టార్టప్ ప్రారంభించినప్పుడు ఆ ట్రెండ్ అసలు లేదు. అప్పట్లో బీటెక్ చేసి అమెరికా వెళ్లి మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలనే ఆలోచనే ఎక్కువగా ఉండేది. కానీ మేము ఆ ట్రెండ్‌ను బ్రేక్ చేశాం. ఐటీ గ్రాడ్యుయేట్స్ అయినప్పటికీ నాలుగేళ్ల పాటు ఎలాంటి ఆదాయం లేకుండా కష్టపడ్డాం. మాపై మాకు ఉన్న నమ్మకం ఈ స్థాయికి తీసుకొచ్చింది. అదే నమ్మకంతో సినిమా రంగంలో కూడా రిస్క్ తీసుకున్నాం. **విరాట్ కర్ణ, దర్శకుడిగా అభిషేక్ నామా ఇద్దరూ కొత్తవారే. ఇంత భారీ బడ్జెట్ పెట్టడానికి కారణం ఏమిటి?** మాకు కంటెంట్‌పై బలమైన నమ్మకం ఉంది. లార్జర్ దాన్ లైఫ్ మైథాలజికల్ కథతో సినిమా చేయాలనే ఆలోచన మొదటి నుంచే ఉంది. అభిషేక్ నామా ఇంతకుముందు డెవిల్ చిత్రానికి దర్శకత్వం వహించారు. హీరో కోసం వెతుకుతున్న సమయంలో విరాట్ కర్ణ ఈ పాత్రకు పర్ఫెక్ట్ అనిపించారు. ఈ సినిమా కోసం ఆయన అద్భుతంగా బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యి, ఎంతో అంకితభావంతో పనిచేశారు. **ఫైనల్ అవుట్‌పుట్ చూసి సంతృప్తిగా ఉన్నారా?** చాలా హ్యాపీగా ఉన్నాం. విజువల్స్ అన్నీ అద్భుతంగా వచ్చాయి. మేము పెట్టిన ప్రతి రూపాయి తెరపై కనిపించాలనే ఉద్దేశంతో ఈ సినిమాను నిర్మించాం. **ఇది డివోషనల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న సినిమా కదా... మీ వ్యక్తిగత జీవితంలో కూడా ఆధ్యాత్మికత ఉందా?** మేము ఆధ్యాత్మికతను విశ్వసించే వాళ్లం. ప్రతి రోజు శివుని అభిషేకంతోనే మా రోజు ప్రారంభమవుతుంది. కార్తీక పౌర్ణమి రోజున ఈ సినిమా చివరి షెడ్యూల్ షూటింగ్ జరిగింది. అదే రోజు 24 గంటల పాటు అభిషేకం జరిగింది. అదంతా శివుడు, అనంత పద్మనాభస్వామి ఆశీర్వాదంతోనే జరుగుతోందనే భావన కలిగింది. ఈ సినిమా కోసం వేసిన అనంత పద్మనాభస్వామి ఆలయ సెట్‌ను చూసిన ప్రతి ఒక్కరూ నిజమైన ఆలయానికి వచ్చిన అనుభూతి కలుగుతోందని చెబుతున్నారు. **ఈ సినిమా నిర్మాణంలో ఎదురైన సవాళ్లు ఏమిటి?** ఈ సినిమా కోసం భారీ సెట్లు నిర్మించాం. భారీ సెట్లు అంటే సహజంగానే ఖర్చులు పెరుగుతాయి. ఈ సినిమాలో ప్రతి పది నిమిషాలకు ఒక అద్భుతమైన విజువల్ కనిపిస్తుంది. అలాంటి విజువల్స్‌ను అవుట్‌డోర్‌లో పొందడం సాధ్యం కాదు. ప్రేక్షకులకు ఒక విజువల్ ఫీస్ట్ అందించాలనే ఉద్దేశంతో ప్రతి సెట్‌ను ఎంతో శ్రద్ధగా రూపొందించాం. **ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందా?** ఈ సినిమా మేము ఆశించిన స్థాయిలో విజయం సాధిస్తే కచ్చితంగా సీక్వెల్ రూపొందించే ఆలోచన ఉంది.

# 'హ్యాపీ జర్నీ' : టీజర్ లాంచ్



గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న హార్ట్‌వార్మింగ్ ఎమోషనల్ డ్రామా 'హ్యాపీ జర్నీ'. అభిరామ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈచిత్రం మహిళా భావోద్వేగాలకు ప్రధాన ప్రాధాన్యతనిస్తూ రూపొందుతోంది. బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాత. ఏడుగురు మహిళల భావోద్వేగ ప్రయాణాలను ప్రధానంగా చూపించే ఈ చిత్రంలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినిషా అలీశెట్టి, రూపా శ్రీనివాస్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీ దండమూడి, వంశీధర్ గౌడ్, రవి శివతేజ పైలా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సీనియర్ నటి అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.."ఇప్పటివరకు నేను చేసిన పాత్రలకు భిన్నంగా ఇందులో నా పాత్ర వుంటుంది. ఇది చాలా మంచి కథ. మనందరి కథ." అన్నారు. నటి ఆమని మాట్లా డుతూ.. 'హ్యాపీ జర్నీ' నిజంగానే ఒక హ్యాపీ జర్నీ. మేమందరం ఫ్రెండ్స్‌లా కలిసి ఈ సినిమా చేశాం. ఇది నాకు చాలా కొత్త అనుభవం' అన్నారు. నటి ఝాన్సీ మాట్లాడుతూ.. " ఏడుగురు మహిళలు ఒక ప్రయాణంలో కలిస్తే ఎంత సరదాగా ఉంటుందో, వారి మధ్య ఏర్పడే బంధం, భావోద్వేగాలు, కన్నీళ్లు ఎంత హృదయాన్ని తాకుతాయో ఈ సినిమా చూపిస్తుంది" అన్నారు. దర్శకుడు అభిరామ్‌నాయుడు మాట్లాడుతూ.."ఈ సినిమా జర్నీ చాలా ఆనందంగా సాగింది. మా జీవితాల్లో ఇది ఒక మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుంది. టీజర్ చూస్తే ఇది అమ్మాయిల కోసం తీసిన సినిమా అనిపించొచ్చు. కానీ నిజానికి ఇది మగాళ్ల కోసంతీసిన సినిమా" అన్నారు.

# 'గుర్తుకొస్తున్నాయి' ట్రైలర్ విడుదల




యంగ్ ట్యాలెంటెడ్ విరాజ్ అశ్విన్ హీరోగా వినోద్ గాలి దర్శకత్వంలో శరత్ చంద్రనాయుడు నిర్మిస్తున్న సిరిస్ 'గుర్తుకొస్తున్నాయి'. యశశ్రీ రావు, రోహిణి హట్టంగడి, శివ నారాయణ నారిపెద్ది, ప్రియదర్శిని రామ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ రోజు మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. 'ఈరోజు భాగ్యరాజ్ మరణ వార్త చాలా బాధాకరం. ముందుగా ఆయనను స్మరించుకుంటూ మౌనం పాటిద్దాం. మన ఇండస్ట్రీలో నేను పని చేసిన గొప్ప సంస్థల్లో గీతా ఆర్ట్స్ ఒకటి' అన్నారు.హీరో సత్యదేవ్ మాట్లాడుతూ 'గీతా ఆర్ట్స్ నుంచి ధీరజ్, ఎస్‌కేఎన్, శరత్, బన్నీ వాసు... ఇలా ఎంతోమంది నిర్మాతలుగా రావడం, అందరూ సక్సెస్‌ఫుల్‌గా మంచి సినిమాలు చేయడం నిజంగా చాలా ఆనందంగా ఉంది' అన్నారు. హీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ..'ఈ ట్రైలర్ ఈవెంట్‌ను మేము ఎప్పటికీ మర్చిపోలేం. హీరో సత్యదేవ్‌కి, దర్శకుడు కరుణాకర్‌కి, బోయపాటి శ్రీనుకి, ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు' అన్నారు. బన్నీ వాసు మాట్లాడుతూ.. 'మొన్న నా సినిమా లాంచ్ అయ్యింది. ఈరోజు ఉదయం మా బ్యాచ్‌లో సందీప్ తన సినిమాను ప్రారంభించాడు' అన్నారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ..'శరత్ జీవితంలో ముందుకు వెళ్లాలనే తపన ఉన్న వ్యక్తి. ఈరోజు తను ఈ సిరీస్‌తో నిర్మాతగా రావడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు.నిర్మాత శరత్ చంద్ర నాయుడు మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' గురించి చెప్పాలంటే నాకు చాలా విషయాలు గుర్తుకొస్తు న్నాయి. ముందుగా అల్లు అర్జున్‌కి థాంక్స్ చెప్పాలి. నేను మొదట ఆయన వద్ద సోషల్ మీడియా హ్యాండిల్ చేశాను. తర్వాత పీఆర్‌గా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను' అన్నారు. మైత్రి మూవీమేకర్స్ నిర్మాత రవి మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' అనే టైటిల్ చూడగానే ఒక పాజిటివ్ వైబ్‌వచ్చింది. గీతా ఆర్ట్స్, ఈటీవీ విన్ రెండూ ప్రతిష్టాత్మక సంస్థలు. అలాంటి రెండు సంస్థలనుంచివస్తున్న ఈసిరీస్ తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను' అన్నారు.

# 'హైకూ' చిత్రీకరణ పూర్తి



'కోర్ట్' సినిమా హీరోయిన్ శ్రీదేవి లేటెస్ట్ మూవీ 'హైకూ'. ఈ బహుభాషా చిత్రంలో శ్రీదేవితో పాటు ఏగన్, 'మిన్నల్ మురళి' మూవీ ఫేమ్ ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై డా. డి. అరుళానందు, మాథేవో అరుళానందు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. యువరాజ్ చిన్న సామి కథ, దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తు న్నారు. నాలుగు షెడ్యూళ్లలో 90 రోజుల చిత్రీకరణతో మొత్తం షూటింగ్ పూర్తయ్యింది. డైరెక్టర్ యువరాజ్ చిన్నసామి మాట్లాడుతూ, 'హైకూ' సినిమాను అనుకున్న ప్లానింగ్ ప్రకారం పూర్తి చేశాం. ఇది మా ఎంటైర్ టీమ్‌కు చాలా ఎమోషనల్, హ్యాపీ మూమెంట్. కథను నమ్మి నాకు పూర్తి క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చిన మా నిర్మాతలు డా. డి. అరుళా నందుగారికి, మాథేవో అరుళానందు గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు" అన్నారు. నిర్మాతలు డా. డి. అరుళానందు, మాథేవో అరుళానందు మాట్లాడుతూ, 'హైకూ' సినిమా మొత్తం చిత్రీకరణ పూర్తయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి' అన్నారు.




# అంజూ 22 యేళ్ల లాంగ్‌జంప్ రికార్డు బ్రేక్

**భువనేశ్వర్, జూన్ 28:** భువనేశ్వర్‌లో జరుగుతున్న జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో మరో రికార్డు బద్ద లైంది. అంజు బాబీ జార్జ్ పేరిట ఉన్న 22 ఏళ్ల నాటి లాంగ్ జంప్ జాతీయ రికార్డును కేరళకు చెందిన అన్సీ సోజన్ బ్రేక్ చేసింది. 25 ఏళ్ల అన్సీ తన ఐదవ ప్రయత్నంలో 6.88 మీటర్ల దూరం దూకి... 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో అంజూ నెలకొల్పిన 6.83 మీటర్ల జాతీయ రికార్డును అధిగమించింది. అలాగే భారత అథ్లెటిక్స్ సమాఖ్య నిర్దేశించిన 6.48 మీటర్ల ఆసియా క్రీడల అర్హత ప్రమాణాన్ని కూడా అన్సీ దాటింది. ఈ సీజన్‌లో ఆసియా అథ్లెట్లలో ఆమె అగ్రస్థానానికి చేరుకుంది. శైలి సింగ్ (ఉత్తరప్రదేశ్) 6.67 మీటర్లతో రెండో స్థానంలో, ముబస్సినా(లక్షద్వీప్) 6.53 మీటర్లతో మూడో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన ముగ్గురు అర్హత సాధించినా జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో అన్సీ, శైలిసింగ్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందారు.

### పురుషుల హైజంప్‌లో మరో రికార్డు

మహారాష్ట్రకు చెందిన సర్వేష్ కుషారే పురుషుల హై జంప్‌లో 2.31 మీటర్ల అద్భుత ప్రదర్శనతో జాతీయ రికార్డును నెలకొల్పాడు. గత ఏడాది టోక్యోలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ పురుషుల హై జంప్ ఫైనల్‌కు అర్హత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచిన కుషారే... 2.31 మీటర్ల ఎత్తును అధిగమించి 2018 నుండి తేజస్విన్ శంకర్ పేరిట ఉన్న 2.29 మీటర్ల జాతీయ రికార్డును మెరుగు పరిచాడు. కుషారే 2.35మీటర్ల ఎత్తును అధిగమించడానికి ప్రయత్నించినప్పటికీ, రెండు ప్రయత్నాల లోనూ విఫలమయ్యాడు. ఈఛాంపియన్‌షిప్‌లలో ఇప్పటివరకు 5 జాతీయ రికార్డులు నమోదయ్యాయి.



# ప్రపంచ రోయింగ్‌లో భారత్‌కు తొలి స్వర్ణం

**లూసర్నే(స్విట్జర్లాండ్), జూన్ 28:** ప్రపంచ రోయింగ్ కప్‌లో భారత రోయర్లు చరిత్ర సృష్టించారు. ప్రపంచ రోయింగ్‌లో తొలిసారి భారత్‌కు స్వర్ణం అందించారు. స్విట్జర్లాండ్‌లోని లూసర్నే వేదికగా జరుగుతున్న ప్రపంచ రోయింగ్ కప్‌లో భాగంగా ఆదివారం జరిగిన పురుషుల లైట్ వెయిట్ డబుల్స్ స్కల్స్ ఫైనల్లో ఉజ్వల్ కుమార్, లక్షయ్ జోడీ పోటీపడ్డారు. రేసు ఆరంభం నుంచి వేగంగా దూసుకుపోయిన భారత జోడీకి హాంకాంగ్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఉజ్వల్, లక్షయ్ జోడీ 6 నిమిషాల 26.09 సెకన్లలో రేసు పూర్తి చేశారు. అగ్రస్థానంతో పసిడి పతకం అందుకున్నారు. తరువాతి రెండు స్థానాల్లో నిలిచిన హాంకాంగ్, నెదర్లాండ్స్ ఖాతాలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ చేరాయి. భారత్‌కు ప్రపంచకప్ రోయింగ్‌లో ఇదే తొలి స్వర్ణం. గతంలో 3 కాంస్యాలు మాత్రమే అందుకుంది. 2009లో మహిళల క్వాడ్రపుల్‌లో.. 2019, 2022లో మహిళల పారా పెయిర్స్ విభాగాల్లో భారత్ కాంస్యాలు నెగ్గింది. భారత్‌కు స్వర్ణం అందించిన ఉజ్వల్ కుమార్, లక్షయ్ భారత ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నారు.

## లక్ష్య ఛేదనలో మరోసారి విఫలమైన టీమిండియా

# టి20 సిరీస్ ఐర్లాండ్ కైవసం



**బెల్‌ఫాస్ట్, జూన్ 28:** ప్రపంచ టీ20 ఛాంపియన్లు టీమిండియా మరోసారి లక్ష్య ఛేధనలో బోల్తా కొట్టింది. 155 పరుగులను ఛేధించడంలో విఫలమైన శ్రేయాస్ సేన నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 153 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సిన టీమిండియా 18 రన్స్ మాత్రమే చేసింది. దీంతో రెండో టీ20లోనూ క్రికెట్ కూన ఐర్లాండ్ ఒక పరుగు తేడాతో నెగ్గి సిరీస్‌ను 2–0తో క్లీన్ స్వీప్ చేసింది. ఐర్లాండ్ పర్యటనను పరాజయంతో ముగించింది.

### ఓపెనర్లు డకౌట్

155 పరుగుల లక్ష్య ఛేదనలో మరోసారి భారత్ బ్యాటింగ్ తడబడింది. తొలి ఓవర్లోనే ఓపెనర్లిద్దరినీ కోల్పోయింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శాంసన్(0)ను ఎల్బీగా అవుట్ చేసిన మూంబ్రా...నాలుగో బంతికి అభిషేక్(0)ను పెవిలియన్ చేర్చాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(10) కూడా నిరాశ పరిచాడు. ఇషాన్ కిషన్(12) రనౌట్ కావడంతో 35 పరుగులకే నాలుగు టాప్ ఆర్డర్ వికెట్లను కోల్పోయింది.

### తిలక్, హర్షిత్ ఒంటరిపోరాటం

అక్షర్ పటేల్(14)తో కలిసి కొద్దిసేపు వికెట్ల పతనానికి తిలక్ వర్మ(46 బంతుల్లో 55 రన్స్; 3 ఫోర్లు, ఓ సిక్స్) పుల్ స్టాప్ పెట్టాడు. అయిదో వికెట్‌కు 39 రన్స్ జోడించాడు. ఇక శివమ్ దూబే(20)తోకలిసి స్కోరును వంద దాటించాడు. ఈక్రమంలో తిలక్ వర్మ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఇద్దరూ ఆడుతున్నంత సేపు భారత్ గెలుస్తుందన్న ఆశలు కలిగాయి. అయితే 8 పరుగుల తేడాతో దూబే, తిలక్‌వర్మ అవుట్ కావడంతో భారత్ ఆశలు సన్నగిల్లాయి. తొలి వన్డే ఆడుతున్న సూర్యాంష్ షెడ్గే (1) కూడా తొందరగానే అవుటయ్యాడు. చివర్లో హర్షిత్ రాణా 10 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్‌తో 21 రన్స్‌తో మెరుపులు మెరిపించినా భారత్‌ను ఓటమి నుంచి తప్పించలేకపోయాడు. ఐర్లాండ్ బౌలర్లు మూంబ్రా, మాట్ హోలార్డ్ మూడేసి వికెట్లు తీసి భారత్‌ను దెబ్బతీశారు.

### ప్రిన్స్ వికెట్ల బోణీ

అంతకుముందు టాస్ నెగ్గిన టీమిండియా.. ఐర్లాండ్‌కు బ్యాటింగ్ అప్పగించింది. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌ను టిమ్ టెక్టార్(5), రాస్ అడైర్(16) ప్రారంభించారు. హర్షిత్ రాణా తన తొలి ఓవర్లోనే టిమ్ టెక్టార్‌ను అవుట్ చేశాడు. రెండు సిక్స్‌లతో ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన మరో ఓపెనర్ రాస్ అడైర్‌ను అర్షదీప్ సింగ్ పెవిలియన్‌కు చేర్చాడు. కెప్టెన్ లోర్కాన్ టక్కర్(15)ను తొలి వన్డే ఆడుతున్న ప్రిన్స్ యాదవ్ బోల్తా కొట్టించాడు. దీంతో ఐర్లాండ్ 48 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

### హ్యారీ టెక్టార్ అర్ధ శతకం

ఈ క్రమంలో వన్‌డౌన్ బ్యాటర్ హ్యారీ టెక్టార్(47 బంతుల్లో 53), బెంజమిన్ కాలిట్జ్ (37) క్రీజ్‌లో నిలదొక్కుకుని ఐర్లాండ్ స్కోరును వంద దాటించారు. నాలుగో వికెట్‌కు 65 రన్స్ జోడించారు. ఈ దశలో శివమ్ దూబే వరుసబంతుల్లో కాలిట్జ్, గరెత్(0)ను ఔట్ చేసి దెబ్బతీశాడు. మరో ఎండ్‌లో అర్షదీప్, ప్రిన్స్ యాదవ్ కూడా వికెట్లు తీయడంతో ఐర్లాండ్ వేగంగా వికెట్లు కోల్పోయింది. కాగా అర్ధసెంచరీ పూర్తి చేసిన హ్యారీ టెక్టార్... ఐర్లాండ్ స్కోరును 150 మార్కు దాటించాడు. భారత బౌలర్లలో అరంగేట్ర పేసర్ ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు తీయగా.. అర్షదీప్ సింగ్, శివం దూబే చెరో రెండు, హర్షిత్ రాణా ఒక వికెట్ పడగొట్టారు.


ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు

## ఆస్ట్రేలియా చేతిలో ఓడిన భారత్ మహిళలు

# టి20 ప్రపంచకప్ నుంచి ఔట్



**లండన్, జూన్ 28:** ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్–2026 టోర్నీలో భారత్ పోరు లీగ్ దశలోనే ముగిసింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడి సెమీస్‌కు దూరమైంది. మొదట భారత్ ఉమెన్స్ 4 వికెట్లకు 170 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా మరో ఓవర్ ఉండగానే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా టాప్ ప్లేస్‌తో, సౌతాఫ్రికా సెకండ్ ప్లేస్‌తో గ్రూప్–నుంచి సెమీఫైనల్లో ప్రవేశించాయి. భారతన ఆడిన 5 మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, రెండు పరాజయాలతో ఆరు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ మహిళలు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన(37 బంతుల్లో 38), షఫాలీ వర్మ(26 బంతుల్లో 34).. తొలి వికెట్‌కు 66 పరుగుల శుభారంభాన్నిచ్చారు. అయితే స్కోరును వేగంగా పెంచలేకపోయారు. తర్వాత వచ్చిన రోడ్రిగ్స్(28 బంతుల్లో 34)తో కలిసి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన హర్మన్‌ప్రీత్(27 బంతుల్లో 56 రన్స్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి స్కోరు వేగం పెంచింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కెప్టెన్ సోఫీ మోలినెక్స్ రెండు వికెట్లు తీసింది.

ఇక లక్ష్య ఛేదనకు దిగిన ఓపెనర్ జార్జియా వోల్ (4)ను ఔట్ చేసి ఆసీస్‌కు ఆదిలోనే రేణుకా సింగ్ షాకిచ్చింది. అయితే, బెత్ మూనీ (22), ఫోబీ లిచిఫీల్డ్ (22) నిలకడగా ఆడుతూ స్కోరును ముందుకు నడిపారు. ఆ తర్వాత వచ్చిన పెర్రి (38 బంతుల్లో 56), గార్డ్‌నర్ (29 బంతుల్లో 53 నాటౌట్) అద్భుత అర్ధ శతకాలతో దుమ్మురేపారు. నాలుగో వికెట్‌కు వంద పరుగులు జోడించి విజయానికి బాటలు వేశారు. ఆరు వికెట్ల విజయాన్ని అందించారు.



# యుఎస్ ఓపెన్ ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్

**కాలిఫోర్నియా, జూన్ 28:** భారత్ స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్... యుఎస్ ఓపెన్‌లో టైటిల్ ఆశలను రెట్టింపు చేశాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన సెమీ ఫైనల్లో జపాన్ ప్లేయర్ యుదై ఒకిమోటోను మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో 22–20, 15–21, 21–19తో ఓడించాడు. ఈ మ్యాచ్ గంటా 12 నిమిషాల పాటు జరిగింది. ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన సు లి యాంగ్‌తో కిడాంబి తలపడనున్నాడు. కాగా భారత యువ షట్లర్లు రౌనక్ చౌహాన్, దేవికా సిహాగ్ పోరు సెమీఫైనల్లోనే ముగిసింది.

2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్ కిడాంబి శ్రీకాంత్.. సెమీస్‌పోరును చక్కగా ఆరంభించాడు. 9–5తో ఆధిక్యం చాటాడు. ఆ తర్వాత దానిని 17–10కి పెంచుకున్నాడు. అయితే ఒకిమోటో అద్భుతమైన కమ్ బ్యాక్‌తో ఏకంగా పది పాయింట్లు సాధించి సమవుజ్జీగా నిలిచాడు. ఇద్దరూ మధ్య సుదీర్ఘ ర్యాలీలు కొనసాగాయి. చివరకు కిడాంబి తొలి గేమ్‌ను 22–20తో నెగ్గి కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న ఒకిమోటో 21–15తో నెగ్గి సమం చేశాడు. ఫలితం తేల్చే మూడోగేమ్‌లోనూ ఇరువురూ పోటీపోటీగా తలపడ్డారు. చివరకు కిడాంబి వరుసగా ఆరు పాయింట్లు సాధించి పైచేయిగా నిలిచాడు. ఈ గేమ్‌ను తన ఖాతాలో వేసుకుని ఫైనల్లో ప్రవేశించాడు.

### సెమీస్‌లో రౌనక్, దేవికా బోల్తా

మరో పురుషుల సింగిల్స్ సెమీస్‌లో యువ షట్లర్ రౌనక్ చౌహాన్ అద్భుత ప్రదర్శన ముగిసింది. అతను సు లి యాంగ్ చేతిలో 17–21, 19–21 తేడాతో వరుస గేమ్‌ల్లో పరాజయం పొందాడు. ఈమ్యాచ్ 46నిమిషాల్లోనే ముగిసింది. ఇక ఈ ఏడాది ఆరంభంలో థాయిలాండ్ మాస్టర్స్ గెలిచిన ఆరో సీడ్ దేవిక సిహాగ్... మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్ లైన్ క్రిస్టోఫర్‌సెన్(డెన్మార్క్) చేతిలో 21–15, 11–21, 15–21 తేడాతో ఓటమి పాలైంది. తొలి గేమ్‌ను నెగ్గి శుభారంభం చేసిన దేవిక అదే రోజు మిగతా రెండు గేమ్‌ల్లో చాటలేక చతికిలపడింది.

## టాప్ ఆరు కంపెనీల్లో

# 89వేల కోట్ల ఎంక్యాప్ వృద్ధి



**ముంబయి, జూన్ 28:** దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఆరు సంస్థలు గత వారం రూ.88 వేల 678 కోట్లకు పైగా మార్కెట్ విలువను పెంచుకున్నాయి. మరో నాలుగు కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ తగ్గింది. కాగా ఐసీఐసీఐ బ్యాంక్ అత్యధిక లాభం నమోదు చేసింది. సెలవు కారణంగా నాలుగు ట్రేడింగ్ రోజులకే పరిమితమైన మార్కెట్ విలువ పెరుగుదలలో ఐసీఐసీఐ బ్యాంక్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.29 వేల 589 కోట్లు పెరిగి దాదాపు రూ.9.96 లక్షల కోట్లకు చేరింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.24 వేల 718 కోట్లు పెరిగి రూ.12.26 లక్షల కోట్లకు చేరింది. దేశీయ దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.12 వేల 44 కోట్లు పెరిగి రూ.17.84 లక్షల కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.11 వేల 580 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ విలువ రూ.9 వేల 323 కోట్లు, లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ 1,424కోట్లు పెరిగాయి.

మరోవైపు, మార్కెట్ విలువ కోల్పోయిన కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్ అత్యధిక నష్టాన్ని చవిచూసింది. ఆ సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.35 వేల 615 కోట్లు తగ్గింది. అలాగే ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ.21 వేల 189 కోట్లు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ రూ.11 వేల 144 కోట్లు, హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.5 వేల 322 కోట్లు తగ్గాయి. మార్కెట్ విలువల్లో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఆతర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, ఎల్ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్థానాల్లో నిలిచాయి.

# ఎక్సైజ్ సుంకాలతో రాష్ట్రాల ఖజానా కళకళ



**న్యూఢిల్లీ, జూన్ 28:** మద్యం అమ్మకాలతో రాష్ట్రాల ఖజానా కళకళలాడింది. రెండు నెలల వ్యవధిలోనే కొన్ని రాష్ట్రాల్లో ఎక్సైజ్ సుంకం వసూళ్లు 82 శాతం వరకు పెరిగింది. వసూళ్లలో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలవగా వృద్ధి రేటులో హర్యానా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సీఏజీ) విడుదల చేసిన 10 ప్రధాన రాష్ట్రాల నెలవారీ కీలక సూచికల చూస్తే ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌మే కాలంలో ఉత్తరప్రదేశ్ రూ.10,600 కోట్లకు పైగా ఎక్సైజ్ ఆదాయాన్ని నమోదు చేసింది. హర్యానాలో ఎక్సైజ్ వసూళ్లు 82 శాతానికి పైగా పెరిగి రూ.2,300 కోట్లను దాటాయి. మొత్తం ఆదాయ పరంగా కర్ణాటక రెండో స్థానంలో ఉండగా వృద్ధి శాతంలో కేరళ రెండో స్థానంలో నిలిచింది.

మద్యం వినియోగం 14 శాతం పెరగడం, పలురాష్ట్రాలు ఎక్సైజ్ రేట్లను పెంచడం, తయారీ సంస్థలు ప్రాథమిక ధరలను సవరించడం వల్ల ప్రభుత్వాలకు అధిక ఆదాయం సమకూరిందని పేర్కొంటున్నాయి. కర్ణాటక దేశంలోనే తొలిసారిగా ఆల్కహాల్‌ఇన్‌బెవరేజ్ ఆధారిత ఎక్సైజ్ విధానాన్ని అమల్లోకి తీసుకురాగా తక్కువ ఆల్కహాల్ శాతం ఉన్న మద్యంపై అమ్మకపు పన్ను తగ్గించే ప్రతిపాదనను కేరళ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

రాష్ట్రాల సొంత పన్ను ఆదాయంలో ఎక్సైజ్ సుంకం వాటా 13.5 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ రూ.52,575 కోట్లతో అత్యధిక ఎక్సైజ్ ఆదాయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత కర్ణాటక 35వేల 784 కోట్లు, మహారాష్ట్ర రూ.25,466 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.19,882 కోట్లు, పశ్చిమ బెంగాల్ రూ.19,521 కోట్లు, తెలంగాణ రూ.18,604 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.15,201 కోట్లు, రాజస్థాన్ రూ.15,104 కోట్లతో ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ ప్రాంత రాష్ట్రాల్లో ఉత్తరాఖండ్ రూ.4,362 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా మిజోరం కేవలం రూ.2 కోట్ల ఎక్సైజ్ ఆదాయంతో చివరి స్థానంలో నిలిచింది.




# కోల్‌కత్తాలో జీఎస్టీ సమావేశం

**న్యూఢిల్లీ, జూన్ 28:** దేశంలో పరోక్ష పన్ను విధానంలో మరో కీలక మార్పులకు జిఎస్టీ మండలి రంగం సిద్ధంచేస్తోంది. జీఎస్‌టీ కౌన్సిల్ 57వ సమావేశం వచ్చే నెలలో కోల్‌కతాలో నిర్వహించనున్నారు. పన్ను సంస్కరణలు, తయారీ రంగానికి ఊరటనిచ్చే నిర్ణయాలు, ఆటిజం కేర్ సెంటర్లపై జీఎస్‌టీ తగ్గింపు వంటి కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. పశ్చిమ గత జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం గత ఏడాది సెప్టెంబర్ 3న జరిగింది. దాదాపు తొమ్మిది నెలల విరామం తర్వాత జరిగిన ఆ సమావేశంలో "జీఎస్‌టీ 2.0" సంస్కరణలను ప్రవేశపెట్టారు.

పన్ను రేట్ల సరళీకరణతో పాటు వ్యాపారాలకు అనుకూలంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి కూడా పరోక్ష పన్ను వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చే అవకాశముందని పన్ను నిపుణులు అంచనా వేసున్నారు. ముఖ్యంగా తయారీ రంగంపై భారం తగ్గించే అంశాలు జీఎస్‌టీ కౌన్సిల్ పరిశీలించే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఇన్‌వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ కారణంగా ఇన్‌పుట్ సర్వీస్ ఐటీసీ రీఫండ్ లభించకపోవడం వల్ల తయారీ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని బెంగాల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జాతీయ ఫిస్కల్ అఫైర్స్ అండ్ టాక్సేషన్ కమిటీ ఛైర్మన్ వివేక్ జలాన్ పేర్కొన్నారు. ఈ లోపాన్ని సరిదిద్దితే పన్నుల భారం తగ్గడంతో పాటు తయారీ రంగ పోటీతత్వం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆటిజం కేర్ సెంటర్లు, వాటికి సంబంధించిన సేవలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించాలని కూడా జీఎస్‌టీ కౌన్సిల్‌ను కోరినట్లు తెలుస్తోంది.

# డివిడెండ్లు,షేర్ బైబాక్‌లతో ఈ వారం బిజీ




**ముంబయి, జూన్ 28:** వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లో పలు ప్రముఖ లిస్టెడ్ కంపెనీల షేర్లకు కీలక కార్పొరేట్ చర్యలు అమల్లోకి రానున్నాయి. 29 నుంచి జూలై 3 వరకు డివిడెండ్లు, ప్రత్యేక డివిడెండ్లు, షేర్ బైబ్యాక్‌లు, స్పిన్‌ఆఫ్ వంటి చర్యలకు సంబంధించిన ఎక్స్‌డేట్లు నిర్ణయించబడ్డాయి. దీంతో ఆయా కంపెనీల షేర్లపై పెట్టుబడిదారుల దృష్టి కేంద్రీకృతమైంది.

29న జ్యోతి ల్యాబ్స్ షేరుకు రూ.3.50 తుది డివిడెండ్, కన్సాయ్ నెరోలాక్ పెయింట్స్ షేరుకు రూ.2.50, కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ షేరుకు రూ.11, రేమండ్ లైఫ్‌స్టైల్ షేరుకు రూ.1 తుది డివిడెండ్‌లకు ఎక్స్‌డేట్ ఉంటుంది. 30న బజాజ్ ఫిన్‌సర్వ్ రూ.1.50 తుది డివిడెండ్ ఇవ్వనుండగా, బజాజ్ హోల్డింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఒక్కో షేరుకు రూ.50 తుది డివిడెండ్‌తో పాటు మరో రూ.50 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించింది. బజాజ్ ఫైనాన్స్ రూ.6 ప్రత్యేక డివిడెండ్, మహారాష్ట్ర స్కూటర్స్ రూ.60 ప్రత్యేక డివిడెండ్, వెల్‌స్పన్ కార్ప్ రూ.5 ప్రత్యేక డివిడెండ్‌లకు కూడా అదే రోజు ఎక్స్‌డేట్ ఉంటుంది.

జూలై 1న డీసీఎం శ్రీరామ్ ఫైన్ కెమికల్స్, గ్రోవీ ఇండియా, కెమ్‌బాండ్ మెటీరియల్ టెక్నాలజీస్ కంపెనీల ప్రత్యేక డివిడెండ్లకు ఎక్స్‌డేట్ నిర్ణయించారు. భారత్ ఫోర్జ్ ఒక్కో షేరుకు రూ.6.50, బయోకాన్ రూ.0.50, మహీంద్రా అండ్ మహీంద్రా రూ.33, టెక్ మహీంద్రా రూ.36, శ్రీరామ్ ఫైనాన్స్ రూ.6, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.5, వెల్‌స్పన్ ఎంటర్‌ప్రైజెస్ రూ.3, థర్మాక్స్ రూ.14 తుది డివిడెండ్‌తో పాటు రూ.6 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించాయి. అదే రోజున ఎస్కార్ట్స్ కుబోటా రూ.33, ఎక్స్‌డ్ ఇండస్ట్రీస్ రూ.2, మ్యాక్స్ హెల్త్‌కేర్ రూ.2, రెడింగ్టన్ రూ.6, ఎస్‌కేఎఫ్ ఇండియా రూ.40, స్వరాజ్ ఇంజిన్స్ రూ.110, బాలాజీ అమీన్స్ రూ.11 తదితర కంపెనీలు కూడా డివిడెండ్లు అందించనున్నాయి. కార్పొరేట్ చర్యల్లో భాగంగా 29న కజారియా సెరామిక్స్ మరియు పటేల్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ కంపెనీలు షేర్ బైబ్యాక్ చేపట్టనున్నాయి.



# ఇరాన్‌వార్, ఇన్వెస్టర్ల ధోరణులే కీలకం

## ఈవారం మార్కెట్ ధోరణులపై స్టాక్ నిపుణుల దిక్సూచి

**ముంబయి, జూన్ 28:** అమెరికా–ఇరాన్ మధ్య తాజా సైనిక పరిణామాలు, వాటి ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల కదలికలు, దేశీయ ఆర్థిక గణాంకాలు వంటివి ఈ వారం ఈ వారం భారత స్టాక్ మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల పెట్టుబడి ధోరణి, నైరుతి రుతుపవనాల పురోగతి కూడా మార్కెట్‌పై ప్రభావం ఉంటుంది. రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా మాట్లాడుతూ ఈ వారం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ, హెచ్‌ఎస్‌బీసీ తయారీ, సేవలు, కాంపోజిట్ పీఎంఐ తుది గణాంకాలు, దేశ విదేశీ మారక నిల్వల వివరాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తారన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల మార్పులు, పశ్చిమాసియాలోని భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా కొనసాగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

జూలై 1న విడుదల కానున్న ఆటోమొబైల్ కంపెనీల నెలవారీ విక్రయాల గణాంకాలపై కూడా మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్‌ముడి ఆర్ మాట్లాడుతూ అమెరికా–ఇరాన్ మధ్య తాజా సైనిక పరిణామాల నేపథ్యంలో మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల ఆందోళనకు కారణమవుతున్నాయని తెలిపారు. పరిస్థితులు సద్దుమణిగితే మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ కొనసాగుతుందని, అయితే ఉద్రిక్తతలు మరింత పెరిగితే ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాలు, ఇంధన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా మాట్లాడుతూ ఈ వారం భారత్‌కు సంబంధించిన తయారీ పీఎంఐ, మే నెల పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలతో పాటు అమెరికా తయారీ సూచీ విడుదల కూడా మార్కెట్లకు కీలకం అవుతుంది.




# వచ్చేనెలలో వస్తున్న మార్పులు చేర్పులు ఇవే!

**ముంబయి, జూన్ 28:** మరోరెండురోజుల్లో జులై నెల ప్రారంభం అవుతున్న తరుణంలో వచ్చేనెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పలు నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు సామాన్యుల రోజువారీ జీవితంతో పాటు వారి ఖర్చులపై కూడా ప్రభావం చూపనున్నాయి. ఎల్పీజీ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు నిబంధనలు, ఆధార్ సేవలు, విమాన ప్రయాణాలు, కార్ల ధరల వరకు మొత్తం ఐదు ప్రధాన మార్పులు అమల్లోకి రానున్నాయి. ప్రతి నెల మొదటి తేదీ మాదిరిగానే జూలై 1న కూడా చమురు సంస్థలు ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరించనున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో వాణిజ్య ఎల్పీజీ ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఏవియేషన్ టర్బయిన్ ఫ్యూయెల్ ఎటిఎఫ్ ధరలను కూడా సవరించనుండటంతో విమాన టికెట్ ధరలపై ప్రభావం పడే అవకాశముంది హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రెగాలియా గోల్డ్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు కూడా కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఉచిత దేశీయ విమానాశ్రయ లాంజ్ సదుపాయాన్ని పొందాలంటే, గత త్రైమాసికంలో కనీసం రూ.60 వేల ఖర్చు చేసిన వారికే ఈ సౌకర్యం కొనసాగుతుంది. ఆధార్ కార్డు వినియోగదారులకు మాత్రం ఊరట లభించనుంది. యుఐడిఎనిర్ణయం ప్రకారం ఆధార్‌లో ఈమెయిల్ ఐడీని అప్‌డేట్ చేసుకునే సేవ జూలై 1 నుంచి డిసెంబర్ వరకు ఉచితంగా అందుబాటులో ఉంటుంది. గతంలో ఈ సేవకు రూ.75 రుసుము వసూలు చేసేవారు. కారు కొనుగోలు చేయాలనుకునే వారికి జూలై నెల నుంచి అదనపు భారం తప్పదు. కియా, టాటా మోటార్స్ వంటి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలు తమ వాహనాల ధరలను 1.5 శాతం నుంచి 2 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించాయి. దీంతో జూలై నుంచి కొత్త కారు కొనుగోలు మరింత ఖరీదుగా మారనుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.